thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 240 కరీంనగర్ శుక్రవారం, 7 నవంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## బీజేపీ బలమైన రాజకీయ ప్రత్యర్థి ఒవైసీ

న్యూఢిల్లీ : బీజేపీని 'బలమైన రాజకీయ ప్రత్యర్థి' అని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఆ పార్టీ, నేతలు కార్యకర్తలు రాత్రింబవళ్లు పని చేస్తారని ప్రశంసించారు. "బీజేపీని ఓడించడం అంత సులువు కాదు. తాను అనుకున్న పనిని రెప్పపాటు కాలంలో చేయగలదు. ప్రతిపక్షాలు బీజేపీని ఎదుర్కొవాలంటే దాని ప్రతి కదలికపై అప్రమత్తంగా ఉండాలి" అని ఏఎన్ఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. అలాగే, బిహార్‌లో ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశంపై తమ పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. రాహుల్ గాంధీ 'ఓట్ చోరీ' ఆరోపణలపై.. ఆయన తరపున మాట్లాడలేనని, కానీ బీజేపీలా పోరాట పటిమను చూపకపోతే ఆ పార్టీని ఓడించలేమని ఓవైసీ అన్నారు.




# కాయ్ రాజా కాయ్!

## జూబ్లీహిల్స్‌పై 'పందెం' రాయుళ్ల కన్ను!

## ఊపందుకున్న పందాలు!!

హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జూబ్లీహిల్స్ గెలుపోటములపై జోరుగా బెట్టింగ్స్ సాగుతున్నాయి. ఐపీఎల్ బెట్టింగులతో సమానంగా సాగుతుండటం గమనార్హం. గెలుపు, ఓటములతోపాటు అభ్యర్థి సాధించే మెజార్టీపైనా, సెకండ్ ప్లేస్ పై కూడా పందెం రాయులు బెట్టింగులు కాస్తున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నాలుగు లక్షల మంది ఓటర్లున్నా అందులో 50 శాతం మందే అభ్యర్థుల తలరాతలు మార్చవచ్చని నేతలు విశ్వసిస్తున్నారు. 2009లో 52.76% 2014లో 50.18%, 2018లో 45.59 %, 2023లో 47.49% ఓట్లు పోలవడమే తాము ఇలా విశ్లేషించడానికి కారణమని చెబుతున్నారు. అంటే మొత్తం ఓట్లలో 30 శాతం ఓట్లు తెచ్చుకున్న అభ్యర్థికి గెలుపు నల్లేరుపై నడకే అవుతుంది. ఏడు డివిజన్లు ఉన్న 'హిల్స్'ను గుప్పెట పట్టేందుకు పార్టీలు బలగాలను మోహరించాయి. ఏ ఓటరు ఎక్కడున్నారు.. ప్రత్యర్థి ప్రాంతాలు ఏవి.. ఏ సంఘాన్ని మచ్చిక చేసుకుంటే ఓట్లు మళు ్లతాయనే వ్యూహాలకు అధికార, ప్రతిపక్ష పార్టీలు పదును పెడుతున్నాయి. ఈ ఎన్నిక అటు అధికార పక్షానికి, ఇటు ప్రతిపక్షానికి ఈ ఎన్నిక ప్రతిష్టాత్మకం కానుంది. బీజేపీ కూడా ఇక్కడ పాగా వేయాలని ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఏ పార్టీకి ఆ పార్టీ సర్వేలు చేయించుకుంటోంది. విజయం తమదేనని ప్రచారం చేసుకుంటోంది. దీంతో మరో వైపు సర్వే సంస్థల పంట పండుతోంది. ఇదే క్రమంలో సర్వేలను చూస్తున్న బెట్టింగ్ రాయుళ్లు బుకీలను ఆశ్రయిస్తున్నారు. కూకట్ పల్లి కేంద్రంగా ఈ బెట్టింగులు సాగుతున్నట్లు తెలుస్తోంది. ముందుగా అడ్వాన్సులు తీసుకొని ఈ దందాకు దిగుతున్నారు. కొందరు పొలాలు కూడా రాయించుకుంటున్నారని సమాచారం. మూడు అంశాలపైనే ప్రధానంగా బెట్టింగ్ సాగుతోందని తెలుస్తోంది. గెలుపు ఓటములపై , రెండోది విజేత పది వేల కన్నా ఎక్కువ మెజార్టీ సాధిస్తాడా..? తక్కువ మెజార్టీ సాధిస్తాడా..? అన్నదానిపై మూడోది రెండో ప్లేస్ ఎవరికి వస్తుందనే దానిపైనే బెట్టింగులు ఉంటున్నాయి. సెకండ్ ప్లేస్ లో బీజేపీ ఉంటుందని కూడా కొందరు బెట్టింగులు కాస్తున్నారు. కొందరు బీజేపీకి డిపాజిట్ రాదని కూడా పందేలు కాస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. వాట్సాప్ గ్రూపులు, టెలిగ్రామ్ చానల్స్, ప్రత్యేక యాప్ ల ద్వారా ఈ బెట్టింగ్ దందా కొనసాగుతోంది. బెట్టింగుల మూలంగా ఎంతో మంది వీధిన పడ్డా.. ఆత్మహత్యలు చేసుకున్నా.. ఈ దందా మాత్ర ఆగడం లేదు.



## ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేయాలి: రోడ్డు భద్రతా కమిటీ ఛైర్మన్ జస్టిస్ సప్రే

హైదరాబాద్: చేవెళ్ల రోడ్డు ప్రమాదంపై సుప్రీంకోర్టు రోడ్డు భద్రత కమిటీ సమీక్ష నిర్వహించింది. సుప్రీంకోర్టు నియమించిన రోడ్డు భద్రతా కమిటీ ఛైర్మన్, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే, సభ్యులు సంజయ్ బందోపాధ్యాయ ఇవాళ హైదరాబాద్‌కు విచ్చేసి.. చేవెళ్ల రోడ్డు ప్రమాదంపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. చేవెళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి గల కారణాలను కమిటీ అడిగి తెలుసుకుంది. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి.. ప్రమాదం జరగడానికి గల కారణాలను కమిటీకి తెలియజేశారు. ఆర్టీసీ బస్సుల ఫిట్‌నెస్ మరోసారి తనిఖీ చేయాలని, వాటితో పాటు ఇతర బస్సులు, కమర్షియల్ వాహనాలను తనిఖీ చేసి ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేయాలని అధికారులను కమిటీ ఆదేశించింది. ప్రతి వాహనం ఇన్సూరెన్స్, పర్మిట్, ఫిట్‌నెస్ కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి విస్తరణ పనులను తొందరగా చేపట్టి పూర్తి చేయాలని ఎన్.హెచ్.ఎ.ఐ అధికారులకు సూచించారు. మైనింగ్ క్వారీల నుంచి పరిమితికి మించి లోడ్ వెళ్లకుండా చూడాలని మైనింగ్, రవాణా శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రత నిధిని ఏర్పాటు చేయాలని సూచించారు.

భద్రతా కమిటీ సమావేశంలో రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తి, అడిషనల్ డీజీ మహేష్ భగవత్, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, మైనింగ్ డైరెక్టర్ భవేశ్ మిశ్రా, జేటీసీలు చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య, ఆర్టీసీ, ఎన్.హెచ్.ఎ.ఐ అధికారులు పాల్గొన్నారు.




## చిన్న నిర్లక్ష్యం కూడా వద్దు.. పార్టీ నేతలు కలిసికట్టుగా పనిచేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విషయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా లేకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నాయకులకు సూచించారు.

జూబ్లీహిల్స్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, అందుబాటులో ఉన్న మంత్రులు పాల్గొన్నారు.

ఇప్పటికే మంత్రులు, సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు గడప గడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా గత నెల 31, ఈ నెల 1, 4, 5 తేదీల్లో నియోజక వర్గంలోని పలు డివిజన్లలో రోడ్ షోలు నిర్వహించడంతోపాటు కార్నర్ సమావేశాలు నిర్వహించారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో.. క్షేత్ర స్థాయి పరిస్థితులు, సర్వే నివేదికలు, పార్టీ నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాలు, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలు, వ్యూహ, ప్రతి వ్యూహాలు తదితర అంశాలపై సమీక్ష చేసినట్లు తెలుస్తోంది. మొత్తం మంత్రులందరికి బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్ రెడ్డి....ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది.

# నువ్వా.. నేనా!

## ఊపందుకున్న ప్రచార పర్వం!





## మారుతున్న రాజకీయ సమీకరణలు!!

హైదరబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్దీ రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. సర్వేల పేరిట మౌత్ టాక్ ఓటర్లను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రధాన పక్షాలు ప్రత్యర్థుల బలహీనతలను ప్రచారాస్త్రాలుగా చేసుకొని ఓటర్ల ఆలోచన విధానంలో మార్పు తేచ్చేందుకు పాట్లు పడుతున్నాయి. వ్యూహాలు, ప్రతివ్యూహాలతో బలమైన సామాజిక వర్గాలను అనుకూలంగా తమకు మల్చుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. ఆయా పక్షాల అగ్రనేతలు ప్రచార రంగంలోకి దిగడంతో మాటలు తూటాలు పేలుతున్నాయి. రోడ్ షోలు, కార్నర్ సభలకు పోటాపోటీగా జనసమీకరణలతో ప్రచార పర్వం ఊపందుకుంది. మరోవైపు క్షేత్ర స్థాయిలో ఓటర్లను గాలం వేసే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ప్రధాన పక్షాల బూత్‌ల వారీగా బాధ్యులు ఓటరు స్లిప్‌లు పంపిణీ చేస్తుండగా, మరో పక్షం మాత్రం దూకుడు పెంచి స్లిప్‌తో పాటు కొంత నగదు అడ్వాన్స్‌గా అందిస్తునట్లు ప్రచారం సాగుతోంది.

**కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకం..** అధికార కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ఇజ్జత్‌గా సవాల్ తీసుకొని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నా.. మారుతున్న ప్రజానాడిని సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రత్యర్థుల మౌత్ టాక్ ప్రభావం ఓటర్లపై పడకుండా ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. ఏకంగా సీఎం రేవంత్ రెడ్డి ఉప ఎన్నికను ఆషామాషీగా తీసుకోవద్దని పార్టీ భవిష్యత్ దృష్ట్యా బూత్ స్థాయి మేనేజ్‌మెంట్ పకడ్బందీగా జరిగేలా చర్యలు చేపట్టాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. అధికారంలో వచ్చిన తర్వాత రెండో ఉప ఎన్నిక కావడంతో కంటోన్మెంట్ మాదిరిగా జూబ్లీహిల్స్‌లో గెలుపు బావుటా ఎగురవేసి పరువు దక్కించుకునేందుకు ముమ్మరం ప్రయత్నాలు చేస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జూబ్లీహిల్స్ ఫలితాన్ని రెండేళ్ల పాలనపై ప్రజా తీర్పుగా చూపించే వ్యూహంతో అడుగులు వేస్తోంది. ఏ చిన్న అవకాశాన్ని కూడా వదలకుండా పావులు కదుపుతోంది. నియోజక వర్గంలో గత పదేళ్ల వైఫల్యాలను ఎత్తిచూపుతూ అభివృద్ధి సెంటిమెంట్‌ను ప్రజల్లోకి చొప్పించే ప్రయత్నం చేస్తోంది.

**వ్యూహాత్మకంగా బీఆర్ఎస్..** బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను పార్టీ భవిష్యత్తుతో ముడిపెట్టి చావోరేవోగా పరిగణిస్తోంది. ప్రత్యర్థుల మౌత్ టాక్‌కు అడ్డకట్ట వేసి ఎదురుదాడితో ఓటర్లను ఆకర్షించే విధంగా ప్రయత్నాలు చేస్తోంది. ప్రధానంగా రెండేళ్లలో ఆరు గ్యారంటీల బాకీ కార్డు ప్రయోగిస్తోంది. అధికారం కోల్పోయిన తర్వాత రెండో ఉప ఎన్నిక కావడంతో కంటోన్మెంట్ మాదిరిగా కాకుండా సిట్టింగ్ స్థానం పదిలం చేసుకొని పార్టీ బంగారు భవిష్యత్‌కు సంకేతం ఇవ్వాలని భావిస్తోంది. మూడు పర్యాయాలు ప్రాతినిధ్యం వహించిన సిట్టింగ్ స్థానం కావడంతో సానుభూతితో గట్టి ఓటు బ్యాంక్ పదిలపర్చుకునేందుకు వ్యూహాత్మకంగా పావులుకదుపుతోంది. పార్టీ యంత్రాంగాన్ని మొత్తం రంగంలో దింపి రెండేళ్ల కాంగ్రెస్ వైఫల్యాలను ప్రధాన ప్రచారాస్త్రాలుగా సంధిస్తోంది.

**పట్టు కోసం కమలదళం...** జూబ్లీహిల్స్‌లో పాగా వేసేందుకు బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. ప్రధాని మోదీ చరిష్మా, హిందుత్వ ఎజెండా ప్రయోగిస్తూ ఓటర్లను ఆకర్షించే పనిలో పడింది. రాష్ట్రంలో టార్గెట్-2028గా పావులు కదుపుతున్నా... పత్యర్థులకు దీటుగా ప్రచారంలో మాత్రం వెనుకబడినట్లు తెలుస్తోంది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని అసెంబ్లీ సెగ్మెంట్ కావడంతో ఎన్నికల ప్రచారాన్ని తన భుజస్కంధాలపై వేసుకున్నారు. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, మజ్లిస్‌తో కాంగ్రెస్ మిలాఖత్‌పై ప్రచారంతో ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డారు.




హైదరాబాద్, నవంబర్ 6: జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో తమ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి విజయాన్ని ఆశిస్తూ చేయనున్న ప్రచారంలో భాగంగా బోరబండలో బీజేపీ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ మీటింగ్‌కు పోలీసులు అనుమతి రద్దు చేశారు. షెడ్యూల్ ప్రకారం బండి సంజయ్ మీటింగ్ ఈరోజు సాయంత్రం బోరబండలో కొనసాగాల్సి ఉంది. తాజాగా ఆయన మీటింగ్ కు పర్మిషన్ ఇవ్వకపోవంతో పోలీసుల తీరుపై బీజేపీ శ్రేణుల మండిపడుతున్నాయి. కాంగ్రెస్ తమపై కుట్రలు చేస్తోందని, కనీసం ప్రచారం చేసుకోనివ్వకుండా ఇలా పర్మిషన్ కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అయితే తమ సభకు అనుమతి ఇచ్చి రద్దు చేయడమేంటని బీజేపీ ఎన్నికల ఇంఛార్జీ ధర్మారావు ప్రశ్నించారు. కచ్చితంగా సాయంత్రం బోరబండలోనే మీటింగ్ జరిపి తీరుతామని స్పష్టం చేశారు. బీజేపీ శ్రేణులంతా భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. బండి సంజయ్ సభకు ఆటంకాలు లేకుండా సహకరించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని వెల్లడించారు.




## చీమల ఫోబియాతో మహిళ షాకింగ్ నిర్ణయం.. సూసైడ్ నోట్ రాసి..

సంగారెడ్డి : అనేక మంది అనేక రకాల వ్యాధులతో, మానసిక ఇబ్బందులతో చనిపోతుంటారు. ఆరోగ్యం బాగాలేక, లైఫ్ ఫెయిల్యూర్ కావడం, డిప్రెషన్, లోన్ల ఒత్తిడి వంటి కారణాలతో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. కానీ ఇందుకు భిన్నంగా తాజాగా జరిగిన ఓ ఘటన తీవ్రంగా కలిచివేస్తోంది. ఎలాంటి ఆరోగ్య సమస్యలు, ఫైనాన్సియల్ సమస్యలు, లైఫ్ ఫెయిల్యూర్ వంటి సమస్యలు లేకపోయినా ఆమె చనిపోయింది. ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి ముందు రాసిన సూసైడ్ నోట్ ఒక్కసారిగా షాక్ కు గురి చేస్తోంది. ఇలా కూడా చనిపోతారా? వామ్మో అంటూ ఈ విషయం తెలుసుకున్నవారు ఆశ్చర్యానికి గురవుతున్నారు. తెలంగాణలో జరిగిన ఈ ఘటన తీవ్రంగా కలచివేస్తోంది. ఓ మహిళ అనూహ్యంగా మరణించిన ఘటన సంగారెడ్డి జిల్లాలో జరిగింది. చీమల ఫోబియాతో ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. అమీన్ పూర్ మున్సిపాలిటీలోని శర్వా హోమ్స్ లో మనీషా ఉరి వేసుకొని సూసైడ్ చేసుకుంది. చీమల ఫోబియాతో తాను చనిపోతున్నానని, తన కూతురు జాగ్రత్త అంటూ సూసైడ్ నోట్‌లో పేర్కొంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చీమల ఫోబియాతో మహిళా చనిపోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గృహిణి మరణించడంతో ఆ గ్రామంలో విషాదం నెలకొంది.




హైదరాబాద్, నవంబర్ 6: గ్రూప్ 1లో ఎంపికైన 115 మంది డీఎస్పీలకు ట్రైనింగ్ కార్యక్రమం ప్రారంభమైంది. ఈరోజు (గురువారం) ఉదయం డీజీపీ శివధర్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీజీపీఏకు చేరుకున్న డీజీపీకి టీజీపీఏ డైరెక్టర్ అభిలాష బిస్త్ గౌరవ వందనంతో స్వాగతం పలికారు. రాజేంద్రనగర్‌లోని టీజీపీఏలో ప్రొబేషనరీ డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)లకు ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. 115 మందితో ఇదే అతిపెద్ద డీఎస్పీ బ్యాచ్ అని అన్నారు. ఈ 10 నెలలు చాలా కష్టంగా ఉంటుందని.. అన్నింటినీ ఎదుర్కొని సమర్థవంతంగా నిలుస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. పోలీస్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూనే ప్రజల హృదయాలు గెలవగలగాలని నిర్దేశించారు. కొత్తగా రిక్రెట్ అయిన మహిళా డీఎస్పీలు వచ్చే తరానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ట్రైనింగ్‌లో స్నేహపూర్వకంగా ఉంటూ.. ఒకరికి ఒకరు తోడ్పాటు అందించుకోవాలని సూచించారు. ఇంటెగ్రిటీ, ఎంపథీ, ప్రొఫెషనల్ ఎక్స్‌లెన్స్.. ఈ మూడు ముఖ్యంగా గుర్తించుకోవాలని అన్నారు. ఈ వంద మంది ట్రైనింగ్‌లోనే కాదు.. బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా కాంటాక్ట్‌లో ఉండాలని తెలిపారు. పోలీసింగ్‌కు నెట్వర్క్ చాలా ముఖ్యమని ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.



## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై BRS నేతల ఫిర్యాదు

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై భారత రాష్ట్ర సమితి మైనార్టీ నేతలు ఎన్నికల ప్రధానాధికారికి (సీఈవో) ఫిర్యాదు చేశారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే షకీల్‌తో మైనార్టీ నేతలు సీఈవో కార్యాలయానికి వచ్చారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి ముస్లింలపై బెదిరింపు ధోరణితో ప్రసంగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ఆయన మాట్లాడారని ఆక్షేపించారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.







## వారికి కనకవర్షం.. పసిడి బాండ్లపై గ్రాముకు రూ.9 వేలు లాభం!

లోహం రూపంలో బంగారం కొనుగోలు చేసేవారిని దృష్టిలో పెట్టుకొని తీసుకొచ్చిన సార్వభౌమ పసిడి బాండ్లు మదుపర్లకు కనకవర్షం కురిపిస్తున్నాయి. 8 ఏళ్ల కాలవ్యవధితో జారీ చేసిన ఈ బాండ్లలో పెట్టుబడి పెట్టిన వారికి తాజాగా 316 శాతం ప్రతిఫలం లభించింది. గ్రాముకు రూ.9,121 చొప్పున లాభం వచ్చింది. ఇటీవల బంగారం ధర అమాంతం పెరిగిన వేళ.. అప్పట్లో ఈ బాండ్లలో పెట్టుబడిన పెట్టిన వారికి భారీ స్థాయిలో ప్రతిఫలం లభిస్తోంది. 2017 నవంబర్ 6న జారీ చేసిన పసిడి బాండ్లకు సంబంధించిన రిడెంప్షన్ తేదీని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (%=దీ×%) తాజాగా ప్రకటించింది. 2017-18 సిరీస్-%ఎ×% బాండ్లకు సంబంధించి గ్రాము పసిడి ధర అప్పట్లో రూ.2,895గా నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసినవారికి మరో రూ.50 డిస్కౌంట్ కూడా ఇచ్చారు. ఈ బాండ్ల కాలపరిమితి 8 ఏళ్లు పూర్తికావడంతో తాజాగా మెచ్యూరిటీకి వచ్చాయి. 999 స్వచ్ఛత కలిగిన బంగారం గ్రాము ధరను రూ.12,066గా ఆర్‌బీఐ నిర్ణయించింది. ఈ మొత్తం నుంచి కొనుగోలు ధరను మినహాయిస్తే ఒక్కో గ్రాముపై రూ.9,121 ప్రతిఫలం వచ్చింది. దీన్ని శాతాల్లో లెక్కిస్తే 316 శాతం అవుతుంది. దీనికి ఏటా చెల్లించే 2.5 శాతం వడ్డీ అదనం. దేశంలో భౌతిక బంగారం కొనుగోళ్లను తగ్గించాలన్న ఉద్దేశంతో 2015 నవంబర్‌లో ఆర్‌బీఐ ఈ పథకం తీసుకొచ్చింది. వీటి కాలపరిమితి 8 ఏళ్లు. గ్రాము ధర నిర్ణయించేందుకు రిడెంప్షన్‌కు ముందు వారం చివరి మూడు రోజుల ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ లిమిటెడ్ నిర్ణయించిన సగటు ధరను పరిగణనలోకి తీసుకుంటారు. అలా గ్రాము ధరను రూ.12,066గా నిర్ణయించారు. ఈ బాండ్లపై వచ్చిన ప్రతిఫలానికి ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించక్కర్లేదు. అయితే, ఈ పథకం వల్ల ఖజానాపై భారం పడటంతో బాండ్ల జారీని ప్రభుత్వం నిలిపివేసింది.




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సవాలు చేసి మరీ 34 ఏళ్ల భారత సంతతి యువకుడు జోహ్రాన్ మమ్దానీ న్యూయార్క్ మేయర్‌గా విజయం సాధించారు.

దీనిపై ట్రంప్ స్పందించారు. విజయం అనంతరం మమ్దానీ ఇచ్చిన ప్రసంగం ఆవేశపూరితంగా ఉందని వ్యాఖ్యానించారు. ఈ కొత్త మేయర్ కమ్యూనిస్ట్ భావజాలం కలిగిన వ్యక్తి అని మరోసారి విమర్శించిన ఆయన.. న్యూయార్క్ నగరం కమ్యూనిస్ట్ క్యూబా, సోషలిస్ట్ వెనెజువెలా వలే మారుతుందని విమర్శలు గుప్పించారు. ఈ నగర ప్రజలు ఫ్లోరిడాకు పారిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. "నవంబర్ 5, 2024న ఏర్పడిన ప్రభుత్వం (అధ్యక్షుడిగా తన విజయాన్ని ఉద్దేశించి) సార్వభౌమత్వాన్ని పునరుద్ధరించింది. ముందురోజు రాత్రి న్యూయార్క్‌లో ఆ సార్వభౌమత్వాన్ని కొద్దిమేర కోల్పోయాం. అయితే మేం దానిని జాగ్రత్తగా చూసుకుంటాం" అని ఫ్లోరిడా రాష్ట్రంలోని మయామి నగరంలో అమెరికా బిజినెస్ ఫోరంలో ట్రంప్ మాట్లాడారు. ఇదిలాఉంటే.. మమ్దానీ విజయంలో అత్యంత కీలకమైన హామీ ఉచిత సిటీబస్సు ప్రయాణాలు. దీంతోపాటు నగరంలో అద్దెలను స్థిరీకరిస్తానని, యూనివర్సల్ చైల్డ్ స్కీమ్ అమలు, 2030 నాటికి కనీస వేతనాల పెంపు, కార్పొరేట్లు, సంపన్నులపై పన్ను పెంచి చిరుజీవుల జీవన వ్యయాలను తగ్గిస్తానని ప్రచారంలో పేర్కొని ఓటర్లను ఆకర్షించిన సంగతి తెలిసిందే.

**నాడు వద్దనుకుని.. నేడు ఆయనకే పట్టం...** వీటిని ఉద్దేశించి ట్రంప్ మాట్లాడారు. "డెమోక్రాట్లు అమెరికాకు ఏం చేయాలని అనుకుంటున్నారో మీరు చూడాలనుకుంటే.. న్యూయార్క్ ఎన్నికల ఫలితాన్ని గమనించండి. అక్కడ ఆ పార్టీ కమ్యూనిస్ట్‌ను మేయర్‌గా ఎంచుకుంది. ఇక్కడి కమ్యూనిజం ప్రభావంతో పారిపోయే వారికి మయామి ఒక ఆశ్రయ స్థానంగా మారనుంది" అని వ్యాఖ్యలు చేశారు. కాగా.. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లోనే ట్రంప్‌నకు ప్రతికూల ఫలితాలు వచ్చాయి. ఆయన పార్టీకి చెందిన అభ్యర్థులను పలు రాష్ట్రాల ప్రజలు తిరస్కరించారు. ఇటీవల వర్జీనియా, న్యూజెర్సీల్లో నిర్వహించిన పోల్‌లోనూ దేశంలో నెలకొన్న తాజా పరిణామాలపై ప్రతి 10 మందిలో ఆరుగురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తేలింది. కేవలం మూడులో ఒకవంతు మాత్రమే ప్రస్తుత పాలనపై సంతృప్తిగా ఉన్నామని చెప్పారు. ఈ ఎన్నికల ఫలితాలపై 'బిగ్ బ్యూటిఫుల్' బడ్జెట్ బిల్లు సహా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు వంటి ట్రంప్ ప్రభుత్వ విధానాలు ప్రభావం చూపాయనే వాదన వినిపిస్తోంది.

## జూబ్లీహిల్స్ వెనుకబాటుకు బీఆర్ఎస్ కూడా బాధ్యత వహించాలి: కిషన్‌రెడ్డి




హైదరాబాద్, నవంబర్ 6: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అనేక సమస్యలున్నాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గ్రామస్థాయిలో ఉండే అభివృద్ధి కూడా జూబ్లీహిల్స్‌లో లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఏ పార్టీకి ఓటు వేయాలనే దానిపై ఓటర్లు ఇంకా నిర్ణయానికి రాలేదని.. అందుకే సర్వేల్లో కూడా స్పష్టత లేదని కిషన్ రెడ్డి అన్నారు. ఇవాళ ఆయన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను కిషన్ రెడ్డి కోరారు. జూబ్లీహిల్స్ వెనుకబాటుకు BRS కూడా బాధ్యత వహించాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, గ్యారెంటీలపై కాంగ్రెస్ స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యంలో మెజార్టీ వాటా కేంద్రానిదేనని కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. దీనికి సంబంధించి ఒక పోస్ట్ ను కూడా కిషన్ రెడ్డి తన సోషల్ మీడియా అకౌంట్లో పెట్టారు. 'ముస్లింలు కాంగ్రెస్ పార్టీకి 'ఇజ్జత్' అంటావు, మరి హిందువులు ఇజ్జత్ కాదా మిస్టర్ రేవంత్ రెడ్డి? మీ కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందువులకు గౌరవం లేదా? ఎర్రగడ్డలో ఖబరస్థాన్ కోసం స్థలం ఇచ్చేందుకు మనసొచ్చింది కానీ, బంజారాహిల్స్‌లో పెద్దమ్మ తల్లి గుడికి 50 గజాలు స్థలం ఇవ్వడం ఎందుకు కుదరలేదు. హిందువులపై దాడులు జరుగుతున్నా పట్టించుకోవు. ఎన్నాళ్లు మజ్లిస్‌ను భుజాన ఎక్కించుకోని తిరుగుతావో తిరుగు. ప్రజలే నీకు గట్టి బుద్ధి చెబుతారు.'అంటూ కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు.

## భూ వివాదం.. తుపాకీతో కాల్చి పారేస్తామని బెదిరింపు




మెదక్ : భూ వివాదంలో తుపాకీ కలకలం సృష్టించిన ఘటన మెదక్ జిల్లాలో జరిగింది. హావేలి ఘనాపూర్ మండల కేంద్రం శివారులో రైతు సిద్దమ్మకు గ్రామంలో కొందరితో భూ తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో భూ వివాదంపై మెదక్ జిల్లా కోర్టు నుంచి సిద్దమ్మ ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారు. దీంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రత్యర్థులు.. గ్రామ శివారులోని పొలం వద్ద సిద్దమ్మ సహా ఆమె కుటుంబీకులను తుపాకీతో బెదిరించారు. భూమి వద్దకు వస్తే తుపాకీతో కాల్చి పారేస్తానంటూ బెదురింపులకు దిగారు. దీంతో భయాందోళనకు గురైన బాధిత కుటుంబం పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించారు. తమను బెదిరించారని, కాల్చేస్తామంటూ బయపెట్టారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ఫుల్‌గా డ్రగ్స్ తీసుకున్నాడు.. చివరకు చూడగా..

హైదరాబాద్, నవంబర్ 6: డ్రగ్స్ భూతం యువతను పట్టిపీడిస్తోంది. డ్రగ్స్‌కు అనేక మంది యువత బానిసలుగా మారిపోతున్నారు. ఎక్కడపడితే అక్కడ డ్రగ్స్ ఈజీగా లభ్యం అవుతుండడంతో యువత డ్రగ్స్‌ను విచ్చలవిడిగా వాడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న అనేక మంది డ్రగ్స్ భూతానికి బలైపోతున్నారు. తమ బంగారు భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకుంటూ తల్లిదండ్రులకు శోకాన్ని మిగులుస్తున్నారు. ఇటీవల కాలంగా హైదరాబాద్‌లో తరచుగా డ్రగ్స్ పట్టుబడటం కూడా తీవ్ర కలకలం రేపుతోంది. పోలీసులు అనేక ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఏదో ఒక విధంగా సిటీలోకి డ్రగ్స్ ఎంటరవుతూనే ఉంది. తాజాగా డ్రగ్స్ తీసుకుని ఓ వ్యక్తి మరణించడం సంచలనంగా మారింది. డ్రగ్స్ ఓవర్ డోస్‌తో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. రాజేంద్రనగర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. మొబైల్ రిపేర్ బిజినెస్ చేస్తున్న అలీ డ్రగ్స్‌కు బానిసగా మారాడు. డ్రగ్స్ తీసుకోకుండా ఉండలేని పరిస్థితికి వచ్చాడు. ఈ క్రమంలో నిన్న ఒక అపార్ట్‌మెంట్‌లో అలీ డ్రగ్స్ సేవించాడు. అయితే డ్రగ్స్ ఓవర్ డోస్‌గా తీసుకోవడంతో అలీ ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలిసిన వెంటనే రాజేంద్రనగర్ పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అసలు అలీకి డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చింది?... ఎవరి దగ్గర తీసుకున్నాడు? అలీకి డ్రగ్స్‌ను ఎవరు విక్రయించారు? అనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

చురకలు



# శాస్త్ర పరిశోధనలో సిద్ధి పొందిన తాపసి సి.వి.రామన్ - నవంబర్ 7 ... సి.వి.రామన్ జయంతి



విజ్ఞాన ఆవిష్కరణల్లో భారతీయులకు నోబెల్ రావడం గగన సదృశం. సర్ సివి రామన్ ఆ ఘనత సాధించారు. అంతేకాదు, విజ్ఞాన శాస్త్రంలో అఘనత సాధించిన ఏకైక ఆసియా వాసిగానూ ఖ్యాతి గడించారు. సైన్సులో ఎవరూ చేయలేని సాహసాలను అత్యంత సునాయాసంగా చేసి చూపించి, విశ్వ వినువీధిలో భారత కీర్తి పతాకాన్ని రెపరెప లాడించిన మహా జ్ఞాని చంద్రశేఖర్ వెంకటరామన్ (సి వి రామన్). వైజ్ఞానిక రంగంలో ప్రపంచ దేశాలను తలదన్నేలా భారత్‌ను శక్తివంతంగా చూపి, అబ్బుర పరిచే ప్రయోగాలకు నిలువెత్తు వేదికలా నిలిచారు సర్ సివి రామన్. వైజ్ఞానిక రంగంలో తొలి నోబెల్ అందుకున్న భారతీయ ఘని. ఒక్క మాటలో చెప్పాలంటే వైజ్ఞానిక శాస్త్రానికే వైద్యుడిలా మారిన మహోన్నతుడు. ఆధునిక భారత విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనా ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప జేసిన వ్యక్తుల్లో సర్ సివి రామన్ మొదటివారు. సీవీ రామన్ నవంబర్ 7, 1888 తమిళనాడులోని తిరుచురాపల్లిలో జన్మించారు. తండ్రి చంద్రశేఖర్ అయ్యర్, తల్లి పార్వతి అమ్మాళ్. తండ్రి విశాఖపట్నంలోని ఏవీఎన్ కళాశాలలో లెక్చరర్ గా పని చేయడం వల్ల రామన్ బాల్యం, విద్యాభ్యాసం అక్కడే జరిగింది. అనంతరం మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో చేరి 19 ఏళ్లకు ఫిజిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. ఆ తర్వాత తల్లిదండ్రుల కోరిక మేరకు ఐసీఎస్ పాసై కలకత్తా ప్రభుత్వ ఆర్థికశాఖలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్‌గా చేరారు. ఆ సమయం లోనే పరిశోధనలపై ఆసక్తి పెంచుకున్నారు. పరిశోధనల కోసం భారతీయులు విదేశాలకు వెళ్లడమేమిటి?. విదేశీయులే.. పరిశోధనల కోసం ఇక్కడకు రావాలని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి రామన్. రామన్ ముందు వరకూ సైన్స్‌లో నోబెల్ బహుమతులు పాశ్చాత్యులకే దక్కేవి. కానీ, రామన్ అచ్చమైన భారతీయునిగా ఈ గడ్డపైనే చదువుకొని, తలమానికమైన పరిశోధన జరిపి సైన్సులో దేశ శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పి భారత్ కు నోబెల్ సాధించి పెట్టారు. 'నా మతం సైన్సు.. దానినే జీవితాంతం ఆరాధిస్తా..' అని చెప్పి తుదిశ్వాస వరకూ శాస్త్రాన్వేషణ లోనే గడిపిన దార్శనికుడు. "విజ్ఞాన శాస్త్ర సారాంశం, ప్రయోగ శాలల పరికరాలతో వికసించదు. నిరంతర పరిశోధన, స్వంతంత్రంగా ఆలోచించే ప్రవృత్తి ఇవే విజ్ఞాన శాస్త్ర సాగరాన్ని మథించి వేస్తాయి" అంటూ ఆయన చేసిన ప్రసంగం నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. ఉదయాకాశంలోని వెలుగుల్లో చెట్లు ఎంత అందంగా కనబడతాయో మీరు ఎప్పుడైనా గమనించారా? నాకు వీటిని చూస్తూ ఉంటే స్ఫటిక నిర్మాణం గురించిన ఆలోచనలు వస్తుంటాయి. అందుకే "విజ్ఞానం అత్యుత్తమైన సృజనాత్మక కళారూపం అని రామన్ ఎప్పుడూ చెబుతుండే వారు. మెర్క్యూరీ ల్యాంప్ నుండి ఏకవర్ణ కాంతి తరంగాలను ఒక పారదర్శక యానకం గుండా ప్రసరింపజేస్తే, యానక ధర్మాలపై ఆధారపడి ఆ కాంతిలో కొంత భాగం వివర్తనం చెంది, తక్కువ తరంగ దైర్ఘ్యం గల కాంతిగా బహిర్గత మౌతుంది. సముద్ర జలంపై ఇదే ప్రక్రియతో నీలి రంగు కాంతి బహిర్గతమవుతుంది. దీనినే 'రామన్ ఫలితం' (రామన్ ఎఫెక్ట్) అంటారు. రామన్ జీవితంలో మరో మైలురాయి రామన్ ఎఫెక్ట్ సిద్ధాంతం. వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని, దాని వల్లనే అది తన గమనాన్ని మార్చుకుంటుందని తన సిద్ధాంతాల ద్వారా రుజువు చేశారు రామన్. అప్పటికున్న అరకొర సదుపాయాలతోనే మన దేశ విజ్ఞాన కిరణాలను నలుదిశలా ప్రసరింప జేశారు. సూర్యుని నుంచి వెలువడే తెలుపు వర్ణపు కాంతి వాయువులోని అణువులపైన పడి, వాటి ప్రయాణ దిశను మార్చు కుంటాయని తన పరిశోధనల ద్వారా తెలుసుకున్న సి.వి. రామన్ ఓ సిద్ధాంతాన్ని సూత్రీకరించారు. వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని 1928 సంవత్సరం, ఫిబ్రవరి 28న రామన్ మొట్ట మొదటిసారి ప్రకటించారు. పారదర్శకంగా ఉన్న ఘన లేదా ద్రవ లేదా వాయు మాధ్యమం గుండా కాంతిని ప్రసరింప చేసినప్పుడు ఆ కాంతి తన స్వభావాన్ని మార్చు కుంటుంది. ఈ విషయాన్ని 1928 మార్చి 16 న బెంగుళూరులో జరిగిన శాస్త్రజ్ఞుల సదస్సులో చూపించాడు. అతను అనుకున్నట్లే 1928 ఫిబ్రవరి 28 న "రామన్ ఎఫెక్ట్" ఆవిష్కరించడం జరిగింది. ఈ పరిశోధనను అభినందిస్తూ బ్రిటీష్ ప్రభుత్వం 1929 లో "నైట్ హుడ్" బిరుదుతో సత్కరించింది. ఈ రామన్ ఎఫెక్ట్ అసామాన్య మైనదని, అందులో 200 రూపాయలు కూడా ధర చేయని పరికరాలతో ఆ విషయ నిరూపణ జరగడం అద్భుతమైనదని ప్రపంచ శాస్త్రజ్ఞులంతా రామన్ ను అభినందించారు. అఖండ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందిన రామన్ కు ఎన్నో గౌరవ డాక్టరేట్లు లభించాయి. 1924 లో ఇంగ్లండ్ "రాయల్ సొసైటీ" సభ్యుడయ్యాడు. 1928 లో రామన్ కు "సర్" బిరుదు దక్కింది. 1947 లో ప్రతిష్ఠాత్మక "ఫ్రాంక్లిన్ మెడల్" లభించింది. తన అనన్య సామాన్య పరిశోధనా సామర్థ్యంతో ఫిజిక్స్ రంగంలో రామన్ ఎఫెక్ట్ కనుగొని చరిత్ర సృష్టించిన ఫిబ్రవరి 28 నే జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపు కొంటున్నాం. 1987 ఫిబ్రవరి నుండి ప్రతి సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని భారత ప్రభుత్వం అధికారకంగా జరుపుతోంది. రామన్ సూటికి సూరుపాళ్లు భారతీయునిగా ఈ గడ్డపైనే చదువుకొని, పరిశోధనలు జరిపి సైన్సులో శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పి భారత్ కు నోబెల్ సాధించి పెట్టారాయన. 1913 లో సాహిత్యంలో మనదేశం నుండి నోబెల్ బహుమతి పొందిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అనంతరం సైన్సు రంగంలో విజయ ఢంకా మోగించిన అఖండ ప్రజ్ఞాశాలి రామన్ ఒక్కరే కావడం విశేషం. రామన్ పరిశోధనల ఫలితాలు అనేక రంగాలలో కొత్తపుంతలు తొక్కడానికి దారితీసింది. శాస్త్ర రంగంలో రామన్ స్పెక్ట్ స్కోప్ ఆవిర్భావానికి "భారతరత్న", 1957 లో "లెనిన్ శాంతి బహుమతి" లభించాయి. కాంతి ప్రసరణపై జరిపిన పరిశోధనలకు "నోబెల్ బహుమతి" లభించింది. స్వాతంత్ర్యం రాగానే రామన్ కు మొట్టమొదటి నేషనల్ ప్రొఫెసర్ గా ప్రభుత్వం నియమించి గౌరవించింది. 1948 లో బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ గా రిట్కెరయ్యారు. దృష్టి, కాంతి, ధ్వని, వర్ణాలు, ద్రవాల తలతన్యత, ఖనిజాలు, డైమండ్, క్రిస్టల్ తదితర అంశాలపై పరిశోధనలు జరిపిన సి.వి. రామన్ సుమారు 465 పరిశోధన పత్రాలను వెలువరించారు. వాటిని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగుళూరు వారు సేకరించి భద్రపరిచారు. 1949 లో బెంగుళూరులో రామన్ రీసెర్చి ఇన్స్టిట్యూట్ స్థాపించి, 1970 నవంబరు 27 న ఆయన మరణించే వరకూ, ఆ సంస్థలో పరిశోధనలు జరిపి, మన దేశంలో సైన్సు అభివృద్ధికి మార్గదర్శకు లయ్యారు. 1971 నవంబర్ 21 న సీ.వీ. రామన్ పోస్టేజి స్టాంపును భారత ప్రభుత్వం వెలువరించి ఆ మహా శాస్త్రజ్ఞుడిని గౌరవించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# బహుముఖ ప్రజ్ఞాశాలి కమల్ హాసన్ - నవంబర్ 7... సహజ నటుని జన్మదినం



కమల్ హాసన్ విశిష్ట నటుడే కాదు ఒక విచిత్రమైన వ్యక్తి, మంచి కథకుడు, స్క్రీన్ ప్లే రచయిత, నిర్మాత, దర్శకుడు... అజ్ఞాత సంగీత దర్శకుడు కూడా. తను నటించే సినిమాలో ఏదో ఒక ప్రత్యేకత వుండాలని, రొటీన్ పాత్రలకు అది భిన్నంగా వుండాలని కోరుకునే వ్యక్తి. దక్షిణభారత చలనచిత్ర పరిశ్రమ నుంచి బాలీవుడ్‌కు వెళ్లి అక్కడ కూడా తన ప్రత్యేకతను నిలుపుకున్న ఒక మంచి నటుడు. చలన చిత్రరంగానికి ఆయన ఒక 'వసూల్ రాజా'. భారతీయుడు సినిమా రెండు వందల మిలియన్లు ఆర్జించి పెట్టిన విషయం ఈ మాటను నిజం చేసింది. నవంబర్ 7, 1954న తమిళనాడులోని రామనాథపురానికి చేరువలో వున్న పరమక్కుడి పట్టణంలో జన్మించాడు. కమల్ హాసన్ అసలు పేరు పార్థసారథి శ్రీనివాసన్. తండ్రి డి.శ్రీనివాసన్ న్యాయవాద వృత్తిలో వుండేవారు. కమల్ తల్లి రాజలక్ష్మి మంచి డ్యాన్సర్. కమల్ ప్రాథమిక విద్యాభ్యాసం పరమక్కుడిలోనే జరిగింది. తరువాత వారి కుటుంబం మద్రాసులో స్థిరపడింది. మైలాపూరులోని శాంతోం పాఠశాలలో కమల్ చదువు కొనసాగింది. 1960 అక్టోబరులో కళత్తూర్ కన్నమ్మ' సినిమాలో నటించాడు. ఆ సినిమాను తెలుగులో 'మావూరి అమ్మాయి' పేరుతో అనువదించి ఆంధ్రదేశంలో విడుదల చేయగా. తొలి ప్రయత్నంలోనే ఉత్తమ బాలనటుడుగా రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నాడు. కమల్ తల్లి రాజలక్ష్మి తంగప్పన్ వద్ద నాట్యం నేర్చుకుంటూ వుండేది. ఆ సమయంలోనే కమల్ చదువుకుంటూనే కొన్ని సినిమాలలో చిన్నచిన్న పాత్రలు పోషిస్తూ ఉండేవాడు. అలా తన తొలి వెండితెర పరిచయం 1970లో విడుదలైన శాండో చిన్నప్ప దేవర నిర్మించిన 'మాణవన్' చిత్రం లో కమల్ కుట్టి పద్మిని చేసే డ్యాన్స్ సన్నివేశంలో ఆమెతో కలిసి కనిపిస్తాడు. డ్యాన్స్ డైరెక్టర్ తంగప్పన్ నిర్మించి దర్శకత్వం వహించిన 'అణ్ణై వేలంకణ్ణి' సినిమాలో కాసేపు జీసస్ క్రైస్టగా కనిపిస్తాడు. కమల్ కొంతకాలం తంగప్పన్ వద్ద సహాయకుడిగా ఉంటూ డ్యాన్స్ నేర్చుకున్నారు. 1973లో ముత్తురామన్ నిర్మించిన 'కాశి యాత్తిరై' సినిమాలో తంగప్పన్‌కు సహాయ డ్యాన్స్ డైరెక్టర్‌గా పనిచేశాడు. అదే సంవత్సరం కె.బాలచందర్ తొలిసారి కమల్ హసన్ చేత 'సొల్లత్తాన్ నినిక్కిరేన్' అనే సినిమాలో ఒక ప్రతినాయకుడిగా ప్లేబాయ్ పాత్రను పోషింపజేశారు. తరువాత 'అరంగేట్రం' సినిమా విజయంతో హిందీలో పునర్నిర్మించిన 'ఆయినా' సినిమాలో రాజేష్ ఖన్నాతోబాటు కమల్ కూడా నటించారు. హిందీలో అతడు నటించిన తొలి చిత్రం ఇదే కావడం విశేషం. తరువాత 1974లో తమిళంలో చాలా సహాయక పాత్రలు పోషిస్తూ వచ్చాడు. వాటిలో 'గుమస్తావిన్ మగళ్', ' 'నాన్ అవనిల్లై' సినిమాలు ముఖ్యమైనవి. సేతుమాధవన్ మలయాళంలో నిర్మించిన 'కన్యాకుమారి' సినిమాలో హీరోగా నటించే అవకాశం వచ్చింది. అందులో రీటా భాదురి హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాలో నటనకు కమల్‌కు తొలి ఫిలింఫేర్ బహుమతి లభించింది. 1975లో బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన 'అపూర్వ రాగం' (తెలుగులో తూర్పు పడమర) సినిమా హీరోగా మంచి బ్రేక్ ఇచ్చింది. రజనీకాంత్ ఈ సినిమాతోనే తెరంగేట్రం చేశాడు. ఈ సినిమాకు కమల్‌కు ఇది రెండవ ఫిలింఫేర్ బహుమతి. బాలచందర్ దర్శకత్వంలో 1976లో 'మన్మథ లీలై' అనే సినిమా లో కమల్ హీరో. ఈ సినిమాతోనే జయప్రద, వై.విజయ, హేమా చౌదరి తొలిసారి వెండితెరకు పరిచయమయ్యారు. విజయవంతమైన ఈ చిత్రాన్ని తెలుగులో 'మన్మథలీల'గా, హిందీలో 'మీఠీ మీఠీ బాతే'గా 1977లో డబ్ చేశారు. ఈ చిత్రం కమల్‌కు ఒక ట్రెండ్ సెట్టర్‌గా నిలిచి అతనికి హీరోగా మంచి హోదా కలిపించింది. ఈ సినిమా తరువాత వచ్చిన ముత్తురామన్ సినిమా 'ఒరు ఊధప్పు కన్ సిముట్టిగిరదు'లో కమల్, సుజాత నటించారు. కమల్‌కు మూడవసారి ఫిలింఫేర్ బహుమతి తెచ్చిపెట్టిన చిత్రమిది. ఈ రెండు సినిమాలతో కమల్ తమిళ చిత్రరంగంలో స్థిరపడిపోయారు. తరువాత వచ్చిన మరో బాలచందర్ సినిమా 'అవర్గ' (ఇది కథ కాదు) కమల్ హాసన్ హోదాను పెంచింది. బాలచందర్ దర్శకత్వం వహించిన మరొక చిత్రం 'మూండ్రు ముడిచ్చు' (ఓ సీత కథ) కూడా మంచి హిట్టయింది. ఈ సినిమా ద్వారా శ్రీదేవి 13 ఏళ్ల ప్రాయంలో హీరోయిన్‌గా నటించింది. రజనీకాంత్ విలన్ పాత్ర పోషించాడు. భారతీరాజా దర్శకత్వం వహించిన 'పత్తినారు వయత్తినిలే' (తెలుగులో పదహారేళ్ల వయసు)లో కమల్ పోషించిన పాత్రకు ఫిలింఫేర్ అవార్డుతోబాటు తమిళనాడు రాష్ట్ర బహుమతి కూడా లభించింది. కమల్ హాసన్ కన్నడంలో బాలుమహేంద్ర నిర్మించిన 'కోకిల' సినిమాలో తొలిసారి నటించారు. అదే సంవత్సరం 'అవళ్ ఒరు తొడర్ కథై' సినిమాను 'కబిత' పేరుతో బెంగాలి భాషలో పునర్నిర్మిస్తే అందులో హీరోగా కమల్ నటించారు. కమల్ తెలుగులో నటించిన తొలి స్ట్రెయిట్ సినిమా 'అంతులేని కథ' (1976). అప్పుడే 'మన్మథలీల' డబ్బింగ్ వర్షన్ కూడా విడుదలైంది. ఈ రెండు సినిమాలు ఆంధ్ర రాష్ట్రంలో శతదినోత్సవాలు చేసుకున్నాయి. కాగా 'మరోచరిత్ర' సినిమా రెండవ స్ట్రెయిట్ చిత్రం, . బాలచందర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని బాలచందర్ హిందీలో 'ఏక్ దూజే కేలియే' చిత్రంగా నిర్మిస్తే ఆ సినిమా రికార్డుల మీద రికార్డులు సృష్టించింది. కమల్ హీరోగా, శ్రీదేవి హీరోయిన్‌గా 'సిగప్పు రోజాక్కళ్' సినిమాలో నటనకు నాల్గవసారి ఫిలింఫేర్ బహుమతి గెలుచుకున్నారు. దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెలుగులో 'సొమ్మొకడిది సోకొకడిది' పేరుతో సినిమా నిర్మించారు. అందులో కమల్ ద్విపాత్రాభినయం చేయగా ఆయన సరసన జయసుధ, రోజారమణి హీరోయిన్లుగా నటించారు. ఈ సినిమా పెద్ద మ్యూజికల్ హిట్‌గా నిలిచింది. 1970 దశకంలో ఆరు ఫిలింఫేర్ అవార్డులు లభించాయి. 1981లో బాలచందర్ తెలుగులో 'ఆకలి రాజ్యం' సినిమా సూపర్ హిట్టయింది. కె.విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన 'సాగర సంగమం' సూపర్ డూపర్ హిట్టయింది. అదే ఊపులో వచ్చిన 'స్వాతి ముత్యం' అత్యధిక మహిళా ప్రేక్షకులను ఆకట్టుకొని విజయవంతమైంది. సింగీతం శ్రీనివాసరావు కమల్‌తో సంభాషణలు లేకుండా 'పుష్పక విమానం' చిత్రాన్ని నిర్మించారు. ఆయన ప్రయోగం సఫలమైంది. విశ్వనాథ్, బాలు కలిసి కమల్‌తో 'శుభసంకల్పం' చిత్రాన్ని నిర్మిస్తే అదికూడా శతదినోత్సవం చేసుకుంది. సింగీతం దర్శకత్వం వహించిన మరొక సినిమా 'ఇంద్రుడు చంద్రుడు'. అందులో కమల్ హసన్ ద్విపాత్రాభినయం చేశారు. 'భామనే సత్యభామనే' కూడా ఆ కోవలోనిదే. కమల్ హాసన్‌కు వైవిధ్యమైన పాత్రలు పోషించడమంటే సరదా. కళ్యాణ రామన్ చిత్రంలో ఎత్తుపళ్లతో పల్లెటూరివాని పాత్రను పోషించారు. 'రాజా పార్వై' చిత్రంలో అంధ వయోలనిస్టు పాత్రలో జీవించారు. ఈ చిత్రానికి కమల్ స్క్రీన్ ప్లే అందించడం విశేషం. 'స్వాతిముత్యం'లో మానసిక వికలాంగునిగా, 'సాగర సంగమం'లో శాస్త్రీయ నృత్యకళాకారునిగా, 'నాయకుడు' సినిమాలో అండర్ వరల్డ్ డాన్‌గా ప్రేక్షకుల మనసుల్ని దోచుకున్నారు. 'పుష్పక విమానం' సినిమాలో నిరుద్యోగ యువకునిగా, వారం రోజులపాటు భోగ భాగ్యాలు అనుభవించే అవకాశం వచ్చిన యువకునిగా నటించారు. 'విచిత్ర సోదరులు' సినిమాలో మరుగుజ్జు అవతారం ఎత్తారు. 'భామనే సత్యభామనే' చిత్రానికి శంతన్ పెనోయ్ దర్శకుడు అయినా. తనే దర్శకత్వ బాధ్యతలు స్వీకరించి సినిమాను హిట్ చేశారు. 'గుణ' చిత్రంలో కమల్‌ది అద్భుతమైన పాత్ర. ప్రేమలో పడిన ఉన్మాదిగా నటించి గొప్ప పేరు తెచ్చుకున్నారు. 'ద్రోహి' చిత్రంలో ఉగ్రవాదాన్ని అణచివేసే పోలీసు అధికారిగా కమల్ హసన్ నటన అపూర్వం. అలాగే 'భారతీయుడు' సినిమాలో స్వాతంత్ర సమరయోధుని పాత్రలో ముసలి వేషం, లంచగొండి అధికారిగా రెండవ వేషం వేసి మెప్పించారు. ఫిలింఫేర్ బహుమతులను ఏకంగా పద్దెనిమిది సార్లు గెలుచుకున్న ఏకైక నటుడు కమల్ హాసన్. కమల్ జాతీయ స్థాయిలో ఉత్తమ నటుడిగా 'మూండ్రాంపిరై' (వసంత కోకిల), 'నాయగన్' (నాయకుడు), 'ఇండియన్' (భారతీయుడు) సినిమాలో నటనకు మూడుసార్లు పురస్కారాలు అందుకున్నారు. 'సాగరసంగమం', 'స్వాతిముత్యం' తెలుగు సినిమాలు ఆసియా చలన చిత్రోత్సవాలలో బహుమతులు గెలుచుకున్నాయి. నటించిన ఆరు సినిమాలు ఆస్కార్ బహుమతి కోసం ప్రభుత్వ పక్షాన ఎంపికై, పోటీల్లో పాల్గొన్నాయి. 1990లో కేంద్ర ప్రభుత్వం కమల్‌ను పద్మశ్రీ పురస్కారంతోను, 2014లో పద్మభూషణ్ పురస్కారంతోను సత్కరించింది. తమిళనాడు ప్రభుత్వం 'కలైమామణి' బిరుదు ప్రదానం చేసింది. చెన్నైలోని సత్యభామ విశ్వవిద్యాలయం కమల్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. మొత్తం మీద కమల్ స్వీకరించిన అవార్డులు 170కి పైమాటే..

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ఐదేళ్ల తర్వాత చైనా దిగుమతులకు భారత్ గ్రీన్‌సిగ్నల్



భారత్–చైనా ఆర్థిక సంబంధాల్లో దాదాపు ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత చల్లని గాలి వీస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. 2020లో గల్వాన్ ఘర్షణల అనంతరం గణనీయంగా చల్లబడిన వాణిజ్య సంబంధాలు, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయంతో మళ్లీ వేడెక్కే అవకాశం ఉంది.

**దిగుమతి అనుమతుల్లో సడలింపునకు కారణాలు...** భారత ప్రభుత్వం చైనా సహా పలు దేశాల నుంచి ఎలక్ట్రానిక్స్, స్టీల్ వంటి ముఖ్య రంగాల వస్తువుల దిగుమతి అనుమతులను త్వరితగతిన ఆమోదించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం వెనుక ప్రధాన కారణాలు ఇవే.. డిమాండ్–సరఫరా లోటు: దేశీయ మార్కెట్‌లో వినియోగదారుల డిమాండ్ భారీగా పెరిగింది. ముఖ్యంగా ఇటీవల జీఎస్టీ తగ్గింపుల తర్వాత ఈ డిమాండ్ మరింతగా పెరిగింది. స్థానిక ఉత్పత్తి పరిమితులు: స్థానిక పరిశ్రమలు ఈ పెరిగిన డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి చేయలేకపోవడంతో సరఫరా సమస్యలు తలెత్తుతున్నాయి. దీనిని అధిగమించేందుకు దిగుమతులను సులభతరం చేయాల్సిన అవసరం ఏర్పడింది.

**సులభతరం కానున్న దిగుమతి ప్రక్రియ...** దిగుమతులను పెంచడానికి ప్రభుత్వం కేవలం వేగంగా అనుమతులు ఇవ్వడమే కాకుండా విదేశీ కర్మాగారాలపై విధించిన మండేటరీ సర్టిఫికేషన్ నిబంధనలను సైతం పునర్విమర్శిస్తోంది. ఈ చర్యల వల్ల దిగుమతుల ప్రక్రియ సులభతరం అయ్యి, సరఫరా గొలుసులో ఉన్న అంతరాయాలు తగ్గుతాయని భావిస్తున్నారు.

**తక్షణ ఆమోదం పొందనున్న రంగాలు:** ఎలక్ట్రానిక్ భాగాలు, షూస్ (పాదరక్షలు), రోజువారీ ఉపయోగ వస్తువులు, స్టీల్ ఉత్పత్తులు , ముడి పదార్థాలు

**ఆర్థిక రంగంపై ప్రభావం...** నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ ప్రాగ్మాటిక్ నిర్ణయం భారత ఆర్థిక రంగానికి అనేక విధాలుగా ఊతమివ్వనుంది. వినియోగదారులకు వస్తువుల కొరత, ధరల పెరుగుదల నుంచి కొంత ఉపశమనం లభిస్తుంది. అంతర్జాతీయ సరఫరా సమస్యల నేపథ్యంలో ముఖ్యంగా చైనా నుండి దిగుమతులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వలన దేశీయ పరిశ్రమలకు ముడి సరుకులు, భాగాలు సకాలంలో అందుతాయి. ఐదేళ్ల తర్వాత తీసుకున్న ఈ సడలింపు నిర్ణయం, రెండు దేశాల మధ్య ఆర్థిక సంబంధాల్లో మళ్లీ వేడిమిని పెంచే అవకాశం ఉంది. మొత్తానికి ప్రపంచ ఆర్థిక వాతావరణం, దేశీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని భారత్ తీసుకున్న ఈ నిర్ణయం, స్వల్పకాలంలో మార్కెట్‌కు స్థిరత్వం ఇచ్చి, వినియోగదారులకు పండగ వాతావరణంలో మరింత ఊరటనిస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.


# అమెరికాలో మళ్లీ లేఆఫ్స్ సునామీ: 'లో హైర్, లో ఫైర్' యుగం ముగిసిందా?

అమెరికా ఉద్యోగ మార్కెట్‌లో స్థిరత్వానికి తెర పడినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. కొంతకాలంగా కొనసాగిన "తక్కువ నియామకాలు (లో హైర్), తక్కువ తొలగింపులు (లో ఫైర్)" అనే జాగ్రత్త ధోరణి నుంచి, ఇప్పుడు భారీ తొలగింపుల (ఫైర్) దశ మొదలైంది. ఇది అమెరికన్ ఆర్థిక వ్యవస్థలో మాంద్యం మరింత తీవ్రంగా రూపుదాల్చే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**పెరిగిన ఉద్యోగ కోతలు: సంఖ్యలు ఏం చెబుతున్నాయి?...** బ్లూమ్‌బెర్గ్ తాజా నివేదికల ప్రకారం అమెరికాలోని అనేక పెద్ద కంపెనీలు తిరిగి భారీ స్థాయిలో ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ముఖ్యంగా టెక్నాలజీతో పాటు ఇతర రంగాల్లోనూ ఈ ప్రభావం తీవ్రంగా ఉంది.

**స్టార్‌బక్స్:** సుమారు 900 మంది ఉద్యోగులు
**పారామౌంట్:** దాదాపు 1,000 మంది ఉద్యోగులు
**టార్గెట్:** 1,800 మంది ఉద్యోగులు
**అమెజాన్:** ఏకంగా 14,000 మంది ఉద్యోగులు

బ్లూమ్‌బెర్గ్ గణాంకాల ప్రకారం, 2025 సెప్టెంబర్ వరకు సుమారు 9.5 లక్షల ఉద్యోగాలు కోల్పోయాయి. కోవిడ్ సంవత్సరాలను మినహాయిస్తే, 2009 తర్వాత ప్రతి సంవత్సరం కంటే ఇదే అత్యధిక సంఖ్య. "మనం ఇక 'లో హైర్, లో ఫైర్' దశలో లేము... ఇప్పుడు నిజంగా 'ఫైర్' దశ మొదలైంది," అని ఒక ఆర్థిక నిపుణుడు వ్యాఖ్యానించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుంది. కంపెనీలు ఈ నిర్ణయాలు తీసుకోవడానికి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయి. కృత్రిమ మేధస్సు విస్తరణ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని పెద్ద ఎత్తున వినియోగించడం వల్ల అనేక కార్యకలాపాలు ఆటోమేట్ అవుతున్నాయి. దీనితో, ఆయా పనులకు అవసరమయ్యే మానవ శ్రామిక శక్తిపై ఆధారపడాల్సిన అవసరం తీవ్రంగా తగ్గుతోంది. సంస్థల పునర్వ్యవస్థీకరణ : నెమ్మదిగా ఉన్న వృద్ధి , మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కంపెనీలు తమ వ్యాపార విభాగాలను, ఉద్యోగుల పాత్రలను పునర్వ్యవస్థీకరిస్తున్నాయి. ఖర్చు తగ్గింపు చర్యలు: పెరుగుతున్న ఆపరేషనల్ ఖర్చులు.. ఆర్థిక అనిశ్చితి దృష్ట్యా, లాభాలను పెంచుకోవడానికి కంపెనీలు సిబ్బందిని తగ్గించే దిశగా కఠిన చర్యలు తీసుకుంటున్నాయి.




**భవిష్యత్తుపై హెచ్చరికలు...** గత రెండేళ్లుగా కంపెనీలు ఉద్యోగులను తొలగించకుండా జాగ్రత్త వహించినప్పటికీ, ఇప్పుడు ఆ ధోరణి పూర్తిగా మారిపోయింది. కొత్తగా మొదలైన ఈ తక్కువ నియామకాలు, ఎక్కువ లేఆఫ్స్ అనే దశ ఇబ్బందిగా మారింది. ... నిపుణుల హెచ్చరికల ప్రకారం, ఈ లేఆఫ్స్ ధోరణి ఇలాగే కొనసాగితే, 2026 నాటికి ఉద్యోగాల కోసం ఎదురుచూసే నిరుద్యోగులకు ఇది కఠిన పరీక్షా సమ యం ఎదురుకావచ్చు. ఈ పరిణామాలు అమెరికా ఆర్థిక వ్యవస్థకు కూడా ఒక ప్రమాద సూచనగా మారే అవకాశం ఉంది. సమర్థత కో సం కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైపు మొగ్గు చూపుతూ పునర్వ్యవస్థీకరణ చేస్తుండగా, దీని ప్రభావం వేలాది మంది సాధారణ ఉద్యోగుల భవిష్యత్తుపై తీవ్రంగా పడుతోంది. ఉద్యోగ మార్కెట్‌లో వచ్చిన ఈ మార్పు, రాబోయే రోజుల్లో అమెరికన్ కార్మికులకు పెద్ద సవాలు విసరనుంది.

# మొన్నటి వరకు మావోల అడ్డా.. ఇప్పుడు సినిమా షూటింగ్ లు

మొన్నటి వరకు అది మావోల అడ్డా. ఇప్పుడు సీన్ మారింది. ఓవైపు మావోలు.. మరో వైపు వారిని వెతికే ప్రత్యేక దళాలు. ఎప్పుడు ఏమవుతుందో తెలీని పరిస్థితి. అటు వైపు వెళ్లటానికి సైతం సంకోచం.. మనకెందుకు లేనిపోని తలనొప్పులు అన్నట్లుగా ఉన్న ప్రాంతం కాస్తా.. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కాల్పులు.. ఎదురు కాల్పులు.. బూట్ల చప్పుళ్లతో నిత్యం ఏదో ఒక టెన్షన్ తో తల్లడిల్లిన ప్రాంతంలో ఇప్పుడు సినిమా షూటింగ్ లు ప్రశాంతంగా సాగుతున్న పరిస్థితి. అవును..ఇప్పటివరకు మీరు చదివింది అక్షరాల నిజం. ఛత్తీస్ గఢ్ లోని బస్తర్ ప్రాంతంలో ఉన్న అబూజ్ మడ్ ఒకప్పుడు పిస్టల్ కాల్పులతో మోత మోగేది. మావోలకు అడ్డగా ఉన్న ఆ ప్రాంతంలో నిత్యం ఏదో ఒక అలజడి సాగేది. తరచూ రక్తపాతంతో ఆ ప్రాంతం భయభ్రాంతులకు గురి చేసేది. హింస రాజ్యమేలే ఆ ప్రాంతంలో కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్ తో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారేలా చేశాయి. దీర్ఘకాలం పాటు సాగిన ఈ ఆపరేషన్ తో మావోలు చెల్లాచెదురు కావటం.. పెద్ద ఎత్తున ఎన్ కౌంటర్లు చోటు చేసుకోవటం.. అగ్రనాయకులు మొదలు ఒక మోస్తరు నాయకులు.. వారి అనుచరగణం పోలీసుల ఎదుట లొంగిపోవటంతో.. మావోలకు అడ్డాగా ఉన్న ప్రాంతంలో ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఇప్పుడు ఆ ప్రాంతంలో సినిమా షూటింగ్ లు సాగుతున్నాయి. సహజసిద్ధమైన ప్రక్రతి అందాలు.. దట్టమైన అడవులు. చూడచక్కని కొండ ప్రాంతాలు.. పచ్చిక బయళ్లతో ఉండే ఆ ప్రాంతంలో ప్రశాంతత నెలకొనటంతో మాస్ పుర్ ప్రాంతంలో సినిమా షూటింగ్ లతో కళకళలాడుతున్నాయి. అందుకు నిదర్శనంగా దండా కోటుమ్ అనే సినిమా షూటింగ్ ఇప్పుడు అక్కడ స్వేచ్ఛగా సాగుతోంది. మాస్ పుర్ కు 200 మీటర్లదూరంలో ఉన్న పోలీస్ క్యాంప్ కు దగ్గర్లోనే సాగుతున్న సినిమా షూటింగ్ కు ఎలాంటి ఆటంకాలు లేకుండా.. చాలా వేగంగా సాగుతున్నట్లుగా చెబుతున్నారు. బస్తర్ ప్రాంతంలో మారిన పరిస్థితులకు ఇదో ఉదాహరణగా చెప్పొచ్చు.



చురకలు

## సంపాదకీయం

# మాల్దీవుల తిరుగుబాటును భారత్ అణిచివేసిందా?

మాల్దీవ్స్ మాజీ అధ్యక్షుడు అబ్దుల్లా యామీన్ అబ్దుల్ గయూమ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారితీశాయి. భారత్‌తో సంబంధాల్లో తరచూ వివాదాలకు కారణమైన యామీన్, ఈసారి భారతదేశం పట్ల ప్రశంసల జల్లు కురిపించడం గమనార్హం. గతంలో 'ఇండియా అవుట్' ఉద్యమానికి నాయకత్వం వహించిన యామీన్ నుంచి ఇలాంటి సానుకూల వ్యాఖ్యలు రావడం స్థానికంగా, అంతర్జాతీయంగా చాలా మందిని ఆశ్చర్యపరిచింది.

**1988 తిరుగుబాటు: భారత్ అండను మరువలేం!...** 1988లో మాల్దీవుల్లో జరిగిన తిరుగుబాటును అణచివేయడంలో భారత్ అందించిన సహకారాన్ని యామీన్ ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు. యామీన్ మాట్లాడుతూ "1988లో మాల్దీవుల్లో జరిగిన తిరుగుబాటును అణచివేయడంలో భారత్ అందించిన సహాయం ఎప్పటికీ మరిచిపోలేం. ఆ సమయంలో విదేశీ కిరాయి సైనికులు సాయుధ దాడులు జరిపారు. మన దేశంలో సైనికులు, పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో భారత్ చూపిన స్పందన, సహకారం మాల్దీవుల చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోయింది" అని అన్నారు.

**ఆపరేషన్ కాక్టస్': తొమ్మిది గంటల్లో తిరుగుబాటు భగ్నం...** 1988లో అప్పటి మాల్దీవుల అధ్యక్షుడు మౌమూన్ అబ్దుల్ గయూమ్, తిరుగుబాటు దళాల దాడితో తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారు. ప్రాణభయంతో ఉన్న ఆయన వెంటనే భారత్ సహాయం కోరారు. అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వెంటనే స్పందించి, ఇండియన్ పారా కమాండోలును ('ఆపరేషన్ కాక్టస్' కింద) గగనతల, సముద్ర మార్గాల ద్వారా మాల్దీవులకు పంపించారు. కేవలం తొమ్మిది గంటల వ్యవధిలోనే భారత బలగాలు తిరుగుబాటును అణచివేశాయి, అధ్యక్షుడిని కాపాడాయి. అంతేకాక పారిపోతున్న తిరుగుబాటు దళాలను భారత నౌకాదళం సముద్రంలోనే అడ్డుకుని అరెస్ట్ చేసింది.

**నవంబర్ 3: భారత్‌కు కృతజ్ఞత సూచకంగా "విక్టరీ డే"...** ఈ చారిత్రక సంఘటనను గుర్తుచేసుకుంటూ, మాల్దీవులు ప్రతి సంవత్సరం నవంబర్ 3న "విక్టరీ డే"గా జరుపుకుంటోంది. ఈ సందర్భంగానే యామీన్ ఈ ప్రశంసలు చేశారు. "విక్టరీ డే మన సైనికుల ధైర్యసాహసాలను గుర్తుచేసే రోజు మాత్రమే కాదుబీ అవసరమైన సమయంలో భారత్ అందించిన అండకు కృతజ్ఞత తెలిపే సందర్భం కూడా" అని ఆయన పేర్కొన్నారు.

**భారత్ వ్యతిరేకి నుంచి ప్రశంసలు: రాజకీయ పునరాగమనం కోసమేనా?...** యామీన్, 2013 నుండి 2018 వరకు మాల్దీవుల అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన పాలనలో చైనాతో మైత్రి పెంచడానికి భారత్ నుంచి దూరంగా వెళ్లే విధానాన్ని అనుసరించారు. అంతేకాదు "ఇండియా అవుట్" ఉద్యమానికి కూడా నాయకత్వం వహించారు, భారత సైనిక సిబ్బందిని వెనక్కి పంపాలని డిమాండ్ చేశారు. అధికారం కోల్పోయిన తర్వాత అవినీతి ఆరోపణలతో జైలు శిక్ష అనుభవించి, 2024 ఏప్రిల్‌లో హైకోర్టు ఆదేశాలతో ప్రస్తుతం గృహ నిర్బంధంలో ఉన్న యామీన్, దేశ రాజకీయాలపై మళ్లీ ప్రభావం చూపే ప్రయత్నాల్లో ఉన్నారు. తాజా ఆయన వ్యాఖ్యలు, భారత్–మాల్దీవుల మధ్య సంబంధాలపై కొత్త చర్చకు దారితీశాయి, అలాగే ఆయన రాజకీయ పునరాగమనంలో భాగంగా భారత్ పట్ల సానుకూల వైఖరిని ప్రదర్శిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఆధునిక తెలుగు సాహిత్యానికి నూతన దిశ దిశా నిర్దేశం చేసిన ద్వివేదుల విశాలాక్షి - నవంబర్ 7... ద్వివేదుల విశాలాక్షి వర్ధంతి



తెలుగు సాహిత్యంలో ఒక ప్రతిభా వంతురాలుగా గుర్తింపు పొందిన ద్వివేదుల విశాలాక్షి రచనలు తెలుగు సాహిత్యాన్ని కొత్త దిశలో నడిపించాయి. సామాజిక అంశాలు, స్త్రీ పాత్రల స్థానం, మరియు మనస్తత్వ పరిశీలనలపై ఆధారపడిన ఈ రచనలు సమకాలీన సమస్యలను ప్రతిబింబిస్తూ పాఠకులను ఆలోచింప జేస్తాయి. విశాలాక్షి రచనలు కేవలం వ్యక్తుల జీవితాలను మాత్రమే కాకుండా, సమాజంలోని వివిధ సమస్యలను కూడా ప్రతిబింబిస్తాయి. ఆమె రచనలు సమాజంలోని అసమానతలు, కుల వ్యవస్థ, స్త్రీల అణచివేత వంటి అంశాలపై ప్రశ్నించేలా చేస్తాయి. ద్వివేదుల విశాలాక్షి 1929 ఆగస్టు 15న ఆంధ్రప్రదేశ్‌లోని విజయ నగరంలో జన్మించారు. ఆమె విద్యాభ్యాసం విజయ నగరం లోనే జరిగింది. కథలు, నవలలు, వ్యాసాలు, రేడియో నాటికలు, సామాజిక అంశాలపై సాహిత్య రచనలు చేశారు. విశాలాక్షి గారి భాషా శైలి చాలా సరళమైనది, అయినప్పటికీ అది చాలా ప్రభావవంతంగా ఉంటుంది. ఆమె భావాలను చాలా సున్నితంగా, సహజంగా వ్యక్తపరుస్తారు. విశాలాక్షి గారి రచనలు సమాజంలోని వివిధ అంశాలను ప్రతిబింబించడమే కాకుండా, సమాజ సమస్యలను లోతుగా అధ్యయనం చేస్తాయి. ఆధునిక తెలుగు సాహిత్యానికి ఒక కొత్త దిశను చూపించడంలో ఆమె రచనలు ముఖ్య పాత్ర పోషించాయి. ఆమె తన రచనల్లో కథా నాయికలను సాహసవంతురాళ్ళుగా, స్వతంత్ర భావన కలిగిన వారిగా, తమ వ్యక్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు పోరాడే వారిగా సృష్టించారు. ద్వివేదుల విశాలాక్షి సాహిత్య ప్రస్థానం తెలుగు సాహిత్యానికి కొత్త ఒరవడిని సృష్టించారు. ఆమె రచనల్లో 13 నవలలు, 3 కథా సంపుటాలు ఉన్నాయి. ఆమె కథానాయికలు సాధారణంగా స్వతంత్రంగా ఆలోచించే, సమాజ పరిస్థితులను ఎదుర్కొనే స్త్రీలుగా ఉంటారు. ఆమె రచనల్లో కుటుంబ బంధాలు, స్త్రీ–పురుష సంబంధాలు, సామాజిక అసమానతలు వంటి అంశాలు ప్రధానంగా ప్రతిబింబిస్తాయి. సమాజంలోని వివిధ అంశాలను ఈ రచనల్లో ప్రతిబింబిస్తూ, ఆమె సమకాలీన సమస్యలను పాఠకుల ముందుకు తెచ్చారు. ఆమె రచనలు అనేక ఇతర భాషల్లోకి అనువదించబడ్డాయి, తెలుగు సాహిత్యాన్ని మరింత విస్తరింపజేశాయి. విశాలాక్షి గారి రచనలు అనేకమంది యువ రచయితలను ప్రభావితం చేశాయి. ఆమె తరువాత వచ్చిన రచయితలు ఆమె వేసిన బాటలోనే ప్రయాణిస్తూ తెలుగు సాహిత్యాన్ని మరింత సుసంపన్నం చేశారు. ఆమె రచనలు అనేక ఇతర భాషల్లోకి అనువదించబడడం తెలుగు సాహిత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషించింది. ఆమె ఆంధ్రప్రభ దీపావళి నవలల పోటీలో "వైకుంఠపాళి" నవలతో మొదటి బహుమతి పొందారు. గృహలక్ష్మీ, స్వర్ణకంకణం, అడవి బాపిరాజు అవార్డు, తెలుగు విశ్వ విద్యాలయం నుంచి డి.లిట్ పట్టా, రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ జ్యేష్ట సాహితీ అవార్డు వంటి అనేక పురస్కారాలు ఆమె సాహిత్య కృషికి గుర్తింపుగా లభించాయి. 2014 నవంబరు 7న విశాఖపట్నంలో ఆమె మరణించారు. తెలుగు సాహిత్య చరిత్రలో ద్వివేదుల రచనలు, ఆలోచనలు, సాహిత్య కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తాయి. ఆమె మరణించినప్పటికీ, ఆమె రచనలు ఆమెను పాఠకుల హృదయాలలో ఎల్లప్పుడూ జీవించి ఉంచుతున్నాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# స్వాతంత్ర్యోద్యమ ముఖ్య మార్గదర్శకులు బిపిన్ చంద్ర పాల్ - నవంబర్ 7...బిపిన్ చంద్ర పాల్ జయంతి

బిపిన్ చంద్ర పాల్, భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మార్గదర్శకుడిగా విశేష కీర్తి గడించారు. బ్రహ్మ సమాజం ప్రేరణ 1858లో అస్సాం రాష్ట్రంలోని సిల్హట్ ప్రాంతంలో జన్మించిన బిపిన్ చంద్ర పాల్, బాల్యంలోనే మతపరమైన, సాంస్కృతిక, సామాజిక పునరుద్ధరణ అభిరుచులుగా కలిగి ఉన్నారు. ఈ ప్రేరణలు ఆయన్ని బ్రాహ్మ సమాజం వంటి ఉద్యమాలతో అనుసంధానానికి ప్రేరేపించాయి. బ్రాహ్మ సమాజం ఆయనను హిందూ మతం పునరుద్ధరణ మరియు సమానత్వం కోసం శ్రమించడానికి ప్రేరణ ఇచ్చింది.

**స్వదేశీ, జాతీయోద్యమాలలో పాల్ పాత్ర...** బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా, బిపిన్ చంద్ర పాల్ స్వదేశీ ఉద్యమాన్ని బలంగా ప్రోత్సహించారు. ఆయన "స్వదేశీ" అనే సూత్రానికి నమ్మకంగా నిలబడ్డారు, ఇది భారతీయులు విదేశీ వస్తువుల వినియోగాన్ని నిరాకరించి, భారతీయ వస్తువులను ప్రోత్సహించాలనే ఆలోచన. ఇది బ్రిటిష్ వారిని ఆర్థికంగా దెబ్బతీసే, భారతీయుల ఆత్మగౌరవాన్ని పెంపొందించే ప్రయత్నం. ఆయన విద్యా వ్యవస్థను సాంస్కృతిక దృష్టితో తిరిగి మలచడానికి ప్రయత్నించారు.

**వక్తృత్వం, రచనా శక్తి...** పాల్ భారతీయ జన సాంప్రదాయాన్ని ఉద్దీపింపజేసే ఒక శక్తివంతమైన వక్త, రచయిత. ఆయన ఉపన్యాసాలు జాతీయోద్యమానికి ఆవిర్భావ శక్తినందించాయి. తన రచనల ద్వారా ఆయన స్వతంత్ర భావనలను వ్యాప్తి చేశారు.

కొన్ని ముఖ్యమైన రచనల్లో "నేషనల్ అస్సెన్షన్స్" మరియు "ఇండియన్ నేషనలిజం" ఉన్నాయి, ఇవి భారతీయ జాతీయతను ప్రోత్సహించడంలో ప్రముఖ పాత్ర పోషించాయి.

**సంపూర్ణ స్వరాజ్యం కోసం కృషి...** బ్రిటిష్ పాలన నుండి సంపూర్ణ స్వతంత్రం పొందాలనే లక్ష్యంతో బిపిన్ చంద్ర పాల్ ముందంజ వేశారు. ఆయన భారతదేశం ఆర్థిక, రాజకీయ మరియు సాంస్కృతిక స్వేచ్ఛను పొందాలి అని విశ్వసించారు. ఆయన సాంస్కృతిక పునరుద్ధరణ, ఆత్మాభిమానం పెంపొందించేందుకు కృషి చేశారు, ఇది సమాజానికి కొత్త ఆలోచనలు అందించింది.

**చివరి రోజులు, వారసత్వం...** బిపిన్ చంద్ర పాల్ 1932లో



మరణించారు. ఆయన చరిత్రలో ఒక ముఖ్య మార్గదర్శకుడిగా నిలిచారు. ఆయన జీవితం, పునరుద్ధరణ ఆలోచనలు, స్వాతంత్ర సమరంకోసం చేసిన సేవలు భారత జాతీయోద్యమంలో ఆయనను సుస్థిరంగా నిలబెట్టాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్**


# క్యాన్సర్ పై అవగాహన అవసరం - నవంబర్ 7...జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం

జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం ప్రతి సంవత్సరం నవంబర్ 7న జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని జరుపుకుంటారు. క్యాన్సర్ గురించి ప్రజలలో అవగాహన పెంచడమే లక్ష్యం ఈ దినం లక్ష్యం. క్యాన్సర్ అనేది శరీరంలోని కొన్ని కణాలు అదుపు లేకుండా పెరిగి, ఇతర భాగాలకు వ్యాపించే విధంగా మారే వ్యాధి. సాధారణ కణాల పెరుగుదల నియంత్రణలో ఉంటే, క్యాన్సర్ కణాలు నియంత్రణ లేకుండా పెరిగి గడ్డలను (కణితులు) ఏర్పరుస్తాయి. ఈ గడ్డలు ఆరోగ్యకర కణాలను తొలగించడం లేదా అవయవాలను నాశనం చేయడం చేస్తాయి. క్యాన్సర్‌కు స్పష్టమైన ఒకే కారణం లేదు, కానీ కొన్ని కారణాలు క్యాన్సర్ రాకకు దోహదం చేస్తాయి. సిగరెట్లు, బీడీలు, పాన్ మసాలా వంటివి ఊపిరితిత్తులు, నోరు, గొంతు వంటి అనేక క్యాన్సర్లకు ప్రధాన కారణం. అధికంగా మద్యం తాగడం కాలేయం, నోరు, గొంతు వంటి క్యాన్సర్లకు దారితీస్తుంది. ఆహారపు అలవాట్లు: అధిక కొవ్వులు, చక్కెరలు ఉన్న ఆహారం, తక్కువ కూరగాయలు, పండ్లు తీసుకోవడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశాలు ఉంటాయి. వ్యాయామం చేయకపోవడం కొన్ని రకాల క్యాన్సర్లకు కారణం కావచ్చు.




కుటుంబంలో క్యాన్సర్ ఉంటే వచ్చే అవకాశాలు ఎక్కువ. హెపటైటిస్ B, హెపటైటిస్ C వంటి వైరస్లు కాలేయ క్యాన్సర్‌కు కారణం కావచ్చు. అధిక రేడియేషన్ శరీర కణాలపై ప్రభావం చూపి, క్యాన్సర్ కలిగించే అవకాశం ఉంది. క్యాన్సర్ లక్షణాలు దాని రకం, స్థానం, మరియు దశపై ఆధారపడి ఉంటాయి. కొన్ని సాధారణ లక్షణాలను గమనిస్తే... తీవ్ర అలసట, బరువు తగ్గడం, రక్తస్రావం లేదా రక్తపు ఉమ్మి, శ్వాసలో ఇబ్బంది, అవయవంలో గడ్డలు మొదలైనవి.క్యాన్సర్‌ను పూర్తిగా నివారించలేక పోయినా, కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దాని ప్రమాదాన్ని తగ్గించవచ్చు. పొగాకు వాడకాన్ని మానుకోవడం ద్వారా ఊపిరితిత్తులు, నోరు, గొంతు వంటి క్యాన్సర్లను నివారించడంలో సహాయ పడుతుంది. ఆరోగ్యకరమైన ఆహారంలో ఎక్కువ కూరగాయలు, పండ్లు, తక్కువ కొవ్వులు ఉండే ఆహారం తీసుకోవడం మంచిది. రోజూ వ్యాయామం చేయడం శరీరంలో క్యాన్సర్ కణాల పెరుగుదలను తగ్గిస్తుంది. ఆల్కహాల్ తాగడం నిషేధించడం కూడా ముఖ్యమైన చర్య. క్యాన్సర్ నిర్ధారణలో తొలిదశలోనే పరీక్షలు చేయడం కీలకం. క్యాన్సర్ చికిత్స దాని రకం, దశ మరియు రోగి ఆరోగ్య స్థితిపై ఆధారపడి ఉంటుంది. కొన్ని ప్రధాన చికిత్స విధానాలు: శస్త్రచికిత్స ద్వారా క్యాన్సర్ కణితులను తొలగించడం.రేడియేషన్ చికిత్స ద్వారా కణాలను నాశనం చేయడం. కీమోథెరపీ మందుల ద్వారా క్యాన్సర్ కణాలను నియంత్రించడం. నిర్దిష్ట క్యాన్సర్ కణాలపై చర్యలు తీసుకోవడం. క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడం చాలా ముఖ్యం. కనుక ఏదైనా అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం అత్యవసరం. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సుదీర్ఘ రాజకీయ అనుభవశాలి ఆచార్య రంగా - నవంబర్ 7.. ఆచార్య ఎన్జీ రంగా జయంతి



గోగినేని రంగనాయకులు... ఈ పేరు అంతగా ప్రాచుర్యం లేనిది. ఈ పేరు చెపితే దేశంలో గుర్తు పట్టే వారు దాదాపు ఉండక పోవచ్చు. ఆయన ఒక నిబద్దత కలిగిన పాతతరం రాజకీయ నాయకులు. ఆయనను భారత రైతాంగ ఉద్యమపితగా భావిస్తారు. సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కిన ప్రజాప్రతినిధి. లోక్‌సభలోనూ, ఇటు రాజ్యసభలోనూ 60 ఏళ్ళు రైతుల పక్షాన పోరాడిన నాయకులు. రాజకీయ అవగాహన కలిగిన వారికి ఇప్పుడు ఆయనెవరో స్ఫురణకు వచ్చి ఉంటుంది. రైతాంగ విధానాలకు మద్దతు నిచ్చిన ఆయనే సుధీర్ఘ రాజకీయ నేపథ్యం ఉన్న ఆచార్య ఎన్.జి.రంగా. ఆచార్య రంగా (నవంబరు 7, 1900 – జూన్ 9, 1995) భారత స్వాతంత్ర్య సమర యోధులు, పార్లమెంటు సభ్యులు, రైతు నాయకుడు. 1935లో తొలిసారి కేంద్ర శాసనసభకు సభ్యులై అప్పటి నుంచి మరణించే వరకు నిరంతరం పార్లమెంటేరియన్ గానే కొనసాగారు. రంగా, 1900, నవంబరు 7 న గుంటూరు జిల్లా నిడుబ్రోలులో గోగినేని నాగయ్య, అచ్చమాంబ దంపతులకు జన్మించారు. నిడుబ్రోలులో ప్రాథమిక విద్యను ముగించుకొని, గుంటూరు ఆంధ్రా క్రిష్టియన్ కళాశాల నుండి పట్టభద్రు లైనారు. 1924లో భారతీ దేవితో రంగా వివాహం జరిగింది. 1926 లో ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయం నుండి అర్ధ శాస్త్రములో బి.లిట్ పొంది భారత దేశానికి తిరిగి వచ్చిన తర్వాత మద్రాసు లోని పచ్చయప్ప కళాశాలలో ఆర్థిక శాస్త్ర ఆచార్యునిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఆయన ప్రధానంగా హేతువాది. 1930లో మహాత్మా గాంధీ పిలుపుకు స్పందించి రంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. 1933లో రైతు కూలీ ఉద్యమానికి నేతృత్వం వహించారు. కిసాన్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. రైతుకూలీల పరిస్థితిపై గాంధీతో చారిత్రాత్మక చర్చలు జరిపారు. ఈ చర్చలలోని ముఖ్యాంశాలపై "బాపు దీవెనలు" అన్న పేరుతో రంగా ఒక పుస్తకాన్ని వెలువరించారు.

ఆంధ్రలో తొలిసారి రాజకీయ పాఠశాలలను ప్రారంభించిన ఖ్యాతి రంగాదే. నిడుబ్రోలులో రామనీడు పేరుతో రాజకీయ పాఠశాలను ఏర్పాటు చేసారు. 1933వ సం.లో రంగా స్థాపించిన రాజకీయ విద్యాలయాన్ని మహాత్మాగాంధీ ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రులు నారా చంద్రబాబు నాయుడు , కొణిజేటి రోశయ్య కూడా రంగా శిష్యులే. ఆ పాఠశాల గత మధుర స్మృతులకు సజీవ సాక్ష్యంగా నేటికి నిడుబ్రోలులో కొనసాగుతుంది. తొలి రాజకీయ పాఠశాలలో పుచ్చలపల్లి సుందరయ్యతో సహా కొందరు కమ్యూనిసులూ పాల్గొన్నారు. రంగా ఆంగ్లంలోను, తెలుగులోను మంచి రచయిత. 'హరిజన నాయకుడు' అనే నవల కూడా రాశారు. ఆంధ్ర రాజకీయాలలో గాంధీ అనుచరుడిగా పట్టాభి సీతారామయ్య ఉండగా, రంగా గాంధీకి సన్నిహితుడు కాలేక పోయారు. అయినా పార్టీ సిద్ధాంత పరంగా గాంధేయుని గానే కొనసాగారు. సుభాస్ చంద్రబోస్ అంటే ఇష్టపడేవారు. 1937 నుంచి వాహిని అనే పత్రికను నడిపారు. 1938 నాటికే ఇందూలాల్ యాగ్నిక్‌తో కలిసి కిసాన్ సభలు నిర్వహించారు. ప్రకాశం పంతులుతో కలిసి ఆంధ్ర రాజకీయాలలో కీలక పాత్ర వహించిన రంగాకు చాలా మంది శిష్యులు ఉండేవారు. గౌతు లచ్చన్న, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, కందుల ఓబుల రెడ్డి, చేగిరెడ్డి బాలిరెడ్డి, ఎన్.వి. నాయుడు, నీరుకొండ రామారావు, బీశెట్టి అప్పారావు, పి.రాజగోపాల నాయుడు ఇత్యాదులు ఎందరో రంగా పిలుపు నందుకొని రాజకీయాలలో ప్రవేశించారు. స్వాతంత్ర్య పోరాటంలో నిర్విరామంగా పాల్గొన్న రంగా అనేక పర్యాయాలు జైలు పాలయ్యారు. జైళ్ళలోకూడా రాజకీయ ఖైదీలకు పాఠశాలలు నిర్వహించారు. ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసం చేశారు. మద్రాసు లోని పచ్చయప్పాస్ కళాశాలలో ఆర్థిక శాస్త్రాచార్యుడిగా చేరి నాలుగేళ్ళ పాటు ఉన్నప్పుడు రంగాకు విద్యార్థిగా అన్నాదొరై తమిళనాడు ముఖ్యమంత్రి) ఉండేవారు. రంగా, అంతర్జాతీయ వ్యవసాయ ఉత్పత్తిదారుల సమాఖ్య వ్యవస్థాపకులలో ఒకరు. 1946లో కోపెన్‌హేగెన్‌లో జరిగిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ సదస్సులో, 1948లో శాన్ ఫ్రాన్సిస్కోలో జరిగిన అంతర్జాతీయ శ్రామిక సంస్థ సదస్సులోనూ, 1952లో ఒట్టావాలో జరిగిన అంతర్జాతీయ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సులోను, 1954లో న్యూయార్కులో జరిగిన ఇంటర్నెషనల్ పెజెంట్ యూనియన్, 1955లో టోక్యోలో జరిగిన ఆసియన్ కాంగ్రెస్ ఫర్ వరల్డ్ గవర్నమెంటు లోను భారత దేశం తరఫున ప్రతినిధిగా పాల్గొన్నారు. స్వాతంత్ర్యానంతరం తొలి ఎన్నికలు వచ్చేనాటికి ముఠా తగాదాల కారణంగా రంగా కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి కృషీకార్ లోక్ పార్టీ స్థాపించారు. ఆ ఎన్నికలలో చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాల్లో మాత్రమే కృషీకార్ లోక్ పార్టీ అభ్యర్థులు గెలిచారు. తరువాత సహకార రంగ వ్యవసాయానికి బద్ధ వ్యతిరేకి అయిన రాజాజీతో కలిసి స్వతంత్ర పార్టీని స్థాపించారు. రంగా స్వతంత్ర పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులై ఒక దశాబ్దం పాటు నిర్వహించారు. 1962 సార్వత్రిక ఎన్నికలలో పార్టీ 25 స్థానాలలో గెలిచి బలమైన ప్రతి పక్షముగా రూపుదిద్దు కొన్నది. 1972లో రంగా తిరిగి కాంగ్రెస్ (ఐ)లో చేరి, ఇందిరా గాంధీ కి సన్నిహితులై చివరి వరకూ కాంగ్రెస్ లోనే కొనసాగారు. నెహ్రూ నాయకత్వాన్ని, ఆయన ప్రతిపాదించిన సహకార వ్యవసాయాన్ని కాదని దేశ వ్యాప్తంగా స్వతంత్ర పార్టీ ఏర్పడగా, దానికి తొలి అధ్యక్షులుగా ఆచార్య రంగా ఉన్నారు. రాజగోపాలాచారి, మినూ మసానీ, పీలూ మోడీ, రత్నస్వామి, బెజవాడ రామచంద్రా రెడ్డి మొదలైనవారు ఎందరో రంగాతో చేతులు కలిపారు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఏర్పడిన పార్టీలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి కూడా తొలిదశలో ఉన్నారు. క్రమేణా స్వతంత్ర పార్టీకి రంగా దూరం అవుతూ వచ్చారు. జాతీయ నాయకులలో అంబేద్కర్‌తో రంగా సన్నిహితంగా ఉండేవారు. రాజ్యాంగ సభకు అంబేద్కర్ పేరును ప్రతిపాదించడంలో ఆయన కీలకపాత్ర వహించారు. ఆంధ్రలో సంస్కరణ వివాహాలను రంగా ప్రోత్సహించారు. 1952 నుండి 62 వరకు తెనాలి, 62 నుండి 67 వరకు చిత్తూరు, 67 నుండి 70 వరకు శ్రీకాకుళం, 80 నుండి 84, 84 నుండి 89 వరకు, 89 నుండి 91వరకు మూడుసార్లు వరుసగా గుంటూరు లోకసభ నియోజకవర్గ స్థానాలకు ప్రాతినిధ్యం వహించారు. 1946లో కోపెన్ హేగన్‌లో జరిగిన వ్యవసాయ సమాఖ్యలో పాల్గొన్నారు. 1952లో కామన్వెల్త్ పార్లమెంటరీ సమావేశంలో పాల్గొని అటావా నగరంలో ప్రసంగించారు. 1954లో న్యూయార్క్‌లో జరిగిన అంతర్జాతీయ రైతు సమాఖ్యలో ప్రధానోపన్యాసం చేశారు. 1955లో టోక్యోలో జరిగిన 'ఏషియన్ కాంగ్రెస్ ఫర్ వరల్డ్ గవర్నమెంట్' సభలో సుదీర్ఘోపన్యాసం చేశారు. రైతు సమస్యల్ని అంతర్జాతీయ సభ ల దృష్టికి తీసుకువచ్చారు. పొగాకు, పత్తి రైతుల, చేనేత కార్మికుల సమస్యలకు అధిక సమయాన్ని వినియోగించారు. ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ పుంఖాను పుంఖంగా రచనలు చేశారు. రైతులు విప్లవోద్యమాలలో నిర్వహించిన పాత్రను అధ్యయనం చేసి రివల్యూషనరీ పెజంట్స్, ది క్రెడో ఆఫ్ వరల్డ్ పెజంట్స్ అనే గ్రంథాలు రాశారు. రంగా సుదీర్ఘ కాలం పార్లమెంట్ సభ్యునిగా రికార్డు సృష్టించి, గిన్నీస్ బుక్‌లోకి ఎక్కారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎలాంటి పదవులు లేకుండా ప్రతిష్ఠాత్మకమైన నీతివంతమైన రాజకీయాన్ని పాటించి,95 సంవత్సరాల వయస్సులో ఆయన అనారోగ్యంతో 1995 జూన్ 8వ తేదీన నిడుబ్రోలులోని ఆయన స్వగృహమైన గోభూమిలో తుది శ్వాస విడిచారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# వణికిస్తున్న వల్లూరు యూటర్న్



చేగుంట: వల్లూరు యూటర్న్ అంటే ప్రతి ఒక్కరికి హడల్.. ఇక్కడ రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. గడిచిన మూడు దశాబ్దాల్లో సుమారు 150 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. మరెందరో క్షతగాత్రులు అయ్యారు. పలు కుటుంబాలు ఛిన్నాభిన్నం అయ్యాయి. గతంలో జరిగిన ఒక ప్రమాదంలో వల్లూరు గ్రామానికే చెందిన సుమారు 12 మంది మృతిచెందడం గమనార్హం.

**ఎలా జరుగుతున్నాయంటే..**

చేగుంట వైపు నుంచి వల్లూరుకు యూటర్న్ తీసుకొని వెళ్లే క్రమంలో చేగుంట నుంచి, నిజామాబాద్ నుంచి వాహనాలు వేగంగా వచ్చి ఢీకొంటున్నాయి. బైక్‌లు, సైకిల్‌పై, నడుచుకుంటూ వెళ్తున్న వారు కూడా మరణించడం విచారకరం.

**సర్వీస్ రోడ్డు ఎందుకంట..**

ఆర్వోబీ కోసం గ్రామస్థులు అధికారులు, ప్రజాప్రతినిధులకు తరచూ విన్నవిస్తే రోడ్డుకు ఇరువైపులా సర్వీసు రోడ్డు మంజూరు చేశారు. దీనివల్ల ఎలాంటి ప్రయోజనం లేదని వాపోతున్నారు.

**విషాదం నింపిన ఘటనలు**

వల్లూరుకు చెందిన చాకలి కిష్టయ్య అనే రైతు 2024 జనవరి 24న సైకిల్‌పై పొలం వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. ఆయన అల్లుడు కిషన్ 2019 డిసెంబరు 5న బైక్‌పై గ్రామానికి వస్తుండగా వాహనం ఢీకొని మరణించాడు. వీరి కుటుంబాలు దయనీయ పరిస్థితిలో ఉన్నాయి. ఇల్లు కూడా లేకపోవడంతో అద్దెకు ఉంటున్నారు. కుటుంబ పోషణ భారమైంది.

**ఇల్లు కట్టుకోలేని పరిస్థితి**

గ్రామానికి చెందిన వడ్ల రమేష్ 2024 డిసెంబరు 3న పని ముగించుకొని చేగుంట నుంచి వస్తున్నాడు. వల్లూరు వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో వాహనం ఢీకొనటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయనకు భార్య లత, కుమారుడు వంశీ ఉన్నారు. ప్రస్తుతం ఉరుస్తున్న ఇంట్లో ఉంటున్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైనా కట్టుకునేందుకు చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. రైతుబీమా వస్తే అప్పులకే సరిపోయింది.

**హతవిధి.. ఈ శోకం తీరనిది**

ఆనందాస్ శేఖర్ అనే యువకుడు 2025 ఆగస్టు 14న బైక్‌పై వస్తుండగా యూటర్న్ వద్ద జరిగిన ప్రమాదంలో మరణించాడు. ఆ సమయంలో అతడి భార్య నవ్య ఆరు నెలల గర్భిణి. ఇక్కడ ఆర్వోబీ నిర్మిస్తే తన కొడుకు బతికేవాడని అతని తల్లిదండ్రులు బాల్‌నర్సవ్వ, నాగభూషణం బోరున విలపించారు. నాగభూషణం తమ్ముడి కుమారుడు మధు సైతం మూడేళ్ల క్రితం ఇక్కడే జరిగిన ప్రమాదంలో చనిపోయాడు. అప్పుడు ఆయన భార్య కూడా గర్భిణిగా ఉన్నారు.

ఎన్‌హెచ్ 44 ఇలా..
జిల్లా పరిధి: 55 కి.మీ.
ఎక్కడి నుంచి ఎక్కడికి.. కాళ్లకల్ నుంచి దామెరచెరువు
ప్రమాదకరమైన యూటర్న్ వల్లూరు వద్ద
ప్రాణాలు కోల్పోయింది: సుమారు 150 మంది
ప్రమాదాలు తగ్గాలంటే వల్లూరు వద్ద ఆర్వోబీ నిర్మాణం చేపట్టాలి

## అధికలోడు.. అతివేగం.. అదుపేది?

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి టిప్పర్ డ్రైవర్ అతివేగం.. పరిమితికి మించి కంకర రవాణా చేస్తుండటమే కారణమని అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. గ్రేటర్ హైదరాబాద్‌లోనూ టిప్పర్ వాహనాలు నిబంధనలు ఉల్లంఘిస్తూ యథేచ్ఛగా చక్కర్లు కొడుతున్నాయి. ఇన్ని జరుగుతున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. నగరంలో నిర్మాణాలు పెద్దఎత్తున జరుగుతుండటంతో.. కంకరతో పాటు భారీ బండరాళ్లను తరలించడానికి ఈ వాహనాలను వినియోగిస్తున్నారు. ఆయా వాహనాల్లో రెట్టింపు లోడు తరలిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

**ఈ ఏడాది 2,200 కేసుల నమోదు**

గ్రేటర్ పరిధిలో ఈ ఏడాది ప్పటి వరకు అధిక లోడు తరలించిన టిప్పర్ వంటి గూడ్స్ వాహనాలపై 2,200 కేసులు నమోదు చేశారు. ఈ భారీ వాహనాల నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా నగరవాసులు బెంబేలెత్తున్నారు. సాధారణంగా భారీ వాహనాలు నగరంలోనికి రాత్రి



10 గంటల తర్వాత ప్రవేశించాలనే నిబంధన ఉన్నా.. రాత్రి 8.30 నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. కూడళ్లు, ఇరుకైన దారుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

**తరలింపులో నిర్లక్ష్యం**

టన్నుల కొద్దీ ఇసుక, బండ రాళ్లు, కంకర తరలిస్తున్న వాహనాలు భద్రతను గాలికి వదిలేస్తున్నాయి. వెనుకవైపు డోర్‌ను సరిగ్గా మూయకుండా నిర్లక్ష్యంగా తరలిస్తున్నారు. కాస్త జారినా వెనుక వచ్చే వాహనదారుల ప్రాణాలకే ముప్పు. టన్నుల బరువు, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా రోడ్లు ధ్వంసం అవుతున్నాయి.

## పార్కు సిద్ధం.. ప్రవేశం నిషిద్ధం!

హైదరాబాద్: మహానగరంలో హిమాయత్‌సాగర్ చెంత హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన ఏకోపార్కు ప్రారంభానికి ఎదురు చూస్తోంది. కార్తిక మాసంలోనైనా అందుబాటులోకి తెస్తే కుటుంబాలతో వెళ్లి ప్రకృతిలో గడిపేందుకు అవకాశం ఉంటుందని నగర వాసులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. శంషాబాద్ సమీపంలోని కొత్వాల్‌గూడలో 85 ఎకరాల విస్తీర్ణంలో ఏకో పార్కును దాదాపు రూ.75 కోట్లతో హెచ్‌ఎండీఏ తీర్చిదిద్దింది. పార్కు సిద్ధమైనా సందర్శకులను అనుమతించడం లేదు. తొలుత సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నప్పటికీ కార్యక్రమం వాయిదా పడుతూ వస్తోంది. ఆకట్టుకునే పక్షుల గ్యాలరీ.. పార్కులో వివిధ రకాల పక్షుల గ్యాలరీ విశేషంగా ఆకట్టుకుంటోంది. వివిధ దేశాల నుంచి వేయి రకాల పక్షులను తెచ్చిపెట్టారు. పార్కును ప్రారంభిస్తే సందర్శకులకు ఇవి కనువిందు చేయనున్నాయి. ఇదే పార్కులో సాహస క్రీడల కోసం 6 ఎకరాల్లో రకరకాల అంశాలను సిద్ధం చేశారు. అతిపెద్ద అక్వేరియం లేనట్టే... ఇదే పార్కులో దేశంలోనే అతిపెద్ద భూగర్భ అక్వేరియం ఏర్పాటు చేయాలని తొలుత హెచ్‌ఎండీఏ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో రకరకాల సముద్ర జీవులు, చేపలు, సరీసృపాలు లాంటివి ఈ అక్వేరియంలో అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. ఈ అక్వేరియం ఏర్పాటుకు గ్లోబల్ టెండర్లు



పిలిచినప్పటికీ పెద్దగా స్పందన రాకపోవడంతో ప్రస్తుతానికి ఈ ప్రాజెక్టును విరమించుకున్నట్లు తెలుస్తోంది.

**ఇవీ ప్రత్యేకతలు...**

85 ఎకరాల్లో పచ్చిక బయళ్లతో పార్కు
రకరకాల పక్షులతో అవియరీ(గ్యాలరీ)
బోర్డు వాక్, ఎలివేటెడ్ వాక్ ఏరియా (2.5 కి.మీ)
బటర్‌ఫ్లై పార్కు, వివిధ రకాల వృక్షాలు
రకరకాల పువ్వులతో పెద్ద తోట
అడ్వెంచర్ జోన్
ఓపెన్ ఎయిర్ థియేటర్, ఫుడ్‌కోర్టు
లగ్జరీ ఫుడ్ కాటేజీలు, మినీ కన్వెన్షన్ సెంటర్

## క్యూఆర్ కోడ్ స్కాన్‌తో తితిదే సమాచారం



హిమాయత్‌నగర్: భక్తులు ఎప్పటికప్పుడు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) సమాచారం తెలుసుకునేలా హిమాయత్‌నగర్ (లిబర్టీ)లోని తితిదే దేవాలయం వద్ద 'క్యూఆర్ కోడ్'లతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. భక్తులు ఆ క్యూఆర్ కోడ్‌లను చరవాణితో స్కాన్ చేస్తే చాలు ఎస్ఎస్‌డీ టికెట్లు, ఆర్జిత సేవా టికెట్లు, స్పెషల్ దర్శనం, సేవా ఎలక్ట్రానిక్ డీప్, శ్రీవాణి టికెట్లు, వసతి తదితరాల సమాచారం కళ్ల ముందు ప్రత్యక్షమవుతుంది. శ్రీవారి సేవలు, టికెట్ల బుకింగ్ కోసం సంప్రది ంచాల్సిన అధికారిక వెబ్‌సైట్ (%https://ttdevasthanams.a p.gov.in%) యూఆర్‌ఎల్‌ను కూడా ఫ్లెక్సీపై ముద్రించారు. ఏదైనా సమాచారాన్ని తెలుసుకోవడానికి, సేవలు పొందటానికి తితిదే అధికారిక వెబ్‌సైట్, సామాజిక మాధ్యమ పేజీలను మాత్రమే ఉపయోగించాలని తితిదే అధికారులు సూచిస్తున్నారు.

## అనుమతులు లేకుండానే.. అడ్డగోలుగా కనెక్షన్లు



హైదరాబాద్: నగరంలో విద్యుత్తు కనెక్షన్ కావాలంటే జీహెచ్‌ఎంసీ, శివార్లలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఇంటి నిర్మాణ అనుమతి పత్రం ఉండాలి. నిర్మాణం 10 మీటర్లు దాటితే ఆయా సంస్థల నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) తప్పనిసరి. ఓసీ లేకున్నా.. నకిలీ ఓసీ సమర్పించి విద్యుత్తు కనెక్షన్లు పొందుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. వీటిపై టీజీఎస్పీడీసీఎల్ విజిలెన్స్ విభాగం విచారణ జరపగా విస్తుపోయే అక్రమాలు వెలుగుచూశాయి. సైబర్‌సిటీ సర్కిల్‌లోని గచ్చిబౌలి టీఎన్‌జీవో, గౌలిదొడ్డి, కంచ గచ్చిబౌలి, నానక్‌రాంగూడ తదితర ప్రాంతాల్లో అనుమతులే లేని భవనాలకు విద్యుత్తు కనెక్షన్లు, ఏకంగా ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేశారు.

**యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘనలు**

ఐటీకారిడార్ కేంద్రంగా ఉన్న సైబర్‌సిటీ సర్కిల్‌లో ఇటీవల పలువురు విద్యుత్తు ఇంజినీర్లు ఏసీబీకి పట్టుబడ్డారు. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టిన కేసులో జైలు కెళ్లారు. పలువురు అధికారులు లక్షలు ఖర్చుచేసి ఈ ప్రాంతంలో పోస్టింగ్ తెచ్చుకుని వసూళ్లకు పాల్పడుతున్నారు. ఓసీ, అనుమతి లేకుంటే వారి పంట పండినట్లే. విజినెన్స్ విచారణలో ఇక్కడ పనిచేసిన లైన్ ఇన్‌స్పెక్టర్ నుంచి ఏడీఈ వరకు నిబంధనలు ఉల్లంఘించారని గుర్తించింది. వీరిపై చర్యలు తీసుకోవాలని సీఎండీకి నివేదిక ఇచ్చింది.

**అవకతవకల చిట్టా ఇది..**

గచ్చిబౌలి టీఎన్‌జీవో కాలనీ ఫేజ్2లో ఒక ప్రభుత్వ ఉద్యోగి జీ౦4 అంతస్తుల భవనం నిర్మించారు. ఆ ఇంటికి నాలుగు విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చారు. అసలు భవనం నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ అనుమతి లేదని టీజీఎస్పీడీసీఎల్ విచారణలో తేలింది. టీఎన్‌జీవో సొసైటీ అనుమతి తీసుకుని నాలుగంతస్తుల భవనం కట్టారు. ఇది పూర్తిగా అక్రమ నిర్మాణం. అప్పుడు అక్కడ పనిచేసిన సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేశ్ క్షేత్రస్థాయిలో పరిశీలించిన నివేదిక లేకుండా మీటర్లు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీ అనుమతి లేకుండా నిర్మించిన మరో భవనానికి, జర్నలిస్టు కాలనీలో కట్టిన మరో భవనానికి మీటర్లు జారీ చేశారు.

టీఎన్‌జీవో కాలనీలోనే 10 మీటర్లు పైన కట్టిన మరో భవనానికి ఓసీ లేకుండా అప్పటి గచ్చిబౌలి ఏఈ, ప్రస్తుతం సైఫాబాద్ సీబీడీ ఏఈగా విధులు నిర్వహిస్తున్న పి.వి.బి.వేణుగోపాల్ మీటర్లు జారీ చేశారు. మరో భవనానికి ఏకంగా ప్యానల్ బోర్డు జారీ చేశారు.

కంచ గచ్చిబౌలిలో రెండు భవనాలు, నానక్‌రాంగూడలో కట్టిన మరో బహుళ అంతస్తుల భవనాలకు జీహెచ్‌ఎంసీ అనుమతులే లేవు. 10 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో కట్టారు. ఓసీ లేకున్నా.. వీటికి గచ్చిబౌలి ఆపరేషన్స్ ఏఈ టి.భాస్కరరావు ప్యానెల్‌బోర్డులు, ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేశారు.

గౌలిదొడ్డిలో జీ౦5 భవనానికి జీహెచ్‌ఎంసీ అనుమతే లేదు. ఏఈ టి.వెంకట్ నారాయణ రెడ్డి దీనికి ప్యానల్ బోర్డు, ట్రాన్స్‌ఫార్మర్‌లను మంజూరు చేశారు.

## ఫ్యాబ్‌సిటీలో ఐటీ సంస్థలు.. పరిశ్రమలు



హైదరాబాద్ : బాహ్యవలయ రహదారికి సమీపంలోని తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. వీటిని భారత్ ఫ్యూచర్‌సిటీలోని సంస్థలకు అనుసంధానం చేసేలా రెవెన్యూ, పరిశ్రమల శాఖ అధికారులు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఫ్యాబ్‌సిటీ ప్రత్యేక ఆర్థిక మండలిలోని 922 ఎకరాలను సెజ్ నుంచి మినహాయించడంతో రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది. ఫ్యాబ్‌సిటీకి 15 కి.మీ. దూరంలోనే భావినగరం నిర్మాణమవుతున్న నేపథ్యంలో.. మార్గమధ్యలో మరిన్ని ఐటీ సంస్థలు, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్ సంస్థలు ఏర్పాటయ్యేలా, ఏడాదిలోపు రూ.5వేల కోట్ల పెట్టుబడులు రాబట్టేలా కార్యచరణ రూపొందించారు

సెమీ కండక్టర్లు... ఇంధన నిల్వ కేంద్రాలు ఇరవై ఏళ్ల క్రితం ఫ్యాబ్‌సిటీ నిర్మాణ దశలో సెమీ కండక్టర్ల పరిశ్రమలకు ఆ శాఖ అధికారులు ప్రాధాన్యమిచ్చినా ఆశించినస్థాయిలో రాలేదు. వెయ్యి ఎకరాలు మిగిలిపోయాయి. సెమీకండక్టర్ల పరిశ్రమలను ప్రోత్సహించాలంటూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సూచించడంతో.. ఫ్యాబ్ సిటీలో సెమీ కండక్టర్లు, ఇంధన నిల్వల కేంద్రాలకు ప్రాధాన్యమివ్వాలని సంబంధిత అధికారులు నిర్ణయించారు. ఐటీ, ఎలక్ట్రానిక్ సంస్థలు, పరిశ్రమలకూ పాధాన్యమివ్వనున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా.. పరోక్షంగా 15 వేల మందికి ఉద్యోగ, ఉపాధి లభించనుందని అధికారుల అంచనా.

**ప్రత్యేక రహదారులు... మౌలిక సదుపాయాలు**

ఫ్యాబ్‌సిటీ, భారత్ ఫ్యూచర్ సిటీల మధ్య ప్రత్యేక రోడ్లు, మౌలికసదుపాయాలను అధికారులు కల్పించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్– శ్రీశైలం రోడ్డు, శంషాబాద్–గచ్చిబౌలి బాహ్యవలయ రహదారులు మాత్రమే ఉన్నాయి. వీటితోపాటు ఫ్యూచర్ సిటీకి కొంగర్‌కలాన్ నుంచి 330 అడుగుల రోడ్డు నిర్మించనున్నారు. విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రోరైలునూ అందుబాటులోకి తేవాలని యోచిస్తున్నారు. శంషాబాద్ నుంచి తుక్కుగూడ మీదుగా కలెక్టరేట్ వరకు రహదారి కూడా అందుబాటులోకి రానుంది. తద్వారా ఫాక్స్‌కాన్, మరో రెండు పరిశ్రమలకు అనుసంధానం ఏర్పడనుంది.

## వ్యాపార విస్తరణకు చేయూత

పరిగి : వీధి విక్రయదారులకు ఆర్థికంగా చేయూత నిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ నిధి యోజన పథకాన్ని అమలు చేస్తోంది. అధిక వడ్డీల భారం నుంచి వీరిని గట్టెక్కించి స్వశక్తితో నిలదొక్కుకునేలా చేయడం దీని ఉద్దేశం. ఈ క్రమంలోనే మూడు విడతలుగా వీధి వ్యాపారులను గుర్తించి ఆర్థిక సాయం అందజేస్తోంది. వాయిదాలు క్రమం తప్పకుండా చెల్లిస్తున్న వారిని ప్రోత్సహించేందుకు రాయితీ సదుపాయాన్ని కల్పిస్తోంది. దీన్ని కొందరు చక్కగా వినియోగించుకుంటూ వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నారు. తద్వారా వారి కుటుంబాలకు చేదోడుగా నిలుస్తున్నారు. నాలుగు పురపాలికల్లో 7,887 మంది వీధి వ్యాపారులను అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు వారికి సుమారు రూ.2.76 కోట్లు రుణంగా అందించారు. కొత్తగా క్రెడిట్‌కార్డులు అందించేందుకు కసరత్తు చేస్తున్నారు.

**నాలుగో విడతలో ఇలా..**

ఇప్పటివరకు ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ నిధి యోజన పథకాన్ని పట్టణ ప్రాంతాల్లోనే అమల్లో ఉంది. ఎంపిక చేసిన వీధి వ్యాపారులకు తొలి విడతలో రూ.10వేల చొప్పున 7,887 మందికి, రెండో విడతలో 4,875 మందికి రూ.20వేల చొప్పున, మూడో విడతలో 2,070 మంది వ్యాపారులకు రూ.50వేల చొప్పున రుణ సదుపాయం కల్పించారు. నాలుగో విడతలో వికారాబాద్ పురపాలికలో 793



మందికి, తాండూరులో 840, పరిగిలో 250, కొడంగల్‌లో 280 మందికి క్రెడిట్ కార్డులు అందించనున్నారు. గతంలో రుణం తీసుకొని క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించినవారే నాలుగో విడతకు అర్హులుగా నిర్ధారించారు.

**పరిమితి రూ.30 వేలు..**

నిరుపేద కుటుంబాల్లోనూ ఆర్థిక అక్షరాస్యతను తీసుకొచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే క్రెడిట్ కార్డులను అందించేందుకు క్షేత్రస్థాయిలో సర్వే ముమ్మరం చేశారు. వచ్చిన దరఖాస్తులను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఒక్కో క్రెడిట్ కార్డుపై రూ.10వేల నుంచి గరిష్ఠంగా రూ.30వేల దాకా పరిమితి ఉంటుందని అధికారులు తెలిపారు. వచ్చే ఏడాది మార్చికల్లా లక్ష్యం పూర్తి చేస్తాం..: రవికుమార్, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్, మెప్మానిర్దేశిత లక్ష్యాన్ని వచ్చే ఏడాది మార్చికల్లా పూర్తి చేయాలని పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నాం. వ్యాపారంతో ఎప్పటికప్పుడు వచ్చిన డబ్బులు చాలా వరకు ఖర్చు చేస్తున్నారు. పొదుపు అలవాట్లతో ఆర్థిక క్రమశిక్షణ అలవడుతుంది. ఆ దిశగా వారిని ప్రోత్సహిస్తున్నాం.

## జీరో దందా.. తలో వంద..!

నల్గొండ : ఉమ్మడి నల్గొండ జిల్లాలో జాతీయ, రాష్ట్ర రహదారులతో పాటు కంకర, ఇసుక నిల్వలను తీసుకెళ్లే వాహన చోదకుల అతివేగానికి అంతే లేకుండా పోయింది. మూడు జిల్లాల్లోని క్వారీలు, రీచ్‌ల్లో భూగర్భ గనులు, రెవెన్యూ అధికారుల అనుమతుల ప్రకారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సజావుగా సాగుతున్నా.. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అనధికారికంగా నిర్వహించే అక్రమ రవాణా వల్లే రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయి.

**రాజకీయ అండ**

నల్గొండ జిల్లాలో రావులబండ(దోమలపల్లి), నార్కట్‌పల్లి, కేతేపల్లి, కట్టంగూరు, దేవరకొండ, కొండమల్లేపల్లి, గాజీనగర్, పోలేపల్లి, దామరచర్ల, తిప్పర్తి, పెద్ద సూరారం, కనగల్, ఇనుపాముల, బొల్లేపల్లి, పోతినేనిపల్లి, ఇండ్లూరు, వేలాల ప్రాంతాల్లో యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తుండటతో రహదారులు దెబ్బతింటున్నాయి. రహదారి పనులకు ఉచితంగా 'జీరో' బిల్లు ఇచ్చేలా ఆయా క్రషర్ల యజమానులకు గనులు, ఆర్‌అండ్‌బీ అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో భారీగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోని బొమ్మలరామారం, పోచంపల్లి, బీబీనగర్ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా కంకర తవ్వకాలు జరుగుతున్నాయి.

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో రెండు, గరిడేపల్లి మండలంలో ఆరు కంకర మిల్లులున్నాయి. అప్పన్నపేట, హుజూర్‌నగర్–కోదాడ రోడ్ మధ్యలో ఉన్న కంకర మిల్లుల నుంచి వచ్చే పొగతో స్థానికులు, రవాణా వల్ల వెలువడే దుమ్ముతో వాహనదారులు ఇబ్బందులు



పడుతున్నారు. జీరో దందాను ఆసరాగా చేసుకుని క్రషర్ల నిర్వాహకులు ఒక బిల్లు చీటీతో దొంగ వేబిల్లులు సృష్టించి రెండు, మూడు లారీలను అక్రమంగా తరలిస్తున్నారు. దీనికి అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు సమయాన్ని ఎంచుకుంటున్నారు. అన్ని విభాగాల అధికారులకు, సిబ్బందికి 'నాలుగు రాళ్లు' వెనకేసుకునేలా చేస్తుండటంతో వారూ కూడా చూసీచూడనట్లు ఉంటున్నారనే ఆరోపణలున్నాయి.

జాతీయ, రాష్ట్ర రహదారులపై ఒకే నంబరు ప్లేట్లతో నాలుగైదు వాహనాలు ఉంటున్నాయి. బిహార్, ఒడిశాకి చెందిన వారిని డ్రైవర్లుగా నియమించడంతో వారు ఇష్టారీతిన నడిపిస్తున్నారు.

టిప్పరు, లారీలో గరిష్ఠంగా 30 టన్నుల కంకర నింపాలి. కానీ యజమానులు 70 టన్నుల వరకు నింపేస్తున్నారు. దీంతో వాహనాలు వంగి ప్రయాణించి.. వేగంపై పట్టు తప్పుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా భూగర్భ గనులశాఖాధికారి జాకబ్ సామ్యూల్‌తో ప్రస్తావించగా.. తనిఖీలు చేపట్టి అక్రమాలకు పాల్పడ్డ క్రషర్ యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# రూ.20కి వైద్యం.. సేవే ప్రధానం

సూర్యాపేట: అనారోగ్యానికి గురై ప్రైవేటుగా వైద్యానికి వెళ్తే ఫీజు రూపంలో వందల్లో తీసుకునే ఇప్పటి రోజుల్లో నామమాత్రపు ఫీజుతో వైద్యం అందిస్తూ నేటి సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.. సూర్యాపేట జిల్లాలో ప్రజావైద్యుడిగా పేరొందారు డాక్టర్ కొప్పుల రంగారెడ్డి. జిల్లాలోని ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టిన తాను సెలవుదినాల్లో పొలం పనులు చేస్తూ..పశువులను మేపుతూ పాఠశాల విద్యాభ్యాసం సొంతూరిలోనే పూర్తి చేశారు. ఆ సమయంలో చుట్టు పక్కల ప్రజలు, తమ బంధువులు కొందరు అనారోగ్యానికి గురవడం ఆ సమయంలో సరైన వైద్యం అందని పరిస్థితులను చూసి.. తాను డాక్టర్ కావాలనే లక్ష్యం ఏర్పరచుకున్నారు. పట్టుదలతో చదివి గాంధీ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. వైద్యవృత్తిలో పనితీరును మెరుగుపరచు కోవడానికి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలు పర్యటించి ఆపై చదువులకు వెళ్లలేదు. ప్రభుత్వ వైద్యుడిగా అవకాశాలు తలుపు తట్టినా కాదన్నారు. చిన్ననాడే నిర్ణయించుకున్నట్లుగా 1983-84 మధ్య కాలంలో సూర్యాపేటలో ఆసుపత్రిని ప్రారంభించి వైద్యసేవలకు శ్రీకారం చుట్టారు.

**రూ.3 ఫీజుతో మొదలు:** తన వంతుగా పేదలకు కాస్తయినా



సాయపడాలన్న ధ్యేయంతో నామమాత్రపు ఫీజు తీసుకుంటూ వైద్య సేవలందిస్తున్నారు. దాదాపు 40 ఏళ్ల నుంచి వైద్య వృత్తిలో రాణిస్తున్న రంగారెడ్డి సంపాదన కాదు..రోగుల సేవే ప్రధానమంటూ తొలుత రూ.3 ఫీజుతో సేవలను ప్రారంభించి క్రమంగా రూ.5, రూ.7, రూ.10 ఇప్పుడు రూ.20 ఫీజు తీసుకుంటున్నారు. మొదటి నుంచి అద్దె భవనంలో రెండు పడకల ఆసుపత్రిని నిర్వహిస్తున్న తనవద్దకు నిత్యం సగటున 50 మంది వైద్యం కోసం వస్తున్నారు. ఫీజు ఇవ్వలేని వారుంటే ఉచితంగానే చికిత్స అందిస్తున్నారు. తమ ఇళ్లలో ఎవరికైనా సుస్తీ చేసిందంటే డాక్టర్ రంగారెడ్డి నాడి పడితే నయం అవుతుందని గట్టి నమ్మకమని అక్కడికి వైద్యానికి వచ్చిన సంజీవ, లక్ష్మి, సునీత చెప్పారు.

**కుటుంబ సహకారంతో: డా.రంగారెడ్డి**

కుటుంబ సహకారంతోనే తక్కువ ఫీజుతో వైద్యసేవ అందిస్తున్నాను. ఆసుపత్రికి గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు అధికంగా వస్తారు. వారికి ఉన్న రుగ్మతనుబట్టి అవసరమైన మందులను రాస్తాను. కరోనా సమయంలోనూ జాగ్రత్తలు పాటిస్తూ వైద్యం అందించాను. కొంతకాలం బస్తీదవాఖానలో పనిచేశాను.

# అటు భద్రాద్రి.. ఇటు స్తంభాద్రి

కొత్తగూడెం: పూర్వ ఖమ్మం జిల్లాలో తూర్పున ఉండే చివరి పట్టణం భద్రాచలం. గోదావరి అంచున ఉండే ఈ రామ క్షేత్రానికి వరదలు కొత్తేంకాదు. ఏటా మూడు నాలుగు నెలలపాటు భయం గుప్పిట తీరప్రాంత ప్రజలు మనుగడ సాగిస్తుంటారు. ఇప్పుడు అదే భయం పశ్చిమ తీరాన ఉన్న ఖమ్మం నగరవాసులను పట్టుకుంది. ఇంతకుముందెన్నడూ చూడని వైపరీత్యాలను గత మూడు నాలుగేళ్ల వ్యవధిలో చూస్తున్నట్టు వయోధిక నగరవాసులు చెబుతున్నారు. వర్షాకాలం అంటే 'అమ్మో మున్నేరు' అనే పరిస్థితికి చేరింది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే భద్రాచలం, ఖమ్మం నగరాలకు వరదల విషయంలో సారూప్యతలున్నాయి.

భద్రాచలం మండలంలో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. ఖమ్మం అర్బన్ మండలంలో సాధారణ వర్షపాతం కంటే కొంత ఎక్కువ వర్షం పడింది. తుపాను ప్రభావం వల్ల కురిసిన వర్షాలతోనే రెండుచోట్లా ఇది సాధ్యమైంది. అంతకు ముందు ఈ రెండు మండలాల్లో లోటు ఉండటం గమనార్హం.

వందేళ్ల చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా 2024లో మున్నేరుకి 36 అడుగుల వరద వచ్చింది. 25కు పైగా కాలనీలు పూర్తిగా నీటమునిగాయి. ఈ ఏడాది మొంథా తుపానుతో మళ్లీ విలవిల్లాడింది.



ఖమ్మం నగరంలో కూడా చుక్క వర్షం పడకున్నా ఎగువన మహబూబాబాద్ జిల్లాలో వర్షం కురిస్తే ఉగ్రరూపం దాలుస్తుంది. గత మూడేళ్లలో ఈ సమస్య తీవ్రతరమైంది.

**స్థానికంగా చినుకు పడకపోయినా..** క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసే భారీ వర్షాలతో రెండు చోట్లా వరదలు పోటెత్తుతున్నాయి. ఎగువన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిస్తే.. గోదావరిలోకి పెద్దఎత్తున వరద చేరి భద్రాచలాన్ని ముంచెత్తుతోంది. నీటిమట్టం 43 అడుగులు దాటితే మురుగు నీరు గోదావరిలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన స్లూయిజ్‌లు మూసివేయాల్సి వస్తోంది.

# ఆయిల్‌పామ్ రైతులకు శుభవార్త

ఖమ్మం : సమీకృత ఉద్యాన మిషన్‌లో భాగంగా ఆయిల్‌పామ్ సాగులో యాంత్రీకరణ పరికరాల కోసం రైతుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో రైతులు ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. ప్రధానంగా ఆయిల్‌పామ్ పంటను భద్రాద్రి జిల్లాలో 83,41 ఎకరాల్లో, ఖమ్మంలో 42,385 ఎకరాల్లో పండిస్తున్నారు. ఈ పంట సాగు చేసే రైతులకు యాంత్రీకరణ పథకం ద్వారా మరింత లబ్ధి చేకూరనుంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాకు 2025-26 వార్షిక లక్ష్యాలను కేటాయిస్తూ ఉద్యాన శాఖ కమిషనర్ యాస్మిన్‌బాషా ఉత్తర్వులు జారీ చేశారు.

'ఉద్యాన పంటల యాంత్రీకరణ పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం సమీప ఉద్యాన అధికారులు లేదా ఉద్యాన విస్తరణ అధికారులను సంప్రదించాలి. ఈ నెల 10లోపు తమ దరఖాస్తులను సమర్పించాలి.'ఎంవీ మధుసూదన్, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి, ఖమ్మం.

# యువతా.. మీరే మేలుకోవాలి



ఖమ్మం : వారి శాఖ పేరులో 'శ్రమ' ఉన్నా తీరులో అదెక్కడా కనిపించదు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని యువత ఉపాధి కల్పనకు దోహదపడే సదవకాశం చేతుల్లో ఉన్నా, చేతల్లో ఎంతమాత్రం చూపటంలేదు. విద్యార్థులు, ఉపాధి దారులు వెతుక్కోవటంలో సోదర శాఖలు అంతోఇంతో తపన పడుతున్నా, ఆ తాపత్రయే జిల్లా పరిశ్రమల శాఖలో కనిపించటం లేదు. దాదాపు ఏడాది వ్యవధిలో డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీఈఈటీ) పథకం ద్వారా కేవలం ఇద్దరికే ఉద్యోగాలు చూపగలిగారంటే పనితీరు అర్థం చేసుకోవచ్చు.

**ఏమిటీ డీఈఈటీ**

నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 2024, డిసెంబరు నెలలో డీఈఈటీ పేరుతో వెబ్‌సైట్ ఆవిష్కరించింది. 2019లో ఓ ప్రైవేటు సంస్థ నుంచి ఈ వెబ్‌సైట్ ప్రభుత్వం కొనుగోలు చేసింది. పరిశ్రమల సహకారంతో పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించేందుకు వెబ్‌సైట్‌తో పాటు మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. నైపుణ్యవంతులైన నిరక్షరాస్యులు మొదలు పీజీ, పీహెచ్‌డీ విద్యార్హత కలిగిన వారందరూ దరఖాస్తుకు అర్హులే. మొత్తంగా జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగులు, పరిశ్రమలకు మధ్య వారధిలా వెబ్‌సైట్ పనిచేయాలి. క్షేత్ర స్థాయిలో మాత్రం భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

**పరిశ్రమల శాఖ ఏం చేయాలి?**

1. యాప్‌పై విద్యార్థుల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలి. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ తదితర కాలేజీల్లో సదస్సులు ఏర్పాటు చేయాలి. రిజిస్ట్రేషన్ నమోదులో సహకరించాలి.
2. జిల్లాలోని చిన్న, మధ్యతరహా పరిశ్రమలు డీఈఈటీ గూటికిందకు వచ్చేలా చూడాలి. ఖాళీలను ఎప్పటికప్పుడు తెలియజేసేలా ప్రోత్సహించాలి.
3. ఖాళీల సమాచారాన్ని యువతకు చేరవేసి, ఉద్యోగ కల్పనకు సహకరించాలి.
4. జిల్లా ఉపాధి కల్పన, కార్మిక శాఖలతో కలిసి విస్తృత ప్రచారం చేయాలి. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలను భాగస్వామ్యం చేయాలి.

**ఏం చేశారు?**

కలెక్టర్ చేతుల మీదుగా ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. విద్యార్థులతో కేవలం ఒకటే సమావేశం నిర్వహించి మిన్నకున్నారు. నిర్దేశిత అర్హతలు పరిగణలోకి తీసుకున్నా జిల్లాఓ ఇంకా చాలా పరిశ్రమలు పేర్లు నమోదు చేసుకోలేదు. వారితో సమావేశాలు నిర్వహించి, ప్రోత్సహించే ప్రయత్నమే కరవైంది.

పది నెలలు దాటినా రెండే కొలువులు చూపగలిగారు. సమాచారం చేరవేయటం అటుంచి ఈ వైఫల్యంపై సమీక్షించుకున్న దాఖలాలే లేవు.

వెబ్‌సైట్‌ను నిరుద్యోగ యువత, విద్యార్థుల్లోకి తీసుకెళ్లే ప్రయత్నమే లేదు. జనరల్ మేనేజర్ పోస్టు ఇన్‌ఛార్జి బాధ్యతలు కావటం, కిందిస్థాయి ఉద్యోగులకు పూర్తిస్థాయి అవగాహన లేకపోవటంతో ఆసక్తి కరవైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా మార్గదర్శకం కరవైంది.

'విద్యా సంస్థలతో కలిసి అవగాహన సమావేశం నిర్వహించాం. విద్యా సంస్థలకు వెళ్లి సదస్సులు నిర్వహించాలన్నా, విస్తృత ప్రచారం చేయాలన్నా నిధులలేమి ఆటంకంగా మారింది.'

జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు

జిల్లాలో డీఈఈటీ వెబ్‌సైట్‌లో నమోదైన నిరుద్యోగులు: 5,866
నమోదైన పరిశ్రమలు: 33
ఇప్పటివరకు కల్పించిన ఉద్యోగాలు: 2
ప్రస్తుతం ఉద్యోగ ఖాళీలు: 50

# మాటలొద్దు.. మూటలే ముద్దు!




మెదక్ : మెదక్ జిల్లాలోని వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లలో కీలకంగా వ్యవహరించే ధరణి(భూ-భారతి) పోర్టల్ ఆపరేటర్లు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీన్ని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురికి స్థానచలనం కలిగించారు. హెచ్చరికలు జారీచేశారు. ప్రత్యేకంగా నిఘా పెట్టి అక్రమదందాను కట్టడి చేశారు. అయితే కొందరు ఆపరేటర్లు ఇటీవల పైరవీలు చేసి డిప్యుటేషన్ పేరుతో తిరిగి గతంలో విధులు నిర్వహించిన మండలాల్లోనే బాధ్యతలు చేపట్టడంపై విమర్శలొస్తున్నాయి.

**అంతా వారే...**తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే రిజిస్ట్రేషన్లలో ఆపరేటర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని మండలాల్లో స్లాట్ బుక్ చేయడం మొదలుకొని రిజిస్ట్రేషన్ ప్రక్రియ వరకు అంతా కానిచ్చేస్తున్నారు. ఇందుకు పెద్దమొత్తంలో వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనికి తోడు సంతోషంగా ఎంతో కొంత ముట్టచెప్పాలని నిర్దేశిస్తున్నారు. గతంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇవ్వలేదా ఇప్పుడెందుకు ఇవ్వరు అని ప్రశ్నిస్తున్నారు. మామూళ్లు ఇచ్చేది లేదని ఎవరైనా రైతులు చెబితే చాలు కొర్రీలు పెట్టి నానా ఇబ్బందులు పెడుతున్నారు.

భూ-భారతి సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. వారం రోజుల కిందట హవేలిఘనపూర్ మండలంలో గుట్టల్లో ఉన్నటువంటి భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు ఓ రైతును రూ.3 వేలు లంచం డిమాండు చేయడంతో పాటు రూ.500 నోట్లు మాత్రమే ఇవ్వాలని నిర్దేశించారు. దీంతో అమాయక రైతు సమీపంలోని దుకాణాలు, సంస్థల చుట్టూ రూ.500 నోట్లు కావాలంటూ తిరిగారు. ఇదేంటని స్థానిక యువకులు రైతుతో మాట్లాడగా మామూళ్ల విషయం బయటపడింది. స్థానిక యువత రెవెన్యూ కార్యాలయంలో వసూళ్లపై ఉన్నతాధికారులతో పాటు అనిశా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

మచ్చుకు కొన్ని..

శివ్వంపేటలో విధులు నిర్వహించే ఆపరేటర్‌ను తుప్రాన్‌కు, అక్కడి నుంచి అల్లాదుర్గం మండలానికి బదిలీ చేశారు. 15 రోజుల కిందట తిరిగి డిప్యుటేషన్‌పై శివ్వంపేటకు రావడం కొసమెరుపు.

వెల్దుర్తి మండలంలో పనిచేసే ఆపరేటర్‌ను నిజాంపేటకు స్థానచలనం కల్పించగా ఇటీవల తిరిగి ఇక్కడే పోస్టింగ్ ఇచ్చారు. ఇలా పలువురికి కలెక్టర్ ఆదేశాలు భేఖాతరు చేస్తూ మౌఖిక ఆదేశాలపై డిప్యుటేషన్ చేశారు. ఇంకా పలు మండలాల్లోనూ సైతం కలెక్టర్‌కు తెలియకుండా బదిలీ చేసినట్లు తెలుస్తోంది.

ఆపరేటర్ల మౌఖిక డిప్యుటేషన్ల వ్యవహారంలో పెద్దఎత్తున నగదు చేతులు మారాయనే విమర్శలు వస్తున్నాయి. విచారణ చేస్తే వాస్తవాలు వెలుగులోకి రానున్నాయి.

# మీ చరవాణిలో 'జీపే' ఉందా..?

హైదరాబాద్ : 'మీ ఇంట్లో ఎంతమంది ఉంటున్నారు.. ఎంతమందికి ఓట్లు ఉన్నాయి.. ఇంటి పెద్ద ఫోన్‌నెంబరు ఇవ్వండి..' 'మా ఫోన్ నంబరు ఎందుకు..?'అరె పెద్దాయనతో మాట్లాడిస్తా.. జీపే ఉందా.. పీపేనా.. త్వరలో డబ్బులు పడతయ్.. చెక్ చేసుకొని ఓటు వేయండి..!'జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న తంతు ఇది..! ఇంటింటికి తిరుగుతున్న బృందాలు.. ఆ ఇంటి పెద్దల చరవాణి నంబర్లు సేకరిస్తున్నారు. పెద్దలకు ఫోన్‌పేలు, జీపేలు లేకపోతే వారి పిల్లల నంబర్లు తీసుకుంటున్నారు. నంబర్లు సేకరిస్తున్నారే తప్ప.. ఇంతవరకు ఎవ్వరికీ డబ్బులు పడలేదని ఓటర్లు చెబుతున్నారు. ఇప్పటికే ప్రలోభాలకు రాజకీయ పార్టీలు తెరలేపాయి. ఇంటింటికీ పంపిణీ చేసేందుకు ఆశలు రేపుతున్నారు. ఇప్పటివరకు ప్రచారానికి ప్రాధాన్యం ఇస్తున్న పార్టీలు ఇక ఇంటింటికి ఓటర్లను కలిసేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

కొన్ని కాలనీల్లో రోజూ చికెన్, మటన్, మందు పంపిణీ చేస్తున్నారు. కొంతమంది ముఖ్యులకు అందిస్తున్నారు. త్వరలో ఓట్ల సంఖ్యను బట్టి నగదు అందుతుందని హామీ ఇస్తున్నారు.

తమ దగ్గర నంబర్లు తీసుకున్నారు.. కానీ ఇంతవరకు ఏమీ ఇవ్వలేదని రహ్మత్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి చెప్పారు.

**దుకాణంలో స్లిప్..**



కొన్ని కాలనీల్లో గృహోపకరణాలు, ఇతర వస్తువులు పంపిణీకి స్లిప్పులు ఇస్తున్నారు. సమీపంలోని దుకాణంలో స్లిప్పు ఇచ్చి.. కుక్కర్లు, మిక్సీలు, కుర్చీలు తీసుకెళుతున్నారు.

**కనీసం 3 లక్షల మందికి..**

నియోజకవర్గంలో మొత్తం 4.01 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారి చిరునామాలు సేకరించి పోలింగ్ కేంద్రాల వారీగా ఇంఛార్జులను, వందమందికి ఓ ఇంచార్జిని పార్టీలు నియమించుకున్న విషయం తెలిసిందే. వీరిలో కనీసం 3లక్షల మందికి బహుమతులు లేదా నగదు అందజేయాలనే లక్ష్యంతో కొంతమంది పనిచేస్తున్నారు.

# కట్టలు కట్టలుగా సంపాదన

ఖమ్మం :రోజువారీ సంపాదన రూ.10 వేలంటే సాధారణంగా వారు ఏ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులో అయిఉంటారని అందరం భావిస్తాం. కానీ వారు ఏసీ గదుల్లో పనిచేయరు. నిత్యం నడిఎండన కష్టపడతారు. పైగా స్థిరనివాసులు కాదు. నెలకో ప్రాంతం తిరుగుతూ ఆర్జిస్తున్నారు. వీరికి అంత సంపాదన ఎలా వస్తోందనేగా మీ అనుమానం.. అయితే ఈ కథనం మీరు చదవాల్సిందే..

**ఎంచుకున్న వృత్తి**

వరి కోతల అనంతరం కాల్చివేసే గడ్డిని చుట్టలుగా చుట్టడం. కోతల తర్వాత మిగిలిన గడ్డిని కొందరు రైతులు కాల్చి వేస్తుంటారు. మరికొందరు పశువుల మేత కోసం కట్టలు కట్టించి, ఎక్కువ ఉంటే అమ్మేస్తుంటారు. సంప్రదాయ పద్ధతిలో కాకుండా.. బేలరు యంత్రంతో కట్టలు కట్టే వృత్తి ఎంచుకున్న ఇతర రాష్ట్రాల వారికి ఇది భారీగా సంపాదించి పెడుతోంది. వీరిని చూసి తెలంగాణలోనూ ఈ యంత్రాలు కొనుగోలు చేయడం ప్రారంభించారు.



ఎక్కడి నుంచి వస్తున్నారు: ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాలు ఎక్కడెక్కడ పనిచేస్తారు: నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, తమిళనాడు.

ఎలా వస్తారు: ఒక రోజంతా ప్రయాణించి ట్రాక్టర్లపై కుటుంబ సమేతంగా వందల సంఖ్యలో తరలివస్తారు.

ఒక్కో గడ్డి కట్టకు: రూ.30-35 వసూలు.

రోజుకు ఎన్ని కట్టలు కడతారు: సుమారు 350-500 వరకు

రోజువారీ సంపాదన: రూ.10500 నుంచి రూ.15 వేల వరకు.

ఉపయోగించే యంత్రం: ట్రాక్టర్లతో కూడిన బేలరు(గడ్డి చుట్టే యంత్రం). ఎన్ని రోజులుంటారు: సెప్టెంబరులో ప్రారంభించి డిసెంబరు వరకు. పనిని బట్టి ఒక్కో జిల్లాలో నెల రోజులు.

మిగిలేది: ఖర్చులు పోను రూ.9-10 వేలు

# మరమ్మతులు ముఖ్యం.. నీటి నిల్వకు ఉపయుక్తం

మద్దిపాడు: జిల్లాలో పేరెన్నికగన్న జలాశయం.. గుండ్లకమ్మ జలాశయం. ప్రజల తాగు, సాగునీటి అవసరాలు తీరుస్తూ ఆసరాగా నిలుస్తున్న ఈ ప్రాజెక్టుకు 12 గేట్ల మరమ్మతులు పూర్తయ్యాయి. మిగిలింది 13వ గేటు మాత్రమే. దీనికి సకాలంలో మరమ్మతులు చేపడితే ప్రాజెక్టు నీటి నిల్వకు, సద్వినియోగానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**2008లో 3.8 టీఎంసీల సామర్థ్యంతో నిర్మాణం**

మద్దిపాడు మండల పరధిలో ఉన్న గుండ్లకమ్మ జలాశయాన్ని 2008లో 3.8 టీఎంసీల సామర్థ్యంతో 15 గేట్లతో నిర్మించారు. దీని ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతోంది. గత వైస్మీపీ నిర్లక్ష్యం కారణంగా 2, 3వ నంబర్ల గేట్లు కొట్టుకుపోయి నీరు నిలిచే పరిస్థితి లేకుండా పోయింది. రెండు సంవత్సరాల పాటు జలాశయం ఎడారిలా మారి ప్రజలు సాగు, తాగునీరు లేక ఇబ్బంది పడ్డారు.

**మరో 12 గేట్లు నిర్మించిన కూటమి ప్రభుత్వం**

కూటమి ప్రభుత్వం రాకతో గేట్ల నిర్మాణం, కాలువల మరమ్మతులు పూర్తయి జలాశయం నిండి రైతుల మోముల్లో ఆనందం కనిపించింది.



2, 3 నంబర్ల గేట్ల నిర్మాణంతో పాటు మరో 12 గేట్ల నిర్మాణం చేసి 13వ గేటు మాత్రం అకాల వర్షాలు, సాకేంతిక సమస్యలతో ఆపాల్సి వచ్చింది. తాజాగా మొంథా తుపాను సమయంలో ఈ గేటు ద్వారా నీరు విడుదల చేయకుండా స్టాప్‌లాక్‌తో స్టాండ్ బైగా వినియోగించారు. గతంలో స్టాండ్ బైగా వినియోగించే 15వ గేట్ ద్వారా నీటిని విడుదల చేశారు. జలాశయ చరిత్రలో రికార్డు స్థాయిలో లక్షా యాభై వేల క్యూసెక్కుల నీటిని కిందకు వదిలారు.

జలాశయ అధికారులను ఈ విషయమై వివరణ అడగగా 13వ నంబర్ గేటు మరమ్మతులతో పాటు జలాశయ నిర్వహణ పనుల నిమిత్తం రివైజ్‌డ్ అంచనాలను ప్రభుత్వ ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. మంజూరు కాగానే పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

# మొంథా.. మొత్తం ముంచేసింది!

మద్దిపాడు: మొంథా తుపాను నేపథ్యంలో గత నెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు కురిసిన కుండపోత వర్షాలు జిల్లాకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. వివిధ రకాల పంటలు దెబ్బతినడంతోపాటు పలు గ్రామాల మధ్య వాగులు, నదులు ఉద్ధృతితో పీఆర్, ఆర్అండ్‌బీ రహదారులు కోతకు గురయ్యాయి. విద్యుత్తు స్తంభాలు, పరివర్తకాలు నేలకొరిగాయి. క్షేత్రస్థాయిలో శాఖల వారీగా నష్టం అంచనా వివరాలను కలెక్టరేట్‌కు నివేదించారు. జిల్లాలోని పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని 12 వంతెనలతోపాటు కిలోమీటర్ల మేర రహదారులు కోతకు గురయ్యాయి. గ్రామాల మధ్య అనుసంధాన రహదారులు గుంతలమయంగా మారాయి. రక్షిత



తాగునీటి పథకాల విద్యుత్తు మోటార్లు, ఫిల్టర్‌బెడ్లు మరమ్మతులకు గురయ్యాయి. రహదారులు, భవనాలశాఖ పరిధిలో సుమారు 500 కిలోమీటర్ల మేర కోతకు గురయ్యాయి. వాగు, నదుల వరద ఉద్ధృతికి పలుచోట్ల వంతెనలు నేలమట్టం కావడంతోపాటు కాజ్‌వేలు కొట్టుకుపోయాయి. జిల్లాలోని అయిదు విద్యుత్తు ఉపకేంద్రాల్లోకి వరదనీరు చేరడంతో పరివర్తకాలు దెబ్బతినగా, తీగలు తెగిపోవడంతోపాటు స్తంభాలు నేలకొరిగాయి.

# మాఫీ కాక.. గోస తీరక..

పరిగి : రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన వీడడం లేదు. ఎప్పుడెప్పుడా అని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. వారం, పది రోజుల్లో యాసంగి సీజన్ ప్రారంభం కానుంది. దీంతో మళ్లీ పెట్టుబడుల సమస్య తలెత్తనుంది. రూ.2 లక్షలకుపైబడి రుణాలున్నవారంతా మాఫీ ప్రక్రియను ప్రారంభించాలని కోరుతున్నారు. కూలీల కొరత కారణంగానూ పంట సాగు తలకుమించిన భారంగా మారుతోంది. జిల్లాలో కూలీలు దొరక్కపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి రప్పిస్తున్నారు. ఇప్పటికే మొక్కజొన్న కోతలు ప్రారంభమయ్యాయి. పత్తితీసే పనులు వచ్చేనెల నుంచి మొదలు కానున్నాయి. గతేడాది కిలో పత్తి తీసేందుకు రూ.14 వరకు వెచ్చించాల్సి వచ్చింది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట దిగుబడులు అంతంత మాత్రంగానే ఉన్నాయని, ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయని వాపోతున్నారు.

**వ్యవసాయశాఖ వివరాల సేకరణ..:** రూ.2 లక్షలకుపైబడి రుణాలు తీసుకున్న రైతులతోపాటు ఆలోపు రుణమాఫీ వర్తించని వారి నుంచి జిల్లా వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించింది. ఆధార్, పట్టాదారు పాసుపుస్తకాల నెంబర్లు తప్పుగా పడటం, ఒకే కుటుంబం నుంచి ఒకరి కన్నా ఎక్కువ మంది వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవడం వంటి వివరాలను నిశితంగా పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి, ఏఈఓ కలిసి ఆయా రైతులతో స్వీయ చిత్రాలు తీసుకొని ప్రభుత్వానికి పంపారు. ఏడాది గడిచినా ఎలాంటి స్పష్టత



లేకపోవడంతో ఉసూరుమంటున్నారు. రూ.కోట్ల మాఫీ అమలు కావాల్సి ఉంది.

**పెరుగుతున్న వడ్డీ..:** రుణాలు తిరిగి చెల్లించడంలో జరుగుతున్న జాప్యంతో పెరుగుతున్న వడ్డీ రైతన్నల నడ్డి విరుస్తోంది. చాలామంది రుణమాఫీపైనే ఆశలు పెట్టుకొని చెల్లించలేదు. వెంటనే చెల్లించాలని బ్యాంకర్లు ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని చెబుతున్నారు. రూ.వేలల్లో వడ్డీ భారం పడుతోందని, చెల్లించకుంటే రెండోసారి రుణ మంజూరులో కొర్రీలు పెడుతున్నారు.

జిల్లాలో మండలాలు: 20

యాసంగి సాధారణ సాగు: 1,22,593 ఎకరాలు

మొత్తం రైతులు: 3,34,382

1- 3 విడతల వరకు రుణమాఫీ అయిన రైతులు: 89,433

మిగిలిన రైతులు: 3,500

ఎలాంటి ఆదేశాలు రాలేదు..

రూ.2 లక్షలకుపైబడి రుణం తీసుకున్న రైతులకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. నాలుగు విడతల్లో దాదాపు రూ.842 కోట్లు రుణమాఫీ అయింది.


టి.రాజారత్నం, జిల్లా వ్యవసాయాధికారి

# పనికో రేటు. .పైసలిస్తేనే దస్త్రం ముందుకు!

కరీంనగర్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు పల్లెల్లోని ప్రతి గడపకు చేర్చడంలో పంచాయతీ కార్యదర్శులది కీలకపాత్ర. వీరిలో కొందరు నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తుంటే.. మరికొందరు అమాయకుల నుంచి వసూళ్లకు పాల్పడుతు న్నారు. పనికో రేటు చెబుతూ.. పైసలిస్తేనే దస్త్రాన్ని ముందుకు పంపిస్తున్నారు. నెల రోజుల కిందట వీణవంక మండలంలోని చల్లూరు గ్రామ కార్యదర్శి ఇంటి నంబరు ఇవ్వడానికి రూ.20 వేలు లంచం డిమాండ్ చేసి.. అనిశాకు పట్టుబడ్డాడు. తాజాగా గంగాధర మండలం మధురానగర్ కార్యదర్శి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.10 వేలు లంచం అడిగి.. అనిశాకు చిక్కాడు. ఇలాంటి వారి తీరుతో నిజాయతీగా ఉండే ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు.

**కొరవడిన ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ**

గ్రామాల్లో సర్పంచి పాలన పూర్తయి ఏడాదిన్నర దాటింది. ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించినా వారిది వేర్వేరు శాఖల కావడం, పల్లె పాలనపై పట్టులేకపోవడం, మాతృశాఖ విధుల్లో నిమగ్నమై ఉండటంతో కొందరు కార్యదర్శు లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారిపై పర్యవేక్షణ కొరవడటంతో అవినీతికి పాల్పడుతున్నారు. కరీంనగర్ గ్రామీణ మండలంలో ఓ గ్రామానికి చెందిన వ్యక్తి చెరువు శిఖం భూమిలో రేకుల షెడ్లు నిర్మించుకోగా, కార్యదర్శి వాటిని తొలగించేలా చర్యలు తీసుకోకుండా వాటికి



ఇంటి నంబర్లు కేటాయించారు. గంగాధర మండలం లోని ఓ గ్రామ కార్యదర్శి స్థానిక నేతలతో కుమ్మక్కై ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి ఇళ్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేశాడు. ప్రజలు తీవ్ర ఆరోపణలు చేసి అతనిపై ఒత్తిడి పెంచడంతో తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చేశాడు. శంకరపట్నం మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఒక నిరుపేద కుటుంబం ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోగా ఆ కార్యదర్శి ఆరు నెలలుగా సతాయించాడు. చేసేదిలేక బాధిత కుటుంబం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది.

**ఏ పనులకు అడుగుతున్నారంటే..**

కరీంనగర్ పట్టణ శివారు మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూముల్లో పలువురు ఇళ్లు నిర్మించుకున్నా అధికారులు అడ్డుకోలేదనే ఆరోపణలున్నాయి. వీరు ఆ గ్రామాల కార్యదర్శుల సహకారంతో అక్రమంగా ఇంటి నంబర్లు పొందారు. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ అనుమతుల సమయంలో, ఇంటి నంబర్లు కేటాయించేటప్పుడు, జనన, మరణ తదితర ధ్రువీకరణ పత్రాలు జారీ సమయంలో, సంతలు నిర్వహించి వాటి నుంచి పన్నులు వసూలు చేయడంలాంటి సందర్భాల్లో అవినీతికి పాల్పడుతున్నారు. **లంచం డిమాండ్ చేస్తే సమాచారం ఇవ్వండి** ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే మాకు సమాచారం ఇవ్వండి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. అవసరమైన వారు అవినీతి నిరోధక శాఖ నంబరు 91543 88954కు ఫోన్ చేసి వివరాలు చెప్పొచ్చు. విజయ్‌కుమార్, ఏసీబీ డీఎస్పీ, కరీంనగర్

# ఈపీఎఫ్.. అంతా గప్‌చుప్!



ఆదిలాబాద్ : రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(రిమ్స్)లో పొరుగు సేవల ఏజెన్సీల పనితీరుపై అధికారుల పర్యవేక్షణ కొరవడుతోంది. సిబ్బంది పేరిట ఉద్యోగ భవిష్య నిధి(ఈపీఎఫ్) చెల్లించకపోయినా అధికార యంత్రాంగం పెద్దగా పట్టించుకోవడం లేదు. నికర వేతనంతోపాటు ఈపీఎఫ్ చీటీలను పంపిణీ చేయని ఏజెన్సీలను పక్కన పెట్టాలనే నిబంధనలను విస్మరించడం విస్మయానికి గురిచేస్తోంది. రిమ్స్‌లో నాలుగు ఏజెన్సీల కింద 498 మంది సహా జూన్ 30న కలెక్టర్ రాజర్షి షా రద్దు చేసిన ఓ ఏజెన్సీ కింద మరో 421 సిబ్బంది కలిపి మొత్తం 819 మంది వేతనాల పంపిణీలో పారదర్శకత కరవైంది. స్టాఫ్ నర్సులకు రూ.24 వేలు, సాంకేతిక పారా మెడికల్ సిబ్బందికి 19,500, సెక్యూరిటీ,పారిశుద్ధ్య సిబ్బందికి రూ.15,600 చొప్పున ప్రభుత్వం నెలకు రూ.కోటిన్నర వరకు వేతనాలు చెల్లిస్తోంది. ఇందులో 13 శాతం ఈపీఎఫ్‌ను పరిగణనలోకి తీసుకుంటే రూ.19,50,000 చెల్లింపు వివరాలను ఏజెన్సీలు వ్యక్తిగతంగా వెల్లడిస్తేనే అధికారులు ప్రభుత్వం కేటాయించే నిధులను విడుదల చేయాల్సి ఉంది. కానీ సిబ్బందికి నెల నెలా వేతనాల వివరాలు వెల్లడించే చీటీలే ఇవ్వటంలేదు. ఆన్‌లైన్లో ఈపీఎఫ్ వివరాలను పొందుపర్చటం లేదు.

**పట్టుతప్పిన పర్యవేక్షణ..**

పొరుగు సేవల ఏజెన్సీలపై ఉపాధి కల్పన, కార్మిక శాఖలు సహా రిమ్స్ యాజమాన్యం పర్యవేక్షణ ఉండాలి. సిబ్బంది వేతనాలు, ఈపీఎఫ్ వివరాలపై అధికారులు సమీక్షలు నిర్వహించకపోవటం ఏజెన్సీలకు వరంగా మారుతోంది. కొంతమంది పొరుగుసేవల ఏజెన్సీల నిర్వాహకులు కలిసి ఇటీవల వారిని పర్యవేక్షించే ఓ శాఖాధికారికి భారీ నజరానా ఇచ్చినట్లు విశ్వసనీయంగా తెలియవచ్చింది. జిల్లాలో పొరుగు సేవల ఏజెన్సీల ఎంపిక కోసం ఈ ఏడాది ఏప్రిల్ 25న ఉపాధి కల్పన శాఖ టెండర్ నోటిఫికేషన్ జారీచేసింది. మే 14న టెండర్లు నిర్వహించగా పాత ఏజెన్సీలు పైరవీలు చేశాయని అప్పట్లో ప్రచారం జరిగింది. కొన్ని ఏజెన్సీల పనితీరు బాగాలేదని తెలినా మళ్లీ వారికే అవకాశం దక్కటం అనుమానాలకు తావిస్తోంది.

**సూత్రధారి ఉద్యోగే**

బినామీల పేరిట ఓ ఏజెన్సీని నిర్వహిస్తున్న ఓ ప్రభుత్వ ఉద్యోగే అక్రమాల సూత్రధారిగా తెలుస్తోంది. మే 14న జరిగిన టెండర్లలో స్థానికేతరులకు అవకాశం దక్కకుండా చక్రం తిప్పటంలో ఆయనది ప్రధాన పాత్రగా ప్రచారం జరుగుతోంది. సదరు వ్యక్తి గతంలోనూ ఇదేరకంగా అక్రమాలకు పాల్పడ్డాడు. సిబ్బందికి ఒక్క నెల ఈపీఎఫ్ చెల్లించకపోతే కనీసం రూ.10 లక్షలు మిగిల్చుకోవచ్చని, అధికారులు అడ్డుచెప్పకుండా నజరానాలు ముట్టచెబుతున్నట్టు సమాచారం.

**ఉపాధి కల్పన శాఖదే బాధ్యత**

డా.జైసింగ్, రిమ్స్ డైరెక్టర్

పొరుగు సేవల ఏజెన్సీల ఎంప్యానల్‌మెంట్ ఉపాధి కల్పన శాఖ చూసుకుంటుంది.. మా దగ్గర పనిచేసే సిబ్బందికి వ్యక్తిగతంగా ఈపీఎఫ్ చీటీలు ఇవ్వని ఏజెన్సీలపై చర్యలకు సిఫారసు చేస్తాం. వేతనాలపై కోతపడిన సిబ్బంది ఎవరైనా వచ్చి వ్యక్తిగతంగా ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

# సర్వీస్ రోడ్లకు తిలోదకాలు!



ఆదిలాబాద్ : జిల్లాలో విస్తరిస్తున్న జాతీయ రహదారి పనుల్లో పాదచారులు, గ్రామస్థుల సౌకర్యార్థం తొలుత నాలుగు చోట్ల సర్వీస్ రోడ్లు నిర్మించాలని ప్రణాళిక చేశారు.. తీరా ఏమైందో.. రహదారి విస్తరణనే కాస్త పెంచి ఆ సర్వీస్ రోడ్ల ప్రణాళిక ఉపసంహరించుకున్నారు. తద్వారా ఇరువైపులా ఎనిమిదిన్నర అడుగుల చొప్పున ఖాళీ స్థలం మిగలనుంది. ఈ ప్రతిపాదనలు ఎవరికోసం మార్చారనేది చర్చనీయాంశంగా మారింది. జిల్లాలోని జాతీయ రహదారి నం.353 (బి)ను బేల మండలం ఉపాస్‌నాల నుంచి భోరజ్ మండల కేంద్రం వరకు 33 కిలోమీటర్ల పొడవునా విస్తరిస్తున్నారు. మధ్యలో నిరాల, జైనథ్, బెల్గాం బెల్లూరీ, బేల తదితర గ్రామాలున్న నాలుగు చోట్ల తొలుత సర్వీసు రోడ్లు నిర్మించేలా ప్రణాళిక చేశారు. దారి పొడవునా రెండు వరుసల కోసం 30 అడుగులు విస్తరించేలా పనులు జరుగుతున్నాయి. ఆ నాలుగు గ్రామాల్లో ఇరువైపులా రెండు వరుసల బీటీ రోడ్డు(నాలుగు వరుసలు).. మధ్యలో డివైడర్లు, ఆ తర్వాత సర్వీస్ రోడ్డు, మురుగు కాలువల నిర్మాణం ఇలా మొత్తం 100 అడుగుల రహదారి ఉపయోగించాలని నిర్ణయించారు.

**ఇలా మార్చేశారు..**

కొత్త ప్రణాళిక ప్రకారం ఈ నాలుగు గ్రామాల్లో ఇరువైపులా 11 మీటర్ల(33 అడుగులు) చొప్పున బీటీ దారులు నిర్మిస్తారు. మధ్యలో 5 అడుగుల డివైడర్లు ఉంటాయి. ఇలా మొత్తం 66 అడుగుల రోడ్డు, 5 అడుగుల డివైడర్, ఇరువైపులా 6 అడుగుల చొప్పున మురుగు కాల్వల కోసం వదలగా.. మొత్తం 83 అడుగుల స్థలాన్ని వినియోగించనున్నారు. ఇంకా 17 అడుగుల స్థలం(ఒక్కో దిక్కు 8.5 అడుగులు) మిగలనుండటం విమర్శలు దారితీస్తోంది.

**మతలబు ఇదేనా..**వాస్తవానికి జాతీయ రహదారి వెళ్లే గ్రామాల వద్ద ప్రజల రద్దీ దృష్ట్యా ప్రమాదాలు జరగకుండా ఈ సర్వీస్‌రోడ్ల నిర్మాణం అత్యవసరం.. భారీ వాహనాల ఆటంకం లేకుండా ఈ సర్వీస్ రోడ్లపై రాకపోకలు సాగించవచ్చు. ఇక్కడ మాత్రం బేల మండల కేంద్రంలో 2 కి.మీ పొడవునా ఉన్న వ్యాపార సముదాయాల్లో కొద్దిమందికి నష్టం వస్తుందనే భావనతోనే ఈ సర్వీస్ రోడ్లను మొత్తానికే ఎత్తివేశారనే ఆరోపణలున్నాయి. ఒకచోట మార్చితే విమర్శలు వస్తాయనే ఉద్దేశంతో వ్యూహాత్మకంగా నాలుగు గ్రామాల్లోనూ డిజైన్ మార్చారనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై జాతీయ రహదారి శాఖ డీఈ సుభాష్‌తో మాట్లాడుతూ డిజైన్ మార్పు అనేది ఏమీ లేదని, సర్వీస్ రోడ్లు లేకుండా జాతీయ రహదారినే మరింత విస్తరించి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

# బండి కదలదు.. చెత్త తొలగదు!



ఆదిలాబాద్ : బల్దియాలో పని చేస్తున్న వాహనాల్లో కొన్ని 15 ఏళ్లకు పైబడటంతో తరచూ మొరాయిస్తున్నాయి. దీంతో పలు కాలనీలకు చెత్త సేకరణకు వాహనాలు వెళ్లక పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఆదిలాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య విభాగానిది కీలకపాత్ర.. ఒకరోజు చెత్త ఎత్తకపోయినా ఇంట్లో దుర్వాసన వస్తుంది. బయట పడేస్తే పరిసరాలు అపరిశుభ్రమవుతాయి. పారిశుద్ధ్య కార్మికులకు చెత్తను అందజేద్దామంటే కొన్ని కాలనీలకు చెత్త బండే వెళ్లడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి.. పారిశుద్ధ్య విభాగాన్ని వాహనాల కొరత వేధిస్తుండగా.. కాలం చెల్లిన వాహనాలు తరచూ చెడిపోతున్నాయి. పట్టణంలో చెత్త సేకరణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

బల్దియా పరిధిలో ప్రతి రోజు 72 మెట్రిక్ టన్నులకు పైగా చెత్త ఉత్పత్తి అవుతోంది. పారిశుద్ధ్య కార్మికులు మురుగు కాల్వల్లో పూడిక తీసి, రహదారులను ఊడ్చి, ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి వాహనాల్లో డంపింగ్ యార్డుకు తరలించాలి. చెత్త సేకరణకు వార్డుకు ఒక వాహనం పెట్టామని అధికారులు చెబుతున్నారు. పెద్ద వార్డుల్లో ఒకే వాహనంతో అన్ని ఇళ్లలో చెత్తను తీయడం సాధ్యపడటం లేదు. దీంతో రోజు తప్పించి మరో రోజు వాహనం పంపుతున్నారు. పట్టణం మధ్యప్రాంతంలోని వార్డులు, ప్రధాన రహదారులు, వ్యాపార, వాణిజ్య సముదాయ ప్రాంతాల్లో మాత్రం సక్రమంగా వాహనాలు నడుపుతున్నారు. శివారు కాలనీల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదు. ప్రస్తుతం పనిచేస్తున్న వాహనాల్లో కొన్ని కాలం చెల్లినవి తరచూ మొరాయిస్తున్నాయి. కాలనీలో చెత్త సేకరణకు వాహనం వెళ్లకపోయినా, ఆలస్యమైనా ప్రజలు అక్కడక్కడా రోడ్ల మీద, మూలమలుపుల వద్ద పడేసి వెళ్తున్నారు.

చెత్త సేకరణకు గతంలో 8 వాహనాలు కొనుగోలు చేయాలని అధికారులు ప్రతిపాదనలు చేశారు. అందులో ఆరు ట్రాలీలు, ఒక ట్రాక్టర్, మరో జేసీబీ కొనుగోలు చేయాలని అనుకున్నారు. బల్దియాకు కొన్ని నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు సకాలంలో విడుదల కావడం లేదు. సరిపడా వాహనాలు లేక పారిశుద్ధ్య సమస్యలు పూర్తిగా పరిష్కారం కావడం లేదు.

**కొత్తవి కొనుగోలు చేస్తాం**సీవీఎన్ రాజు, కమిషనర్, బల్దియా

బల్దియాలో చెత్త సేకరణకు పారిశుద్ధ్య వాహనాల కొరత ఉంది. నిధుల సమస్య కారణంగా కొత్తవి కొనుగోలు చేయలేకపోయాం. 15వ ఆర్థిక సంఘం అన్‌టైడ్ గ్రాంట్ కింద కొత్త వాహనాల కొనుగోలుకు చర్యలు తీసుకుంటాం.

# బాధితులకు అండ.. సైబర్ వారియర్స్

గోదావరిఖని : రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. బాధితుల్లో చాలామంది సామాన్య ప్రజలే ఉంటున్నారు. మోసపోయాక ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక చాలామంది జాప్యం చేస్తున్నారు. దీంతో పరిస్థితి చేయిదాటిపోయి డబ్బుల రికవరీపై ప్రభావం పడుతోంది. ఆన్‌లైన్‌లో నమోదు చేసే అవగాహన లేక.. టోల్ ఫ్రీ నంబరును సంప్రదించాలన్నది తెలియక.. డబ్బు పోగొట్టుకున్న బాధతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. సైబర్ నేరగాళ్ల మోసానికి బలవుతూనే ఉన్నారు. ఇలాంటి వారికి సైబర్ వారియర్స్ మేమున్నామంటూ భరోసా ఇస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 66 మంది..**

సైబర్ క్రైం పోలీసుస్టేషన్‌కు వెళ్లే సౌకర్యం అందరికి లేకపోవడంతో ప్రతి ఠాణాలో ఒక సైబర్ వారియర్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాలను దృష్టిలో పెట్టుకుని ఠాణాకు ఒకరి చొప్పున పోలీసు శాఖ నియమించింది. వీరికి సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కల్పించింది. సాంకేతికంగా శిక్షణ ఇచ్చి కేసులను చేధించే విధంగా తయారు చేసింది. ఆయా ఠాణాల పరిధిలో జరిగే సైబర్ మోసాలకు బలైన బాధితులకు న్యాయం చేసేందుకు సైబర్ వారియర్స్ పనిచేస్తున్నారు. మోసపోయిన డబ్బులు ఫ్రీజ్ చేయడంతో పాటు కేసుకు సంబంధించిన కోర్టు ఆదేశాలు.. బ్యాంకు అధికారులతో సంప్రదింపులు




చేస్తూ బాధితులకు న్యాయం చేసేందుకు నిరంతరం పనిచేస్తున్నారు. వీరికి 24 గంటలు సేవలందించేందుకు ప్రత్యేకంగా సిమ్‌కార్డులను కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో 66 మంది సైబర్ వారియర్స్ సేవలందిస్తున్నారు.

**విధులు** బాధితులు మోసపోయిన గంటలోపు సంప్రదిస్తే కోల్పోయిన డబ్బులు ఫ్రీజ్ చేయిస్తారుసైబర్ క్రైం టోల్ ఫ్రీ నంబరు 1930 సేవలు, ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడంపై అవగాహన కల్పిస్తారు

సైబర్ క్రైం పోర్టల్‌లో బాధితులతో ఫిర్యాదులు అప్‌లోడ్ చేయిస్తారు రూ.25 వేలకు మించి మోసపోతే ఎఫ్ఐఆర్ చేసి విచారణ చేపడతారు రూ.7 లక్షల లోపు మోసానికి గురైతే ఠాణా పరిధిలోనే విచారణ చేస్తారు ఫ్రీజ్ చేయించిన డబ్బులను తిరిగి బాధితులకు ఇప్పించే వరకు చర్యలు తీసుకుంటారు చిత్రంలో రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న సైబర్ వారియర్ సాయి వెంకటకృష్ణ గోదావరిఖని ఒకటో పట్టణ ఠాణా పరిధిలో పనిచేస్తున్నారు. సాయి వెంకటకృష్ణ బాధితులు మోసపోయిన రూ.5 లక్షల రిఫండ్‌కు కోర్టు నుంచి ఆర్డర్ ఇప్పించడంలో ప్రత్యేక దృష్టి సారించారు. ఆర్డర్ ద్వారా సంబంధిత బ్యాంకుల నుంచి బాధితులకు తిరిగి చెల్లించేందుకు కృషి చేశారు. దీంతో సీపీ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు.

# బడిలో క్లబ్‌లు.. సృజనకు మెరుగులు..!

కల్లూరు: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా విద్యార్థులతో క్లబ్‌లు ఏర్పాటు చేసి వాటి ద్వారా వివిధ అంశాల్లో బాలలకు అవగాహనను పెంపొందిస్తున్నారు. జిల్లాలో 332 ఉన్నత పాఠశాలలు, 230 ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎకో, ప్రహరీ సేఫ్టీ క్లబ్‌లు ఏర్పాటయ్యాయి. అలాగే 24 పీఎంశ్రీ పాఠశాలల్లో ఎకో క్లబ్‌లతో పాటు డిజిటల్ లెర్నింగ్ అండ్ స్టెమ్, గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ అండ్ సేఫ్టీ, సాహిత్య, సాంస్కృతిక, క్రీడలు, ఆరోగ్యం తదితర క్లబ్‌లు ఏర్పాటయ్యాయిఈ క్లబ్‌ల ఏర్పాటు.. వాటి ఉపయోగాలను పరిశీలిస్తే..

**ఎకో క్లబ్**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కల పెంపకం. ప్రతి విద్యార్థి తమ తల్లితో కలిసి ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలి. అలాగే వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువు తయారీ, ఇంకుడు గుంతలు ఏర్పాటుతో వర్షపు నీటిని ఇంకేలా చేయడంపై అవగాహన పెంపొందిస్తారు. పిల్లలు వివిధ రూపాలలో వాడిన నీటిని మొక్కలకు అందిస్తారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతోపాటు.. పాఠశాలలో భద్రత, పరిశుభ్రత పాటించడం నేర్పిస్తారు.

**డిజిటల్ లెర్నింగ్..**

పాఠశాలలోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఐఎఫ్‌బీ ప్యానెల్స్ ద్వారా విద్యాబోధన కొన్ని చోట్ల సాగుతోంది. దీనికి అనుగుణంగా అభ్యసన, డిజిటల్ తరగతులతో విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవడం, త్వరగా నేర్చుకోవడం, జ్ఞాపకం ఉంచుకోవడం తదితర



అంశాలపై ఈ క్లబ్ పనిచేస్తుంది.

**సాహిత్య, కళ క్లబ్..**

పిల్లలకు నచ్చే అంశాలతో పాటు.. ఎంబ్రాయిడరీ, కుట్లు, అల్లికలు నేర్పుతారు. నైపుణ్యాభివృద్ధి, పండగలకు, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు రాఖీలు, గణపతుల మట్టి విగ్రహాల తయారీ, కళా నైపుణ్యాలు పెంపొందించడం వంటి కృత్యాల సాధన చేయిస్తారు. అలాగే సాహిత్యం, కళలు, సాంస్కృతిక అంశాల్లోనూ ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి వారి నైపుణ్యానికి మెరుగులద్దుతారు.

**గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్, సేఫ్టీ..**

బాలికల విద్య ప్రాధాన్యం, లింగ సమానత్వంపై అవగాహన, ప్రధానోపాధ్యాయురాలితో సమస్యలపై చర్చ, యవ్వన దశ ఆరోగ్యంపై బాలబాలికలకు అవగాహన, పోషకాహారంతో మనిషి జీవన ప్రమాణాల మెరుగుదల.. విటమిన్లు, మినరల్స్ ప్రోటీన్లు లభించే కూరగాయలు, పండ్లు, తినడం వల్ల ప్రయోజనాలను వివరిస్తారు. స్వీయ రక్షణకు కరాటే, తైక్వాండోలో ప్రాథమిక శిక్షణ.

**క్రీడా, సాంస్కృతిక క్లబ్‌లు**

క్రీడల్లో ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహించడం, నాయకత్వ లక్షణాలు పెంచడంతోపాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇస్తారు.

## పాలిథిన్ ముట్టమని ప్రమాణం..15 ఏళ్ల ప్రయాణం

బొబ్బిలి : బొబ్బిలి పట్టణం జిల్లాలోని మిగతా పురపాలికలకు ఆదర్శంగా నిలుస్తోంది. శతశాతం ప్లాస్టిక్ నిషేధం.. తడి చెత్తతో ఎరువు తయారీ.. వ్యర్థాలతో బయో గ్యాస్ ఉత్పత్తి.. పొడి చెత్తలో పనికొచ్చే వ్యర్థాలు వేరుచేసి విక్రయించడం తదితర కార్యక్రమాలతో ఉత్తమ పురపాలికగా పేరొందుతోంది. పట్టణాలు, గ్రామాల్లోకి అడుగుపెట్టగానే ప్లాస్టిక్ గ్లాసులు, సంచులు గుట్టలుగా కనిపిస్తాయి. ఖాళీ ప్రదేశాలన్నీ వాటితోనే నిండి ఉంటాయి. బొబ్బిలిలో 15 ఏళ్లుగా 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉండే పాలిథిన్‌ను నిషేధించారు. ఎక్కడ చూసినా కాగితం, జనపనార, వస్త్రాలతో తయారు చేసిన సంచులే కనిపిస్తాయి. తాగునీటి ప్యాకెట్లను కూడా నిషేధించారు. కల్యాణ మండపాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో ట్యాంకర్లతో పురపాలిక తాగునీటిని అందిస్తుంది. ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంతో శతశాతం అమలవుతోంది. లార్వా కంపోస్టు విధానంలో వ్యర్థాల నుంచి 15 రోజుల్లోనే ఎరువును తయారు చేస్తున్నారు.



ట్యాంకుల అడుగున కొంత ఇసుక, మెటల్ వేసి రోజుకు 40 కిలోలు తడి చెత్త వేస్తారు. వీటిపై పురుగులుగా మారే గుడ్లు 10 గ్రాములు పిచికారీ చేస్తున్నారు. ఇవి తడిచెత్తను ఆహారంగా తీసుకుంటున్నాయి. అవి విసర్జించిన వ్యర్థాలు ఎరువుగా మారుతున్నాయి. ప్రస్తుతం 30 ట్యాంకులు అమర్చారు. వీటి నుంచి వచ్చే నల్లటిరసం పంటలకు ఎరువుగా వాడుకోవచ్చు. దీనికోసం ట్యాంకు దిగువన ట్యాపులు ఏర్పాటు చేశారు. గుడ్లతో తయారయ్యే పురుగులు బయటకు వచ్చేందుకు పైన పైపు ఏర్పాటు చేశారు. వాటిని కోళ్ల మేతగా ఉపయోగిస్తారు. పుర కార్యాలయం పైన సోలార్ పలకలు అమర్చారు. దీనివల్ల నెలకు రూ.50 వేలు విద్యుత్తు బిల్లు ఆదా అవుతోంది.

## అలుగు పారితే అడుగు పడదు

ఆత్మకూరు: నల్లమల అటవీ ప్రాంతంలో కర్నూలు–గుంటూరు ఎన్‌హెచ్–340సీపై ప్రయాణానికి సిద్ధాపురం చెరువు తరచూ ఆటంకం కలిగిస్తోంది. భారీ వర్షాలతో అలుగు ఉప్పొంగితే రాకపోకలు ఆగిపోతున్నాయి. లోలెవెల్ వంతెన నిర్మిస్తే రాకపోకలకు ఇబ్బందులు ఉండవు.

**దూరాభారమే** ఆత్మకూరు–దోర్నాల మధ్య 60 కి.మీ.దూరాన్ని 2 గంటల్లో చేరుకోవచ్చు.వాహనాలను నంద్యాల వైపు మళ్లిస్తే.. నంద్యాల–గిద్దలూరు మీదుగా దోర్నాలకు 190 కి.మీ. మేర ప్రయాణించాల్సి ఉంటుంది. కర్ణాటక నుంచి కోల్‌కతాకు లారీల్లో సరకును సమయానికి చేర్చితే డ్రైవర్‌కు రూ.5–10 వేలు ఎక్కువ ఇస్తారు. ఆలస్యమైతే డ్రైవర్ బత్తాలో కొంత కోత విధిస్తారు.

**అటవీ మార్గంలో అనుమతుల్లేవ్**



కర్నూలు–గుంటూరు ఎన్‌హెచ్ విస్తరణకు గతంలో సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారు. 2016 నుంచి 2018 వరకు సర్వేలు జరిగాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదు. ప్రస్తుతం వెంకటాపురం వరకు మాత్రమే విస్తరణ పనులు జరుగుతున్నాయి. అటవీ మార్గంలో 38.8 కి.మీ. మేర విస్తరణకు సంబంధించి అనుమతుల్లేవు. ఇటీవల శ్రీశైలం పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అనుమతులు సాధిస్తామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఆలస్యమైతే బత్తాలో కోత: మహబూబ్‌బాషా, లారీ డ్రైవర్, ఆత్మకూరు కర్ణాటక నుంచి కోల్‌కతాకు క్యాబేజీ లోడును 48 గంటలు, ఇతర లోడును 50 గంటల్లో చేర్చాల్సి ఉంటుంది. సమయానికి చేర్చితే అదనపు నగదు ఇస్తారు. ఆలస్యమైతే మా బత్తాలో కోత విధిస్తారు.

## గోవులకే జీతం.. జీవితం

నాయుడుపేట: ఆయనో ప్రభుత్వ చిరుద్యోగి. తిరుమల కొండపై ప్రొటోకాల్ వీఆర్వో. నెలకు వేతనం రూ.57 వేలు. ఈ మొత్తం గోశాలకే కేటాయిస్తున్నారు. ఈయన భార్య నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టులో ప్రాసెస్ సర్వరు. ఈమె నెల జీతాన్ని



కుటుంబ పోషణకు ఖర్చు చేస్తున్నారు. వీరి కుమార్తెలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీబీఏ, బీసీఏ తృతీయ ఏడాది చదువుతున్నారు.

నాయుడుపేట మండలం పుదూరుకు చెందిన అల్లాడి శేషగిరి దంపతులు పదేళ్లుగా గోశాల నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యులు ఉదయం, సాయంత్రం గోశాలలోని పనుల అనంతరం వారి పనుల్లో నిమగ్నమవుతారు. గోశాల్లోని లేగ దూడలకు దంపతుల కుమార్తెలు సాయి పావని, చంద్రికా మహారాణిలు నామకరణం చేస్తారు.

దూడలే పాలు తాగేలా..

దూడలకు ప్రత్యేక గదుల్లో పంకాలు ఏర్పాటు చేసి సంరక్షిస్తున్నారు. ఆవుల పాలను దూడలే తాగేలా చూస్తారు. దాతల సాయంతో వసతులు కల్పిస్తున్నారు. కార్తిక మాసంలో వన భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు.

గోశాల పేరు: మాతా అల్లాడి ట్రస్టు

విస్తీర్ణం: 2.5 ఎకరాలకు పైగా.

గోవులు: 85

# సేవలందే మార్గమిదే




డోన్ : ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా రెండు జాతీయ రహదారులు వెళ్తున్నాయి. ఎన్‌హెచ్–40 పరిధిలో చాగలమర్రి, నంద్యాల, నన్నూరు శివారు, ఎన్‌హెచ్ 44 పరిధిలో అమకతాడు వద్ద టోల్‌ప్లాజాలున్నాయి. ఆయా మార్గాల్లో ప్రతిరోజూ 30 వేలకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. టోల్ చెల్లిస్తున్న నేపథ్యంలో వాహనదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. అత్యవసర సేవలు సైతం పొందొచ్చు. ఏదేని ఇబ్బందులు కలిగితే ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు.

**1033తో సత్వర సాయం**

జాతీయ రహదారులపై వాహనం ఆగిపోయినా.. పెట్రోల్, డీజిల్ అయిపోయినా 1033 నంబరుకు ఫోన్ చేస్తే చాలు.. తక్షణ సాయం అందుతుంది.

**బటన్ నొక్కితే చాలు..**

జాతీయ రహదారిపై ప్రతి కి.మీ. నుంచి 2 కి.మీ. మధ్యలో రోడ్డు పక్కన స్తంభాలకు ఎస్‌వోఎస్ పెట్టెలుంటాయి. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు లేదా ఇతర అత్యవసర సమయాల్లో తక్షణ సాయం కావాలంటే ఈ పెట్టెపై ఉన్న బటన్ నొక్కి మనం ఉండే ప్రదేశం చెబితే వెంటనే టోల్ సిబ్బంది అక్కడికి చేరుకుని అవసరమైన సాయం అందిస్తారు.

**చిత్రం తీయ్.. రివార్డు అందుకో**

రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని టోల్‌ప్లాజాల వద్ద మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్న చిత్రం తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.ఫొటోతోపాటు పంపినవారి పేరు, వాహనం, రిజిస్ట్రేషన్ నంబరు, లొకేషన్ తదితర వివరాలు నమోదు చేయాలి.

రోజూ వచ్చిన చిత్రాల్లో అర్హత ఉన్న వాటిని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఎంపిక చేస్తారు.

ఫిర్యాదుదారుడి వాహన రిజిస్ట్రేషన్ నంబరుకు అనుసంధానమైన ఫాస్టాగ్‌కు రూ.1,000 రీఛార్జి రూపంలో రివార్డు అందిస్తారు.

## రూ. లక్షలు పక్కదారి.. చేతలు నీరుగారి !




ఒంగోలు: గత ప్రభుత్వ హయాంలో సింగరాయకొండ పంచాయతీ సాధారణ నిధులు రూ13,91,071బీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.32,77,732 కలిపి మొత్తం రూ.46,68,803 దుర్వినియోగమయ్యాయి. స్థానికులు ఫిర్యాదుతో డీఎల్‌పీవో విచారణ అనంతరం... బాధ్యులైన గ్రామ కార్యదర్శి, జూనియర్ సహాయకురాలు, కంప్యూటర్ ఆపరేటర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు. అంతకు ముందు ఇదే పంచాయతీలో రూ.30 లక్షలకుపైగా అవకతవకలకు పాల్పడిన కార్యదర్శిని సస్పెన్షన్ చేశారు. తరువాత వీరందరినీ విధుల్లోకి తీసుకున్నా... దారిమళ్లిన నిధులను మాత్రం నేటికీ రికవరీ చేయలేదు. 2021–24 మధ్య జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగమయ్యాయి. స్థానికుల ఫిర్యాదులతో విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు రూ.లక్షల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఎవరికి అందిన మొత్తం వారు జేబులో వేసుకున్నట్లు తేల్చారు. నేటికీ పల్లె ఖాతాల్లోని మొత్తం పక్కదారి పడుతున్న ఘటనలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. జమా ఖర్చులకు సంబంధించిన దస్త్రాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం... ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం.

**కానరాని దస్త్రాల నిర్వహణ...**

జిల్లాలో 729 గ్రామ పంచాయతీలున్నాయి. ఆర్థిక సంఘం, సాధారణ నిధులే వీటికి ప్రధాన ఆదాయ వనరు. వీటిని ప్రాధాన్యతా పనులకు మాత్రమే ఖర్చు చేయాలి. అయినప్పటికీ ఇష్టానుసారం డ్రా చేస్తున్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామాల్లో కనీసం 36 దస్త్రాలు నిర్వహించాల్సి ఉన్నా... అయిదు దస్త్రాలైనా నిర్వహిస్తున్న దాఖలాలు లేవు. దీంతో చాలా పంచాయతీల్లో నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా చేస్తున్నారు. ఫిర్యాదులొస్తే వెలుగులోకి వస్తున్నాయి. లేదంటే మరుగున పడిపోతున్నాయి. ఆడిట్ అభ్యంతరాలు సైతం పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉండడం సమస్య తీవ్రతకు దర్పణం పడుతోంది. విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా... నిధుల దుర్వినియోగంపై విచారణ జరుగుతోందని, త్వరలోనే బాధ్యులపై చర్యలు ఉంటాయని తెలిపారు.

నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరులో రూ.42.70 లక్షలు దుర్వినియోగమయ్యాయి. రాజంపల్లె (దర్శి)లో రూ.29.47 లక్షలుబీ కురిచేడు మండలం పశ్చిమ వీరాయపాలెంలో రూ.13.09 లక్షలుబీ బయ్యవరంలో రూ.10.75 లక్షలుబీ కొండపి మండలం పెద కండ్లగుంటలో రూ.31.45 లక్షల మేర నిధులు దారిమళ్లాయి. బాధ్యులైన గ్రామ కార్యదర్శులపై నివేదికలు సిద్ధం చేసినా ఇంతవరకు చర్యలు లేవు.

ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, డీఎల్‌పీవోలు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పంచాయతీల దస్త్రాలను తనిఖీ చేయాలి. ఆయా గ్రామాలను సందర్శించేందుకు ఎంపీడీవోలకు కారు అద్దె కింద నెలకు రూ.35 వేలు చొప్పున ఇస్తున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత పేరిట ఇతర కార్యక్రమాలకు వెళ్తున్నా... దస్త్రాల తనిఖీని మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే కొందరు కార్యదర్శులకు అలుసుగా మారుతోంది.

## చిన్నారుల బడి.. నైపుణ్యాల జడి



డోన్ : పిల్లల్లో విద్యా నైపుణ్యాలు, సామాజిక, భావోద్వేగ, అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ 'జాదూయి పిటారా(మాయా పెట్టె)' కిట్ల కార్యక్రమాన్ని ప్రారంభించింది. పిల్లలు సరదాగా అభ్యసించేందుకు, ప్రోత్సహించేందుకు రూపొందించిన ఒక ఆట ఆధారిత అభ్యాస సామగ్రి ఇది. ఈ పెట్టెలో 62 రకాల వస్తువులు ఉంటాయి. ఎన్‌సీఈఆర్టీ, రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అందిస్తోంది.

**విద్యావిధానం అనుసరించి..**

ప్రాథమిక దశలోని పిల్లలకు ఆటల ద్వారా అభ్యసనను అందించడం కార్యక్రమ లక్ష్యం. పజిల్స్, పలు రకాల ఆట వస్తువులు, తోలుబొమ్మలు, పోస్టర్లు, ఫ్లాష్ కార్డులు, కథల పుస్తకాలు, వర్క్ షీట్లు, ప్లేబుక్ తదితరాలు ఉంటాయి. కొత్త జాతీయ విద్యావిధానం ప్రకారం అభ్యాస సామగ్రిని రూపొందించారు.

**ప్రాథమిక పాఠశాలలకు మంజూరు**

కర్నూలు జిల్లాలో వెయ్యికి పైగా ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 928 ప్రాథమిక పాఠశాలలు ఉండగా.. అందులో బాలురు 19,698 మంది, బాలికలు 22,670 మంది కాగా మొత్తం మీద 42,368 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఎక్కువ హాజరున్న ప్రాథమిక పాఠశాలలకు విద్యా సాధనాలను అందించింది. నంద్యాల జిల్లాలో 575 ప్రాథమిక పాఠశాలలకు రూ.54.50 లక్షల విలువ చేసే కిట్లు వచ్చినట్లు విద్యాధికారులు పేర్కొన్నారు. వాటిని 29 మండలాల్లోని ప్రాథమిక పాఠశాలలకు ఇటీవల డీఈవో జనార్దన్‌రెడ్డి అందజేశారు.

**ప్రయోజనం ఇలా..**

ఇది పిల్లల్లో జ్ఞాపకశక్తి, భాషాభివృద్ధి, సంఖ్యా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ఉపకరిస్తుంది. అభ్యాస, బోధనా వాతావరణాన్ని సుసంపన్నం చేసేందుకు, విద్యార్థి కేంద్రీకృత, ఆనందదాయకంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసింది. పిల్లల ఆసక్తికర అభ్యాసానికి అనుగుణంగా ఉండేలా బొమ్మలు, పజిల్స్ ఉపయోగపడతాయి. కథలు చెప్పడం ద్వారా పిల్లల ఊహాశక్తిని, భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు తోలుబొమ్మలు, కథల పుస్తకాలు దోహదం చేస్తాయి. ఫ్లాష్‌కార్డులు గుర్తింపునకు, నామకరణం వంటి ప్రాథమిక భావనలను నేర్పించడంలో సాయపడతాయి. పోస్టర్లు, వర్క్‌షీట్లు వివిధ అభ్యాస కార్యకలాపాలకు ఉపయోగపడతాయి.

## మత్తు వదిలేదెలా?

విశాఖపట్నం: విద్యార్థులు, యువత, మధ్య వయస్కులనే తేడా లేకుండా చాలా మంది మద్యం, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు బానిసవుతున్నారు. వాటి బారిన పడి జీవితాలు సర్వనాశనం చేసుకుంటున్నారు. దీంతో కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. అలాంటి వారికి చికిత్స అందించేందుకు కింగ్ జార్జి ఆసుపత్రి (కేజీహెచ్)లో 2020లో వ్యసన విముక్తి కేంద్రం ఏర్పాటుచేశారు. ఓపీతోపాటు ఐపీ సేవలూ అందించాలని నిర్ణయించారు. కానీ, తగినంత సిబ్బంది లేకపోవడం, అక్కడ పనిచేస్తున్న వారికి సమయానికి జీతాలు రాకపోవడంతో సేవలు సక్రమంగా అందడం లేదు.

మత్తుపదార్థాలకు బానిసైన వారికి డి–అడిక్షన్ కేంద్రంలో ఉచితంగా చికిత్స అందిస్తున్నారు. బాధితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి కృషి చేస్తున్నారు.ఆ కేంద్రంలో వైద్యులు, సిబ్బంది బాధితులకు వ్యక్తిగత, ఫ్యామిలీ, బృంద కౌన్సెలింగ్ చేపడుతున్నారు.

శ్రీకాకుళం, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం మన్యం, పాడేరు తదితర ప్రాంతాల నుంచి రోజుకు కనీసం 15 మంది రోగులు ఇక్కడికి వస్తున్నారు. వారిలో 20 నుంచి 40 ఏళ్ల వయసు వారే ఎక్కువ.

ఇక్కడ ఐపీ సదుపాయం లేదు. దీంతో వైద్యుల పర్యవేక్షణ అవసరమైన బాధితులను ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలోని వ్యసన విముక్తి వార్డుకు పంపిస్తున్నారు.



ఇక్కడ ఉచితంగా మెరుగైన చికిత్స అందుతుండటంతో క్రమంగా కేంద్రానికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. సరిపడా సిబ్బంది లేకపోవడంతో అందరికీ సేవలందించలేని పరిస్థితి. దీంతో చాలా మంది ప్రైవేటు కేంద్రాలకు వెళ్తున్నారు. అక్కడ చికిత్సకు రూ.20 వేల నుంచి రూ.లక్షల్లో ఖర్చవుతుంది.

**విజ్ఞప్తి చేస్తే కొంత...**

ఈ కేంద్రంలో ఉద్యోగులు కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్నారు. మొత్తం తొమ్మిది పోస్టులు మంజూరు కాగా.. ప్రస్తుతం ఆరుగురు పనిచేస్తున్నారు. ఒకరు ప్రసూతి సెలవులో ఉన్నారు. అయిదు నెలలుగా అక్కడి ఉద్యోగులకు జీతాలు రావట్లేదు. గతేడాది ఏడాదిన్నర జీతం రాకపోవడంతో ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. దీంతో మొత్తం విడుదల చేశారు. తర్వాత ఈ ఏడాది జూన్ నుంచి మళ్లీ అదే పరిస్థితి. ఇప్పటివరకు జీతాలు రాలేదని, ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

## కాసులు ఇచ్చుకో.. దుకాణం పెట్టుకో!

ఆనందపురం : ఆనందపురం పూల మార్కెట్ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ మార్కెట్‌ను విస్తరించాలని ఎప్పటి నుంచో ప్రతిపాదనలు ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో కొంతమంది చోటా నాయకులు వసూళ్లకు పాల్పడుతున్నారు. అక్కడ దుకాణం పెట్టుకోవడానికి స్థలానికో ధర నిర్ణయించి వారి జేబులు నింపుకొంటున్నారు.

ఉత్తరాంధ్రలోనే అతిపెద్దదిగా ఆనందపురం పూల మార్కెట్ పేరుగాంచింది. ఇక్కడ బాగా గిరాకీ ఉండటంతో లాభాలు వస్తాయని రైతులు, వ్యాపారులు భావిస్తుంటారు. దీంతో జీవనోపాధి కోసం ఎలాగైనా అక్కడ దుకాణం పెట్టుకోవాలని పలువురు ఆసక్తి చూపుతు న్నారు. ఇదే అదనుగా భావించిన స్థానిక నాయకులు వసూళ్ల దందా కొనసాగిస్తున్నారు.

వెంటాడుతున్న ట్రాఫిక్ సమస్య: విచ్చలవిడిగా రోడ్డుపై, కూడలిలో దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతో ఆనందపురం కూడలి వద్ద విపరీతమైన ట్రాఫిక్ ఏర్పడుతోంది. జాతీయ రహదారి కావడంతో నగరం నుంచి విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశాలకు ఇదే మార్గం గుండా అధిక సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ట్రాఫిక్ నిర్వహణ యంత్రాంగం అభ్యంతరం చెబుతున్నా స్థానిక నాయకులు తీరు మార్చుకోవడం లేదు. తరచూ ట్రాఫిక్ సమస్య తప్పటం లేదు.



రోడ్డుపై, కూడలిలో అక్రమంగా దుకాణాలను ఏర్పాటు చేయకుండా నియంత్రించాల్సిన అవసరాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు. అలాగే మార్కెట్‌ను విస్తరించి సరైన సదుపాయాలు కల్పిస్తే అన్నింటికీ పరిష్కార మార్గం లభిస్తుందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆ దిశగా అడుగులు వేయాలని కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..: కూడలి పరిసర ప్రాంతాల్లో స్థలానికో ధర నిర్ణయించారు. పాత వంతెన కింద ఒక రేటు, కొత్త వంతెన కింద మరో రేటు, పాత పంచాయతీ భవనం వద్ద, ఎన్టీఆర్ విగ్రహం వద్ద మరో ధర ఉంటోంది. బీఎస్‌ఎన్‌ఎల్‌కు కేటాయించిన స్థలం ముందు, తగరపువలస సర్వీస్‌రోడ్డులో, బంటుబిల్లి వారి కళ్లాలకు వెళ్లే చోట, వ్యవసాయ మార్కెట్, చేపల మార్కెట్ వద్ద కూడా వేర్వేరు చెల్లింపులు చేయాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాపారులు రూ.లక్షల్లో చెల్లించుకోవాల్సి వస్తోంది. ఈ మామూళ్లతో పాటు నెలనెలా అద్దెలు చెల్లించుకోవాల్సి ఉండటంతో ఆర్థిక భారం తప్పడం లేదని చిన్నచిన్న వ్యాపారస్థులు వాపోతున్నారు.

కొందరు నేతల అనుమతి ఉంటే కొంత తగ్గిస్తున్నారని, లేకుంటే వారు డిమాండు చేసినంత ఇచ్చుకోవాల్సిందేనని వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు చెబుతున్నారు.

# మఠం ఆస్తుల కబ్జా

గుత్తి: గుత్తి పట్టణంలో రూ.కోట్లు విలువైన మఠం ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయి. ప్రధానంగా గుత్తి నడిబొడ్డున ఉన్న సర్వేనంబరు 377లోని 4.37 ఎకరాల పుష్పగిరి శంకరాచార్యుల మఠం స్థలాన్ని కొందరు కబ్జా చేశారు. సదరు స్థలంలో గుడిసెలు, నివాస గృహాలు వెలిశాయి. ఇక్కడ సెంటు రూ.10 లక్షలు పలుకుతోంది.

**గుడిసెలు వేసి..**సర్వేనంబరు 569లో 8.80 ఎకరాలు కొనకొండ్ల విరక్తి మఠానికి చెందిన భూమిపై కొందరు కన్నువేశారు. నాలుగు నెలల కిందట స్థలాన్ని ఆక్రమించారు. ఓ పార్టీ నాయకుల సహకారంతో స్థానికులు గుడిసెలు వేసుకున్నారు. వారికి పట్టాలు ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేస్తున్నారు. పట్టణంలో సొంత ఇళు ఉన్నవారు, లేని వారు ఆక్రమించారు. పట్టణంలోని రెండు చోట్ల స్థలం అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తున్నా అతీగతీ లేకుండా పోతోంది.



**పట్టాలు జారీ**మఠం స్థలాలకు రెవెన్యూ అధికారులు ఇళ్లపట్టాలు మంజూరు చేస్తున్నారు. దస్త్రాలు పరిశీలించకుండానే ఇచ్చేస్తున్నారు. దీంతో మఠం స్థలాలపై హక్కులు సాధించారు. తర్వాత అనేక మంది ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయించారు. సర్వేనంబరు 327లోని 4.37 ఎకరాల విస్తీర్ణంలోని స్థలం కబ్జాకు గురైంది. ఆలస్యంగా గుర్తించిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు రిజిస్ట్రేషన్లు చేయడం లేదు. రెవెన్యూ అధికారులు మాత్రం ఏడాది కిందట వరకు పట్టాలలో పేర్లమార్పిడి చేశారు. తాజాగా పట్టణ శివారులోని భూమి ఆక్రమణలకు గురైంది.

**సమాచారం ఇచ్చాం..**

–నాగేంద్రుడు, ఈవో, గ్రూప్ టెంపుల్స్, గుత్తి

మఠం ఆస్తుల అన్యాక్రాంతంపై తాము నిర్వాహకులకు సమాచారం ఇచ్చాం. పోలీసుల సాయంతో మఠం ఆస్తులను స్వాధీనం చేసుకోవచ్చు. శంకరాచార్యుల మఠం ఆస్తుల అన్యాక్రాంతంపై పోలీసులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కడపలోని మఠం అధికారులకు ఫిర్యాదు చేశాం.

# కళ్లు మూసుకుంటాం.. తవ్వుకోండి!

రాయదుర్గం : పట్టణ శివారులోని బొందనకల్లు అటవీ ప్రాంతంలో అడ్డగోలుగా మట్టిని తవ్వి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణానికి ఆనుకుని కుంటి మారెమ్మ ఆలయం ఎదురుగా.. రైల్వే ట్రాక్ పక్కన రెండువైపులా పది అడుగుల మేర మట్టిని తవ్వి తరలించారు. తవ్విన ఆనవాళ్లు లేకుండా ముళ్లకంపలు అడ్డు వేశారు. మరొక ప్రాంతంలో పది అడుగుల మేర తవ్వకాలు చేశారు. టిప్పర్ మట్టి తరలించాలన్నా అనుమతి తీసుకుని.. రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**ఎత్తుగా ఉండటంతో..**రైల్వే ట్రాక్ సుమారు ఇరవై అడుగుల మేర ఎత్తు ఉండటంతో అక్రమార్కులకు కలిసివస్తోంది. అటవీ ప్రాంతంలో మొక్కలు నాటిన చోట పొక్లెయిన్‌తో మట్టిని తవ్వి తరలించినట్లు ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

పట్టణ శివారులో రైల్వే ట్రాక్ బలోపేతానికి పనులు జరుగుతున్నాయి. గుత్తేదారు అనుమతులు తీసుకుని మట్టిని తరలించాల్సి ఉన్నా నిబంధనలు పట్టించుకోకుండా రాత్రి వేళ తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు.

**కేసులు నమోదు చేస్తాం** –దామోదర్‌రెడ్డి, డీఆర్వో, రాయదుర్గం


క్షేత్రస్థాయిలో పరిశీలించి మట్టిని తరలించిన వారిపై కేసులు నమోదు చేస్తాం. అవసరమైతే ఉన్నతాధికారుల అనుమతితో ఆ ప్రాంతానికి కంచె ఏర్పాటు చేసి తవ్వకాలు జరపకుండా చర్యలు తీసుకుంటాం.

# దారి మళ్లిన రూ.6 లక్షలు

శింగనమల : శింగనమల మండలంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో అవినీతి తాజాగా వెలుగులోకి వచ్చింది. రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో మహిళా రైతులకు వచ్చే ఎఫ్‌ఈవో నిధులను దారి మళ్లించి వెలుగు ఉద్యోగి బ్యాంకు ఖాతాకు బదిలీ చేశారు. ఆమె మరణించడంతో డబ్బు ఉపసంహారణకు ముప్పుతిప్పలు పడుతుండటంతో విషయం వెలుగులోకి వచ్చింది.

**అసలు ఏం జరిగిందంటే?**

శింగనమల మండలంలో డ్వాక్రా సంఘాలకు అనుబంధంగా రైతుఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేశారు. రైతులకు పంటల సాగుకు రుణాలు అందించి, వ్యవసాయ అభ్యున్నతికి సహాయ పడటం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. రైతులకు ఎఫ్‌ఈవో నిధులను రుణాలుగా ఇచ్చి నెల వాయిదాల్లో తక్కువ వడ్డీ వసూలు చేస్తారు. అయితే వెలుగు కార్యాలయంలో పని చేసే మహిళా ఉద్యోగి బ్యాంకు ఖాతాలోకి కొద్ది నెలల క్రితం ఎఫ్‌ఈవో నిధులను మూడు సార్లు రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.6 లక్షలు బదిలీ చేశారు. సాధారణంగా సంఘాలకు రుణాలు ఇవ్వాలంటే గ్రామ సంఘాల లీడర్లు, యానిమేటర్, సీసీ, ఏపీఎం సంతకాలను మినిట్స్ బుక్‌లో నమోదు చేసిన తర్వాతే రుణాలను బదిలీ చేస్తారు. అయితే రూ.6 లక్షల బదిలీ విషయంలో ఈ నిబంధన లేవీ పాటించలేదని తెలుస్తోంది.



**ఖాళీ చెక్కులపై సంతకాలు**

రైతు ఉత్పత్తిదారుల సంఘాల లీడర్లతో ఖాళీ చెక్కులపై సంతకాలు తీసుకుని నేరుగా నాలుగు నెలల కిందట మూడు దఫాలుగా వెలుగు ఉద్యోగి ఖాతాలకు బదిలీ చేశారు. ఈ నిధుల బదిలీ విషయంలో శింగనమల వెలుగు అధికారులు, కెనరాబ్యాంకు అధికారుల పాత్ర ఉందని స్పష్టమవుతోంది. నగదు బదిలీ చేసిన తర్వాత ఇటీవల వెలుగు ఉద్యోగి అనారోగ్యంతో మరణించడంతో బదిలీ చేసిన డబ్బులు పంచుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో అవినీతి విషయం వెలుగులోకి వచ్చింది.

**ఏపీఎం ఏమన్నారంటే?**

ఏపీఎం ఈశ్వరయ్య శింగనమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన స్పందిస్తూ రూ.6 లక్షలు మరణించిన ఉద్యోగి ఖాతాలో జమా అయిన విషయం వాస్తవమేనని అంగీకరించారు. నా సంతకాలు లేకుండానే రూ.6 లక్షలు బదిలీ అయ్యాయని, ఇప్పటికీ మరణించిన ఉద్యోగి ఖాతాలోనే డబ్బులు ఉన్నాయని గుర్తించామన్నారు.

# పేరుకు పూర్తి.. తీరని దాహార్తి



కందుకూరు : వలేటివారిపాలెంలో జల్‌జీవన్ మిషన్(జేజేఎం) నిధులు సుమారు రూ. 60 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకు, పైప్‌లైన్ల నిర్మాణానికి టెండరు పిలిచారు. దాన్ని దక్కించుకున్న గుత్తేదారు.. ట్యాంకు నిర్మాణం పూర్తి చేశారు. నాటి వైకాపా ప్రభుత్వం దాదాపు రెండేళ్లపాటు బిల్లులు చెల్లించకపోవడంతో పనులను అర్ధాంతరంగా ఆపేశారు. దాంతో ఎప్పటిలాగే ఆర్.ఆర్. పథకం ద్వారా వచ్చే నీరే దిక్కయింది. ఇటీవల ఈ పథకం మరమ్మతుల నేపథ్యంలో 20 రోజులు నీటిసరఫరా జరగలేదు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


కందుకూరు నియోజకవర్గంలో 2024 ఏప్రిల్ నాటికి 43 పనులు నిధుల సమస్యతో ప్రారంభమే కాలేదు. 'కూటమి' అధికారంలోకి వచ్చాక.. అందులో 20 పనులు అవసరమని ప్రభుత్వం నుంచి అనుమతులు పొందారు. వాటిలో ఆరు పనులకు టెండర్లు పిలవగా.. ఇటీవల ఒక్కటి ప్రారంభమైంది. జేజేఎం పనుల తీరుకు ఇవి అద్దం పడుతున్నాయి. ఇంటింటికి మంచినీరు అందించాలన్న లక్ష్యంతో కేంద్రం తీసుకొచ్చిన జల్‌జీవన్ మిషన్ పథకానికి గత వైకాపా ప్రభుత్వం తూట్లు పొడిచింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ పథకానికి శ్రీకారం చుట్టగా– నాటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు. ఫలితంగా పలు గ్రామాల్లో అర్ధాంతరంగా నిలిచిపోగా.. పూర్తయినట్లు చెబుతున్న చోట్లా చుక్కనీరు రాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

**1226 పూర్తి..**

జేజేఎం కింద జిల్లాలోని 37 మండలాల్లో 3060 పనులు మంజూరు కాగా– వీటన్నింటిని 2024 మార్చినాటికి పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్‌కు అప్పగించారు. మొదట్లో వేగంగానే జరిగినా.. బిల్లుల చెల్లింపు జరగకపోవడంతో గుత్తేదారులు అర్ధాంతరంగా ఆపేశారు. రాష్ట్ర వాటా నిధులు చెల్లించకపోవడంతో.. బిల్లుల సమస్య ఏర్పడింది. అనేకచోట్ల కనీసం పనులను ప్రారంభించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రారంభంకాని 1335 పనులను రద్దు చేసింది. వివిధ దశల్లో ఉన్న 1725ను 2026 మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యం విధించారు. వీటిలో ఇప్పటికే 1226 పూర్తయ్యాయని, 282 వివిధ దశల్లో ఉన్నాయని, 217 ప్రారంభం కానివని గుర్తించారు. కాగా పూర్తయినట్లు చూపుతున్న వాటిలో 50 శాతం కూడా వినియోగంలో లేవు. ట్యాంకులు నిర్మించినా పైప్‌లైన్లు, కుళాయి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో ప్రజలకు చుక్కనీరు అందడం లేదు. మరోవైపు వాటర్‌గ్రిడ్ పనులపై ఆశలు పెట్టుకున్నారు. సోమశిల, కండలేరు నుంచి నీటిని సరఫరా చేయాలని నిర్ణయించినా.. ఇందుకు సంబంధించి ఇంకా తుది డ్రాఫ్ట్ ఖరారు కాలేదని సమాచారం.

**చెల్లింపులు జరుగుతున్నాయి**ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ. 20 కోట్ల బిల్లులు చెల్లించారు. మరో రూ. 34 కోట్లు చెల్లించేందుకు సిద్ధం చేశారు. 2026 మార్చి నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యం. టెండర్ పూర్తయినవి త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. జి.రెడ్డయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ

# భద్రతకు భరోసా ఏదీ?



అనంతపురం: రోడ్డుపైకి వస్తే సురక్షితంగా ఇంటికి చేరతామా.. అనే సంశయం తలెత్తుతోంది. ఏ వైపు నుంచి ప్రమాదం ముంచుకొస్తుందో అంచనా వేయలేని పరిస్థితి. ఎక్కడ ఏ గుంత నోరు తెరుచుకుని.. వాహనదారులను మింగేస్తుందో తెలియడం లేదు. రెప్పపాటులో సంభవిస్తున్న ప్రమాదాలు ఎన్నో కుటుంబాలను వీధిన పడేస్తున్నాయి. ఏటా వందల సంఖ్యలో దుర్ఘటనలు జరుగుతున్నా భద్రతపై అధికారులు దృష్టి పెట్టడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే పోలీసు, రవాణా శాఖ అధికారులు హడావుడి చేస్తున్నారు. తర్వాత షరా మాములే. ఉమ్మడి అనంత జిల్లాలో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

**యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన**

జాతీయ రహదారిలోని కీలక కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణను గాలికొదిలేశారు. చాలాచోట్ల సర్వీస్ రోడ్లు లేకపోవడం వల్ల స్థానికులు వ్యతిరేక దిశలో ప్రయాణం సాగిస్తున్నారు.

కూడళ్ల నుంచి గ్రామాలకు వెళ్లే ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. చాలా సందర్భాల్లో డ్రైవర్‌కు రెండువైపులా కూర్చోబెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో వాహనాన్ని నియంత్రించలేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

**పనిచేయని స్పీడ్‌గన్లు**

ఉమ్మడి జిల్లా పరిధిలో 600 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు విస్తరించి ఉన్నాయి. వేగ నియంత్రణకు స్పీడ్‌గన్లు ఉపయోగించడం లేదు. ఉన్న రెండూ పని చేయకపోవడంతో మూలనపడేశారు. కొత్తవాటి కోసం ప్రతిపాదనలు పంపినా మోక్షం లభించలేదు.

**ప్రతిపాదనలు పట్టాలెక్కేనా..**

ప్రమాదాలు ఎక్కడ జరిగినా ఆర్‌అండ్‌బీ లేదా ఎన్‌హెచ్‌ఏఐ ఇంజినీర్లు, రోడ్డు రవాణాశాఖ ఎంవీఐ, పోలీసు అధికారి కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. నిర్మాణ లోపమా? వాహన కండిషన్‌లో లేదా? మానవ తప్పిదమా? నిర్లక్ష్యమా? తదితర అంశాలను నివేదికలో పొందుపరచాలి. వీటిపై ప్రతినెలా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో సమీక్షించాలి. రహదారి డిజైన్‌లో లోపం ఉంటే మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు సమావేశాలు జరుగుతున్నా అందులో ప్రతిపాదించే అంశాలు చాలావరకు అమల్లోకి రావడం లేదు.

**బ్లాక్‌స్పాట్‌లు ఎక్కడంటే..**

1 ఎన్‌హెచ్ 44 (హైదరాబాద్–బెంగళూరు): గుత్తి చౌరస్తా, పామిడి, కల్లూరు, గార్లదిన్నె, తపోవనం, రాప్తాడు, రామినేపల్లి, సీకే పల్లి, పెనుకొండ, సోమందేపల్లి, పాలసముద్రం, కొడికొండ చెక్‌పోస్ట్.

2 ఎన్‌హెచ్ 42 (బళ్లారి–కదిరి): పాల్తూరు, ఉరవకొండ, చిన్నముష్టూరు, పంగల్‌రోడ్డు, ముదిగుబ్బ, పట్నం

3 ఎన్‌హెచ్ 67 (బళ్లారి–తాడిపత్రి): కొత్తపేట, టి.కొత్తపల్లి క్రాస్, వంగనూరు, అర్జాస్ స్టీల్‌ప్లాంట్, చుక్కలూరు, రాయలచెరువు

4 ఎన్‌హెచ్ 544డి (అనంతపురం–తాడిపత్రి): ఎర్రగుంటపల్లి, వెంకటరెడ్డిపల్లి

**తగిన చర్యలు తీసుకుంటున్నాం**

– జగదీశ్, ఎస్పీ, అనంతపురం

రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ప్రతిపాదనలను వీలైనంత వరకు అమలు చేస్తున్నాం. ప్రమాదాల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవలే బ్లాక్‌స్పాట్‌ల వద్ద సీసీ కెమెరాలు, లైటింగ్, సూచికబోర్డులు ఏర్పాటు చేశాం.

# భగ్గుమంటున్న కూరగాయల ధరలు



ధర్మవరం: మార్కెట్లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. ఏదీ కొనాలన్నా కిలో రూ.100 పలుకుతున్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ధరలు పెరగడంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. కేవలం పది రోజుల వ్యవధిలోనే ధరలు పెరగడం గమనార్హం. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు చేరి కూరగాయలు, ఆకుకూరల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నీరు తగ్గకపోవడంతో పంటలకు తెగుళ్లు సోకి పాడయ్యాయి. దీంతో మార్కెట్‌కు ఆశించిన మేర దిగుబడి రావడం లేదు. కూరగాయలు స్థానికంగా దొరక్కపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, దాంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

**సంచి నిండటం లేదు–** నారాయణమ్మ, పుట్టపర్తి

మార్కెట్‌కు రూ.500 తీసుకెళ్తే చిన్న సంచికి కూడా కూరగాయలు రావడం లేదు. వంటలు రుచిగా వండాలంటే పోషకాలతో కూడిన మంచి కూరలు ఉండాల్సిందే. ప్రతి రోజు తాజా కూరగాయలు అవసరం. అందుకే ధర పెరిగినా తప్పని పరిస్థితుల్లో కొంటున్నాం. ఇలాగైతే సామాన్యులు బతకలేని పరిస్థితి.

# అక్రమాల.. పని'పట్టా'లని

శ్రీకాళహస్తి: అక్రమాలకు అడ్డాగా.. అక్రమార్కులకు సిరులు పండించే రాజీవ్‌నగర్‌లో మళ్లీ సర్వేకు రెవెన్యూ శాఖ శ్రీకారం చుట్టింది. 2007లో ఇళ్లులేని పేదలకు పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు రాజీవ్‌నగర్‌లో పట్టాలిచ్చారు. విడతల వారీగా 6,500 ఇళ్లు మంజూరు చేశారు. ఇళ్లు నిర్మించుకోలేని పేదల స్థలాలను కబ్జాచేసి అమ్ముకుంటున్నారు అక్రమార్కులు.

**ఖాళీ జాగాలతో కాసులే**

రాజీవ్‌నగర్‌లో సమస్యంతా ఖాళీ జాగాల విషయంలోనే. వైకాపా హయాంలో ఇక్కడి స్థలాలను అడ్డగోలుగా అమ్ముకున్నారనే విమర్శలున్నాయి. పిచ్చాటూరు–శ్రీకాళహస్తి రహదారి స్థలాన్ని అమ్ముకున్నారు. ఓ ప్రభుత్వ ఉద్యోగి వెయ్యికి పైగా పట్టాలు కలిగి ఉండటంపై కేసులు నమోదయ్యాయి.



**కూటమి ప్రభుత్వం వచ్చాక..**

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాజీవ్‌నగర్‌లో సర్వే చేపట్టారు. అప్పట్లో సమగ్రంగా నిర్వహించలేదన్న విషయమై మలి విడత సర్వేకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారు. ఆ ప్రకారం అక్కడున్న వంద ఎకరాల్లోని 6,500 ఇళ్లను 12 బ్లాక్‌లుగా విభజించారు. వీటిని సర్వే చేసేందుకు ఏడు బృందాలు ఏర్పాటు చేశారు. ఖాళీ స్థలాల్లో పట్టాలు పరిశీలించడం, అర్హులైన లబ్ధిదారులను తేల్చేలా సర్వే ప్రారంభమైంది.

**అపోహలు వద్దు**

సర్వే నేపథ్యంలో ఇళ్లు కూల్చేస్తారన్న అపోహలు వద్దు. ఇళ్లు నిర్మించుకున్న వాళ్ల పట్టాల పరిశీలనతో పాటు ప్రధానంగా ఖాళీగా ఉన్న స్థలాలకు సంబంధించి పట్టాలు తనిఖీ చేస్తాం. అర్హులైతే వాళ్ల పట్టాను అనుమతిస్తూ ధ్రువీకరణ పత్రం ఇస్తాం. ఆధారాలు లేని వాటిని స్వాధీనం చేసుకుని నిజమైన లబ్ధిదారులకు అందజేస్తాం.

భానుప్రకాష్‌రెడ్డి, ఆర్డీవో

పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలు: 6,500

నిర్మాణాలు జరిగినవి: 4,700

ఖాళీగా ఉన్నవి: 1,800

విభజించిన బ్లాక్‌లు: 12

సర్వే బృందాలు: 7

# సెస్సు ఏ'మిర్చి'.. వ్యాపారుల మాయాజాలం

నంద్యాల : జిల్లాలో శీతల గోదాములు కేంద్రంగా మిర్చి కొనుగోళ్ల మాయాజాలం జరుగుతోంది. నిబంధనల ప్రకారం మార్కెట్‌యార్డులో క్రయవిక్రయాలు జరగాల్సి ఉన్నా.. గోదాముల వద్దే దందా సాగుతోంది. మరోవైపు అక్రమార్కులు సరకును రైతు పేరుతో తరలించేస్తూ పెద్దఎత్తున సెస్సు ఎగ్గొడుతున్నారు. జిల్లాలో 11 శీతల గోదాములుండగా.. సగటున ఒక్కో గోదాములో రూ.60 కోట్ల విలువ చేసే మిరప దిగుబడులు ఉన్నాయి. ఈ లెక్కన రూ.660 కోట్ల మిర్చి దిగుబడులు ఉండగా వీటి విక్రయాల ద్వారా ప్రభుత్వానికి సెస్సు రూపంలో ఏడాదికి రూ.6 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశముంది. దళారులు గోదాముల వద్దే సరకు కొనుగోలు చేస్తుండటంతో ప్రభుత్వానికి భారీ నష్టం జరుగుతోంది.

**ట్రేడ్ లైసెన్సులు లేకుండానే 'బేరాలు'**

నిబంధనల ప్రకారం రైతులు మిర్చిని యార్డుకు తీసుకొచ్చి ప్రభుత్వ లైసెన్సు పొందిన కమీషన్ ఏజెంట్ల ద్వారా విక్రయించాలి.

నంద్యాల మార్కెట్ యార్డులో మాత్రమే మిర్చి యార్డు ఉంది. ప్రత్యేకంగా రెండేళ్ల కిందట మిర్చి రైతుల కోసమే ఈ యార్డును ఏర్పాటుచేసి 20 మంది ఏజెంట్లకు లైసెన్సులు ఇచ్చారు.

రైతు నుంచి కొనుగోలు చేసే మొత్తానికి ఏజెంట్లు రసీదులు ఇస్తారు. ఇదే సమయంలో క్రయవిక్రయాలతో యార్డుకు ఒక శాతం సెస్సు రూపంలో జమవుతుంది. సంబంధిత ఏజెంటు కొనుగోలు చేసిన



మొత్తానికి చెల్లించిన సెస్సు వివరాలు ఉండడంతో రైతుకు చెల్లించాల్సిన డబ్బుకు ఒక రకంగా గ్యారెంటీ ఉంటుంది. ఇవన్నీ ప్రైవేటు గోదాముల వద్ద ఉండవు.

**ధర తగ్గిందని దాచుకొంటే**

నంద్యాల, కోవెలకుంట్ల, గడివేముల, పాణ్యం, మిడుతూరు, నందికొట్కూరు, వెలుగోడు, మహానంది, చాగలమర్రి, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో రైతులు విస్తారంగా మిర్చి సాగు చేస్తున్నారు. గత రెండేళ్లుగా ఈ పంటకు తగిన గిట్టుబాటు ధర లభించడం లేదు. గతంలో కిలో రూ.280 వరకు ధర పలకగా.. ప్రస్తుతం రూ.125 నుంచి రూ.140కు పడిపోయింది. పలువురు రైతులు సరకును రెండేళ్లపాటు గోదాముల్లో నిల్వ ఉంచినప్పటికీ ఆశించిన ధర లభించడం లేదు. దీనికితోడు మిర్చిపై నల్లటి పొర వస్తుండటంతో దాచిన సరకును రైతులు విక్రయించేస్తున్నారు. ఇదే అదనుగా మధ్య దళారులు రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని గోదాముల వద్దే మిర్చి కొనుగోలు చేస్తున్నారు.

**అక్రమాలకు దారి**

గోదాముల వద్ద మిర్చి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు కాటాల్లోనూ మోసాలకు పాల్పడుతున్నారన్న అనుమానాలున్నాయి. మరోవైపు రైతుల నుంచి మిర్చి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు వారి పేరుతోనే గుంటూరు యార్డుకు తరలిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వానికి ఒక్క పైసా ఆదాయం రావడం లేదు.

" రెండేళ్ల కిందట శీతల గోదాములో 66 బస్తాల మిర్చి నిల్వ చేశా. అప్పుడు కిలో రూ.180 మాత్రమే పలుకుతుండటంతో ధర లేదన్న ఉద్దేశంతో నిల్వ చేశా. ప్రస్తుతం రూ.125కే అమ్ముతున్నా. గోదాముల్లో రెండేళ్ల కంటే ఎక్కువగా నిల్వ చేయలేం. ఇప్పటికే మిరపపై కొంతమేర నల్లటి రంగు కనిపిస్తోంది. యార్డుకు తీసుకెళ్లలేక గోదాము వద్దనే అమ్ముకుంటున్నట్లు" పాణ్యానికి చెందిన ఎల్లప్ప వాపోయారు.

శీతల గోదాములు : 11

ఒక్కోదాని సామర్థ్యం : 1.20 లక్షల సంచులు

# ఆగాలి కలుషితం

చిత్తూరు : దేశంలోని వివిధ నగరాల్లో 2014–18 మధ్య గాలి నాణ్యతపై అధ్యయనం చేయగా చిత్తూరులో కాలుష్యం పెరుగుతోందని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో ఎన్‌సీఏపీ (నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం) కింద నిధులు ఇవ్వాలని నిర్ణయించారు. 2019–20లో చిత్తూరు కార్పొరేషన్‌కు రూపాయి రాలేదు. 2020–21 నుంచి 2023–24 వరకు నాలుగేళ్లలో రూ.7 కోట్లు మంజూరు కాగా నియంత్రణ చర్యలు పెద్దగా చేపట్టలేదు.

చిత్తూరు ప్రజలకు స్వచ్ఛమైన గాలే అందడం లేదు. జాతీయ కాలుష్య నియంత్రణ మండలి చెప్పిన నిజం ఇది.

వాయు నాణ్యత ప్రమాణాలు అందుకోలేని నగరాలు రాష్ట్రంలో 13 ఉండగా చిత్తూరు వాటితో పోటీ పడుతోంది.

కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ స్వచ్ఛ వాయు సర్వేక్షణ్



ర్యాంకుల్లోనూ 2024లో 21వ స్థానంలో నిలవగా.. 2025లో 29వ స్థానానికి పడింది. తిరుపతి నగరపాలక సంస్థ ఘన వ్యర్థాల నిర్వహణ మెరుగ్గా చేస్తోంది. తూకివాకంలోని సమీకృత వ్యర్థాల ప్లాంటులో సేంద్రియ వ్యర్థాలను మిథేన్‌గా మారుస్తున్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను ఇతర నిర్మాణాలకు వాడుతున్నారు. రహదారులపై దుమ్ము లేకుండా పారిశుధ్య కార్మికులు చూస్తున్నారు. ఇలా ప్రతి అంశంలోనూ తిరుపతిలో చర్యలు చేపట్టడంతో ఏక్యూఐ 80–96 మధ్య ఉంది.

**ఏం చేయాలంటే?**

చిత్తూరులో గ్రానైట్, భవనాలు కూల్చిన వ్యర్థాలను రోడ్డు పక్కనే పడేస్తున్నారు. చికెన్, ఆహార శుద్ధి పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థాలను సరిగా శుద్ధి చేయడం లేదనే ఆరోపణలున్నాయి. వీటిని అరికట్టడంతో పాటు మొక్కలు విరివిగా నాటాలి.

# వెలుగులు నింపి.. చీకట్లో మగ్గి

ఏర్పేడు : వారంతా రూ.లక్షలు విలువైన భూములను పరిశ్రమలకు ఇచ్చి కూలి పనులు చేసుకుని జీవనం నెట్టుకొస్తున్నారు. పరిహారం కోసం ఏళ్ల తరబడి కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా, పట్టించుకునేవారే లేరు. పిల్లలను చదివించలేక, వివాహాలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇదీ ఏర్పేడు మండలంలోని వికృతమాల రెవెన్యూలో ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తుల తయారీ కేంద్రం(ఈఎంసీ–2)కు భూములు ఇచ్చిన రైతుల దుస్థితి.

**వీధిన పడ్డారు..**

170 ఎకరాలకు చెందిన రైతుల దస్త్రాలు పరిశీలించి కేటగిరి–బి కింద పరిహారం ఇస్తామని అప్పటి అధికారులు హామీ ఇచ్చారు. వైకాపా అధికారంలోకి రావడంతో పరిహారం పంపిణీ అటకెక్కింది.

**కారణాలు**సాగులో ఉన్న రైతుల్లో కొందరికి పట్టాలు లేవు.

డి పట్టాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఒకరిపేరు ఉండగా..



అనుభవంలో మరొకరు న్నారు.

తండ్రి మరణానంతరం వారసత్వంగా కుటుంబ సభ్యులు పేర్లు నమోదుకాలేదు.

వికృతమాలకు చెందిన రైతు కాకి హరికి చెందిన 2.28 ఎకరాల భూమిని ప్రభుత్వం తీసుకుంది. కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం లేదనే కారణంతో ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదు.

ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది

ఈ సమస్య ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది. భూములు కోల్పోయి పరిహారం అందని రైతుల వివరాలు ఉన్నాయి. త్వరలోనే నగదు పంపిణీ చేసేందుకు మళ్లీ ప్రతిపాదనలు పంపాం.

# భేదాల్లేవ్.. బేరాలే!

విశాఖపట్నం : కోళ్లవ్యర్థాల తరలింపులో కొందరు వైకాపా నేతలు కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కౌన్సిల్ సమావేశంలోనూ కోళ్ల వ్యర్థాల తరలింపు అంశం చర్చకు వచ్చింది. చర్యలకు ఆదేశించారే కానీ, క్షేత్రస్థాయిలో వ్యర్థాలు డంపింగ్ యార్డుకు ఎందుకు రావడం లేదన్న కోణంలో పరిశీలన జరగలేదు. నగరంలో కోళ్ల మాంసం వ్యర్థాలతో కాసుల వేట జోరుగా సాగుతోంది. వైకాపా హయాంలోని జీవీఎంసీ పాలక వర్గంలో ఉన్న నాయకుల కనుసన్నల్లోనే ఈ దందా దర్జాగా జరుగుతోంది. ఇందుకు ప్రస్తుత కూటమిలోని ఓ కీలక నేత సహకారం అందిస్తుండటంతో కోళ్ల వ్యర్థాలను నిర్భీతిగా చేపల చెరువులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అవేగా...అనుకోవద్దు: నగరంలో మాంసం దుకాణాల వద్ద వృథాగా పడేసే కోళ్ల వ్యర్థాలే కదా..ఎంత వస్తుంది? అనుకోవద్దు. లెక్కలు చూస్తే ముక్కున వేలేయాల్సిందే. అందుకే కోళ్ల వ్యర్థాల తరలింపునకు కొన్ని వర్గాలు పోటీ పడుతున్నాయి. జీవీఎంసీ 8 జోన్ల పరిధిలో 1,600 దుకాణాల నుంచి ప్రతి రోజూ 40 టన్నుల వ్యర్థాలు సేకరిస్తారు. టన్ను రూ.8 వేల చొప్పున చేపల చెరువులకు అనకాపల్లి, గోదావరి జిల్లాలకు తరలిస్తారు. అంటే ప్రతి రోజూ రూ.3.20 లక్షలకు అమ్మకాలు చేస్తున్నారు. ఆదివారం అయితే 80 టన్నుల వ్యర్థాలు డ్రమ్ముల్లో నింపి వాహనాల్లో తరలిస్తారు. ఇలా చూస్తే ఆదివారాలతో కలిపి నెలకు దాదాపు రూ. కోటికి పైగా లావాదేవీలు సాగుతాయి.

పట్టుకున్నా...: జీవీఎంసీ పరిధిలో కోళ్ల వ్యర్థాలను తరలించి కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించేందుకు ఏడుగురు గుత్తేదారులకు గతంలో బాధ్యతలిచ్చారు. అయితే ఈ వ్యర్థాలు యార్డుకు కాకుండా పక్కదారి పడుతున్న నేపథ్యంలో అప్పట్లో ఇన్‌ఛార్జి కమిషనర్‌గా ఉన్న కలెక్టర్ కాంట్రాక్టు రద్దు చేశారు. దానిపై గుత్తేదారులు కొందరు కోర్టును ఆశ్రయించగా, జీవీఎంసీ కనీసం కౌంటర్ దాఖలు చేయలేదన్న విమర్శలున్నాయి. ప్రతి నెలా రూ.10లక్షలు ఇచ్చేలా కూటమిలోని ఓ కీలక సభ్యుడితో మాట్లాడుకున్నట్లు సమాచారం. దీంతో అక్రమంగా తరలిస్తున్నారంటూ సీజ్ చేసిన 25 వాహనాలను సైతం ఎలాంటి కేసుల్లేకుండా ఇటీవల వదిలేయడం విమర్శలకు దారితీసింది. అనకాపల్లి జిల్లా డైట్ కళాశాల సమీపంలో కోళ్ల వ్యర్థాలతో ఉన్న ఐదు వాహనాలను ఇటీవల సీజ్ చేశారు.

# చిన్న పరిశ్రమలు ఆదుకుంటున్నాయ్!



విశాఖపట్నం: ఆర్థిక నగరం విశాఖలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులు ముందుకొస్తున్నారు. ప్రైవేటు సంస్థల్లో ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు వివిధ ప్రాంతాల ప్రజలు పనిచేస్తున్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ)లోనే ఎక్కువ మంది ఉపాధి పొందుతున్నారు. పెద్ద పరిశ్రమల్లో పెట్టుబడులు ఎక్కువగా ఉన్నప్పటికీ ఉపాధి అవకాశాలు తక్కువగా ఉంటున్నాయి. వాటి ఏర్పాటుకు కనీసం రెండు నుంచి మూడేళ్లు పడుతుండగా.. ఎంఎస్‌ఎంఈలు మూడు నుంచి ఆరు నెలల్లోనే కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయి. పెద్ద సంస్థల్లో 51,957 మంది, చిన్న పరిశ్రమల్లో 1,78,898 మంది ఉపాధి పొందుతున్నారు.

నగర పరిధిలో కొత్తగా ఏర్పాటయ్యే పెద్ద, భారీ పరిశ్రమలు తక్కువగా ఉంటున్నాయి. అవి ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోనే ఏర్పాటవుతున్నాయి. మరోవైపు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికో ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో ఉత్తరం, దక్షిణ నియోజకవర్గాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో ఏపీఐఐసీ అధికారులు స్థలాలు గుర్తిస్తున్నారు.

భీమిలి నియోజకవర్గం పద్మనాభం దగ్గర కృష్ణాపురం గ్రామంలో 100 ఎకరాలు గుర్తించారు. మొదటి దశలో 50 ఎకరాలు అభివృద్ధి చేయనున్నారు. పరిశ్రమ ఏర్పాటుకు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. అవి అందుబాటులోకి వస్తే వేలాది మందికి ఉపాధి లభించనుంది. స్థానికంగా ఉపాధి కల్పిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుంది. కొత్తగా ఎవరైనా పెట్టుబడులతో ముందుకొస్తే నవంబరులో జరగనున్న పార్టనర్‌షిప్ సదస్సులో ఒప్పందాలు చేసుకోవడానికి అవకాశముంది.

‘ఉద్యమ్’ ప్రక్రియ సులభతరం కావడంతో ఎక్కువ మంది ఎంఎస్‌ఎంఈలను నమోదు చేసుకుంటున్నారు. పరిశ్రమల అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే, అధికారులు పరిశీలించి, అనుమతులు ఇస్తున్నారు.

పెద్ద, భారీ పరిశ్రమలు..

నడుస్తున్న యూనిట్లు: 53

ఉద్యోగులు 51,957

ఏర్పాటు ప్రక్రియలో ఉన్నవి 3

ఉద్యోగాలు 34,120

ఎంఎస్‌ఎంఈలు..

యూనిట్లు: 20,510

ఉద్యోగులు 1,78,898

ఏర్పాటు ప్రక్రియలో ఉన్నవి 28

ఉద్యోగాలు 455

2025–26లో ఆగస్టు వరకు నమోదు చేసుకున్న ఎంఎస్‌ఎంఈలు: 229

పెట్టుబడులు: రూ.22.65 కోట్లు

ఉద్యోగాలు: 687

రెండు నెలల్లో అందుబాటులోకి.. పరిశ్రమలకు అనుమతులు కావాలనుకుంటే రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కులు మరో రెండు నెలల్లో అందుబాటులోకి వచ్చే అవకాశముంది. ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లో ఒకేచోట ఎక్కువ స్థలం అందుబాటులో లేదు. ప్రత్యామ్నాయం కోసం పరిశీలిస్తున్నాం. ఆదిశేషు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి

# తప్పని ప్రసవ వేదన




గోరంట్ల : మండలం గుమ్మయ్యగారిపల్లికి చెందిన గంగోత్రి గతనెల 5న ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ప్లేట్లెట్స్ 56 వేలు మాత్రమే ఉన్నాయి. స్థానికంగా ప్లేట్లెట్స్ అందించే అవకాశం లేక అనంతపురానికి రెఫర్ చేశారు. అక్కడ వైద్యులు సిజేరియన్ చేస్తుండగా మృతి చెందారు. ఈనెల 4న కర్ణాటక ప్రాంతం మంచేపల్లికి చెందిన గర్భిణి సంధ్య.. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ప్లేట్లెట్స్ తక్కువగా ఉండటంతో అనంతపురానికి రెఫర్ చేశారు.

హిందూపురంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. రోగులకు అవసరమైన చికిత్స అందించేందుకు అన్ని సౌకర్యాలు ఆసుపత్రిలో ఉన్నా సిబ్బంది, వైద్యుల కొరత కారణంగా ఈ పరిస్థితి నెలకొంది. ప్రధానంగా మడకశిర, పెనుకొండ, గోరంట్ల, సోమందేపల్లితోపాటు పొరుగున ఉన్న కర్ణాటక ప్రాంతం నుంచి గర్భిణులు రోజూ ఇక్కడికి వస్తుంటారు. వారిలో సగం మందికి రక్తహీనత ఉంటోంది. ఇదిలా ఉండగా శస్త్రచికిత్స చేయాలంటే తగినంత రక్తం, ప్లేట్లెట్స్ ఉండాలి. అవి తక్కువగా ఉన్నవారికి ఇక్కడ సేవలు అందుబాటులో లేక వైద్యులు ఇతర ప్రాంతాలకు.. ముఖ్యంగా అనంతపురానికి రెఫర్ చేయాల్సి వస్తోంది. ఇక్కడి నుంచి అనంత చేరుకోవాలంటే అంబులెన్స్‌లో కనీసం 2 గంటలకు పైగా సమయం పడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రాణాలకు ముప్పు కలిగిన ఘటనలు చోటు చేసుకొంటున్నాయి.

ప్రసవానికి సంబంధించి శస్త్రచికిత్స చేయాలంటే తగినంత రక్తం ఉండాలి. సగం మంది గర్భిణిలకు తక్కువ ఉంటోంది. అలాగే ప్లేట్లెట్స్ 1.30 లక్షలు ఉండాలి. కొందరికి 50 వేల నుంచి ఒక లక్ష ఉంటున్నాయి. దీంతో వైద్యులు శస్త్రచికిత్స చేయడానికి వీలుకాక అనంతపురానికి పంపుతున్నారు.

**పరికరాలు వచ్చినా..**ప్రభుత్వ ఆసుపత్రికి నెల రోజుల ముందు దాదాపు కోటి రూపాయలు విలువ చేసే పరికరాలు వచ్చాయి. ఇప్పటి వరకు వాటిని వినియోగంలోకి తీసుకురాలేక పోయారు. వాటిని ఏర్పాటు చేయటానికి అవసరమైన శీతల గది.. పెథాలజిస్ట్‌తోపాటు లైసెన్స్ ఉండాలి. ఇవేమి లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి.

పడకలు: 200

ప్రతినెలా ప్రసవాలు: 230 (సుమారు)

రక్తహీనతతో వచ్చే గర్భిణులు: 100 మందికి పైగా

**అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..: అన్నపూర్ణ, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్**


గర్భిణిలకు పూర్తిస్థాయిలో సేవలు అందించేందుకు అవసరమైన పరికరాలు ఇంకా రావాల్సి ఉంది. వచ్చిన రెండు పరికరాలు సక్రమంగా లేనందున వెనక్కి పంపాం. సిబ్బంది, లైసెన్స్ రావాలంటే మరికొంతకాలం పట్టే అవకాశం ఉంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు చొరవ తీసుకొని పరిష్కరించాల్సి ఉంది.

# నకిలీ డీపీ.. పెడుతోంది టోపీ

తిరుపతి : సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన పెరగడంతో నేరగాళ్లు మళ్లీ పాత పద్ధతుల్లో డబ్బు కొట్టేసేందుకు యత్నిస్తున్నారు. తెలిసిన వ్యక్తుల ఫొటోలను వాట్సప్ డీపీలుగా పెట్టుకుని నగదు కొట్టేస్తున్నారు. ప్రముఖులు, పోలీసులు, ఉన్నతాధికారులు, కుటుంబ సభ్యులు, సన్నిహితుల వాట్సప్ డీపీలతో సందేశాలు పంపించి మోసగిస్తున్నారు. అత్యవసరంగా డబ్బు కావాలని, ఆసుపత్రిలో చికిత్సకు వచ్చానని, పోలీసు కేసులో ఇరుక్కున్నామంటూ ఏవేవో మాటలతో ఏమారుస్తున్నారు. కొన్ని సంస్థలు మానవ వనరుల నిర్వహణ, వేతనాల చెల్లింపు, వివిధ అవసరాలు, సేవలకు థర్డ్ పార్టీ ఏజెన్సీలను ఉపయోగించుకుంటాయి. ఈ వివరాల భద్రతలో ఏజెన్సీలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. కొందరు ఉద్యోగులు డబ్బుకు ఆశపడి డేటా మొత్తాన్ని ఇతరులకు విక్రయించేస్తున్నారు. వాటిని చేజిక్కించుకుంటున్న సైబర్ నేరగాళ్లు.. ఓపెన్ సోర్స్‌లో ఉండే ప్రముఖుల ఫొటోలను డీపీలుగా పెట్టుకుని వాట్సప్ ద్వారా గాలం వేస్తున్నారు.

ఇవీ జాగ్రత్తలు.. సామాజిక మాధ్యమాల్లో తెలిసిన వారి ఫొటోలు డీపీలుగా పెట్టి డబ్బు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వొద్దు.

అత్యవసర మని డబ్బు కావాలని సందేశాలు వస్తే.. ఫోన్ చేసి



నిర్ధారించుకోవాలి. అవసరమైతే వీడియో కాల్ చేయాలి.

అంతర్జాతీయ నంబర్లతో వచ్చే సందేశాలు నమ్మొద్దు.

**ఎవరికి ఫిర్యాదు చేయాలి..**మోసపోతే ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ నంబరు లేదా %www.cybercrime.gov.in% వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలి.

# పసివాళ్లపై పగేలా?

నర్సీపట్నం: ‘అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని’ అన్న సామెత ఈ కేంద్రాలకు అతుకుతుంది. పిల్లల వైద్యం కోసం రూ.లక్షల్లో ప్రజాధనం వెచ్చించి వైద్య పరికరాలు, ఉపకరణాలు కొనుగోలు చేసినా వైద్యులు, తగినంత సిబ్బంది లేక అవన్నీ నిరుపయోగంగా మారాయి. నర్సీపట్నంలో మూడేళ్ల కిందట ఏర్పాటైన జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో దంత, వినికిడి, నేత్ర, చిన్నారుల వైద్య నిపుణులు, ఫిజియోథెరపిస్ట్, మెడికల్ ఆఫీసర్ పోస్టులు భర్తీ కాలేదు. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి 18 ఏళ్లలోపు పిల్లల్లో 45 రకాల లోపాలకు ఉచితంగా చికిత్సలు అందించాలన్నది ఈ కేంద్రం లక్ష్యం. వంకర పాదాలు, పుట్టుకతో వచ్చే క్యాటరాక్ట్, వినికిడి లోపం, నాడీ వ్యవస్థ లోపాలు, నడుం భాగంలో అభివృద్ధి లోపం, పెదవి చీలిక, గ్రహణం మొర్రి, రక్తహీనత, విటమిన్ లోపాలు, తీవ్ర పోషకాహార లోపం, చర్మ సంబంధ వ్యాధులు, చెవి నుంచి చీము, రక్తం కారడం, రుమాటిక్ గుండె వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు, పిప్పిపళ్లు, గారపళ్లు, చిగుళ్లవాపు, మూర్ఛ, దృష్టి సమస్యలు, ఎదుగుదల లోపించడం, ఆటిజం తదితర వ్యాధులకు చికిత్సలు అందాల్సి ఉంది. రూ.1.06 కోట్లతో నిర్మించిన ఈ కేంద్రంలో వైద్య పరికరాలు, ఉపకరణాలన్నీ ఉన్నాయి.

ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రతి నెలా 300కు పైగా ప్రసవాలు



జరుగుతున్నాయి. నెలకు పదికి తగ్గకుండా శిశువులకు సిప్యాప్ యంత్రాల అవసరం ఉంటోంది. కనీసం ఇద్దరు వైద్యులు, నలుగురు స్టాఫ్ నర్స్‌లు, సహాయకుడి పోస్టులను భర్తీ చేస్తే ఉపయుక్తంగా ఉంటుంది. ఐదు ఫొటోథెరపీ యంత్రాలను ఆసుపత్రి సిబ్బందిని పంపి కామెర్ల పిల్లలకు ఉపయోగిస్తున్నారు. నర్సీపట్నం, చోడవరం, పాయకరావుపేట నియోజకవర్గాల్లోని పలు మండలాలతోపాటు అల్లూరి జిల్లాలోని చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల నుంచి వైద్య సేవల కోసం వందల మంది ప్రాంతీయ ఆసుపత్రికి వస్తుంటారు. ప్రాంతీయ ఆసుపత్రిలో స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్లో నెలలు నిండకుండా పుట్టిన పిల్లలు, తగినంత బరువు లేని వారు, కామెర్లతో జన్మించిన శిశువులకు చికిత్స అందించాలి. రూ.లక్షల విలువైన పదేసి వార్మర్లు, ఫొటో థెరప్మీ యూనిట్లు, రెండు సిప్యాప్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. ఈ యూనిట్లోనూ పిల్లల వైద్యులు, నర్సుల్లేరు. స్థానికంగా ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ సిప్యాప్ యంత్రాలు లేకపోవడంతో అత్యవసరమైతే విశాఖపట్నం వెళ్లాల్సి వస్తోంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం బాలల సత్వర చికిత్స కేంద్రంలో పోస్టుల భర్తీకి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆగస్టు 22న నోటిఫికేషన్ జారీ చేశారు. ఎంపిక తర్వాత ఇక్కడకు అవసరమైన వైద్యులను నియమించనున్నారు. స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్లో వైద్యులు, స్టాఫ్‌నర్స్‌ల కొరతని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. డాక్టర్ సుధాశారద, ప్రాంతీయ ఆసుపత్రి పర్యవేక్షకురాలు

# మిగిలింది నాలుగు నెలలే..

అనకాపల్లి : ఇంటర్ విద్యార్థులకు పరీక్షల తేదీలను ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరం సిలబస్ మారడం, ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ప్రైవేటు కళాశాల విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులను తయారు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరుస్తున్నాయి.

ప్రస్తుతం విద్యా సంవత్సరంలో ఇంటర్ పరీక్షలను ఫిబ్రవరి 23 నుంచి నిర్వహించడానికి తేదీలను ఖరారు చేశారు. జనవరి 27 నుంచి వృత్తి విద్యా, జనరల్ కోర్సుల విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో డిసెంబరు నాటికి సిలబస్ పూర్తిచేయాలని కళాశాల అధ్యాపకులకు ఆదేశాలు జారీ అయ్యాయి. లేనిపక్షంలో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. విద్యార్థులకు ప్రత్యేక బోధనా తరగతులూ నిర్వహిస్తున్నారు. కళాశాలల సాధారణ బోధనా సమయాలతో పాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యార్థులకు బోధిస్తున్నారు. ఇది విద్యార్థులకు బాగా కలిసొస్తుందని భావిస్తున్నారు.

ప్రభుత్వ కళాశాలలకు అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులను నియమించడంతో పాటుగా ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు పోటీ పరీక్షల పుస్తకాలు అందించారు. జిల్లాలో ఈ ఏడాది మొదటి సంవత్సరంలో 13,625 మంది, ద్వితీయ సంవత్సరంలో 12,511 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో మొదటి సంవత్సరం 3,540 మంది, ద్వితీయ సంవత్సరం 2,931 మంది ఉన్నారు. వీరికి మెరుగైన బోధన అందించడానికి వీలుగా చర్యలు తీసుకుంటున్నారు.

**ఉత్తీర్ణత పెంచుతాం**

ఇంటర్ పరీక్షల నిర్వహణకు తేదీలను ప్రకటించడంతో సిలబస్‌ను డిసెంబరు కల్లా పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేశాం. ఈ ఏడాది ఉత్తీర్ణతా శాతాన్ని మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటున్నాం. గత ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం 63 శాతం, ద్వితీయ 72 శాతం ఉత్తీర్ణత వచ్చింది. ఈ ఏడాది మరింత మెరుగుపర్చడంతో పాటు పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం.

వినోద్‌బాబు, ఇంటర్‌బోర్డు జిల్లా అధికారి

# స్థలముంటే.. సొంతింటి కల సాకారమే


చిత్తూరు : పట్టణ ప్రాంతాల్లోని సామాన్య, మధ్య తరగతి ప్రజలు సొంతింటి కలను నెరవేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. స్థలం ఉండి ఇల్లు కట్టుకోవాలని దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు కేంద్రం.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 (పీఎంఏవై)లో భాగంగా ఊరట కలిగిస్తోంది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షల చొప్పున నిధులు విడుదల చేస్తుంది. జిల్లాలో చిత్తూరు నగరపాలక సంస్థ, నగరి, పలమనేరు, పుంగనూరు, కుప్పం పురపాలికల్లో.. సొంత స్థలం కలిగిన 2,472 మంది ఇంటి నిర్మాణానికి అవకాశాన్ని కల్పించారు. ః పల్లె ప్రాంతాల ప్రజలు స్థలం ఉండి దరఖాస్తు చేసుకోగా పీఎంఏవై 2.0 అధికారులకు ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే అనుమతులు మంజూరు కానున్నాయి. లబ్ధిదారుకు కేంద్రం రూ.1.50 లక్షలు ఇవ్వనుండగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష అందజేయనుంది.

# తలారి 'భూ'తం

కర్నూలు: కోడుమూరు నియోజకవర్గంలోని వర్కూరులో రూ.కోట్ల విలువైన భూములు పరాయి వాళ్ల చేతుల్లో మగ్గుతున్నాయి. గతంలో గ్రామంలో తలారిగా విధులు నిర్వర్తించిన ఓ వ్యక్తి పలువురి భూములను తన పేరు పైనా, తన తల్లి పేరుపైనా మార్చేసిన ఉదంతం తాజాగా వెలుగులోకి వచ్చింది. రీసర్వే పేరుతో తనకు నచ్చిన వారి పేరు మీదికి అదనంగా భూములను వచ్చేలా చేశారు.
వర్కూరు గ్రామ మాజీ తలారీ దస్తగిరి సర్వే నంబరు 174లోని భూములను గుట్టుచప్పుడు కాకుండా తన పేరు మీదకు 3.78 ఎకరాలు, తన తల్లి పేరు మీదకు ఐదెకరాలు మార్చేసుకున్నారు.
కోడుమూరు నుంచి ఎమ్మిగనూరు వెళ్లే ప్రధాన రహదారికి అర కిలోమీటరు దూరంలోనే ఉన్న ఆయా భూములకు మంచి ధర ఉంది. అందులో బోర్లు వేయించుకొని దశాబ్దాల నుంచి కొన్ని కుటుంబాలు సాగు చేసుకుంటున్నాయి. వారికి పట్టాలు లేకపోవడంతో దస్తగిరి తను, తన తల్లి పేరిట ఆన్‌లైన్లో వివరాలు నమోదు చేసుకున్నారు.

**రీసర్వే పేరుతో కోత పెట్టి..**

వర్కూరు గ్రామంలో నిర్వహించిన రీసర్వేలో కొందరు భూములు కోల్పోయారు. కోడుమూరుకు చెందిన ఓ వైకాపా కీలక నేత ఆదేశాలతో పార్టీ అనుచరులకు లబ్ధి చేకూరేలా రీసర్వే చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్కూరు గ్రామానికి చెందిన హనుమంతుకు గ్రామంలోని సర్వే నంబరు 91/1లో 2.31 ఎకరాలు, 91/3లో 1.78 ఎకరాల భూములుండగా రీసర్వే పేరుతో 3.12 ఎకరాలకు తగ్గించారు. ఆయన వద్ద పట్టాదారు పాసు పుస్తకంతో సహా అన్ని ఆధారాలు ఉన్నాయి. ఆ భూమి కొందరు వైకాపా అనుచరులకు కలవడం వివాదాస్పదంగా మారింది. రీ సర్వే చేయమని పెట్టుకున్న అర్జీలను పట్టించుకోకపోవడంతో బాధితుడు అమరావతిలోని తెదేపా ప్రధాన కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు.
వర్కూరు గ్రామానికే చెందిన చెన్నా రాయుడికి సర్వే నంబరు 91/3లో మూడు ఎకరాలుండగా.. రీసర్వే అనంతరం 1.72 ఎకరాలు



మాత్రమే ఉన్నట్లు చూపారు. ఆయన భూమి సరిహద్దులో ఉన్న వైకాపా అనుచరులకు కలిసింది. దీంతో ఈయన కూడా తెదేపా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులపై విచారణ చేయాలని కర్నూలు ఆర్డీవోకు ఆదేశాలు రావడంతో విచారణ ప్రారంభించారు. వర్కూరు గ్రామంలో సుమారు 50 ఎకరాలకు పైగా భూములను పలువురు రీసర్వేలో కోల్పోగా వారిలో అత్యధికులు తెదేపా వారే ఉన్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

**విలువైన భూములు సొంతం**

రెండేళ్ల కిందట రీసర్వే సమస్యలు తలెత్తినప్పుడు ఆయా రైతులు తమకు జరిగిన అన్యాయాన్ని తెలుసుకొని హతాశులయ్యారు. బీకే కృష్ణకు చెందిన 1.18 ఎకరాల 67 సెంట్లు, బీకే రంగడుకు చెందిన 1.18 ఎకరాల 69 సెంట్లు, బీకే వెంకటేశ్‌కు చెందిన 1.09 ఎకరాల 33 సెంట్లు, బీకే కేశన్నకు చెందిన 33 సెంట్ల భూములు రాయించుకున్న గుర్తించారు. ఏడాది క్రితం ఆయన తలారి ఉద్యోగానికి రాజీనామా చేసి కోడుమూరు తహసీల్దారు కార్యాలయంలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన అక్రమాలపై బాధితుడు బీకే కృష్ణ అమరావతిలోని తెదేపా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

**సర్వే నంబర్లు తెలియక సమస్య: దస్తగిరి, మాజీ తలారి, వర్కూరు**

వర్కూరు గ్రామంలోని సర్వే నంబరు 174లో 3.78ఎకరాలు, నా తల్లికి 5 ఎకరాల భూమిని 1986లో ప్రభుత్వం కేటాయించింది. పదేళ్ల క్రితం ఆన్‌లైన్ చేయించుకున్నాను. సర్వే నంబరు తెలియక వేరే భూమిలో సాగు చేసుకుంటున్నా. వాళ్లు నా భూమిలో సాగు చేసుకుంటున్నారు. రీసర్వే సమయంలో భూమి ఎక్కడుందన్న విషయం నిర్ధారణ కావడంతో తప్పిదం వెలుగులోకి వచ్చింది. కృష్ణ పూర్వీకులకు గోనెగండ్ల తిప్పనూరులో 3.48 ఎకరాల భూమిని కేటాయించారు.

# పాఠశాలలో ఆటంకం

పాణ్యం : గిరిజన విద్యార్థుల కోసం గత వైకాపా ప్రభుత్వం క్రీడా పాఠశాలను ఆర్భాటంగా ప్రకటించింది. పాఠశాలను ఏర్పాటు చేసి, సౌకర్యాలు కల్పించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 194 మంది విద్యార్థులుండగా.. గురుకుల పాఠశాలలో 170 మంది, క్రీడా పాఠశాలలో 24మంది చదువుకుంటున్నారు. పాణ్యం మండలంలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాలను 2022-23లో క్రీడా పాఠశాలగా మార్చుతున్నట్లు ప్రకటించారు. కర్నూలుతోపాటు కడప, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం, గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లో 6, 7, 8వ తరగతులు చదువుతున్న ఎస్టీ విద్యార్థినులకు 2023 ఫిబ్రవరిలో ప్రవేశాలు కల్పించారు. మొదటి ఏడాదిలో అథ్లెటిక్, ఖోఖో, హ్యాండ్‌బాల్, వాలీబాల్, తదితర క్రీడల్లో శిక్షణ ఇవ్వగా.. రెండో ఏడాది అథ్లెటిక్, జూడో, హాకీలో, ప్రస్తుతం అథ్లెటిక్, హాకీలో శిక్షణ ఇస్తున్నారు.

**క్రీడా సామర్థ్య పరీక్షలతో ప్రవేశాలు**

క్రీడా పాఠశాలలో చేరాలంటే 7 క్రీడా సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తారు. 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 400 మీటర్ల రన్నింగ్, మెడిసిన్ బాల్‌పుట్, 6X10 మీటర్ల షటిల్‌రన్, వెర్టికల్ జంప్, ఫ్లెక్సిబుల్ టెస్టు తదితర పరీక్షలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి ప్రవేశాలు కల్పిస్తారు.
చదువుతోపాటు ఉదయం, సాయంత్రం రెండు గంటల చొప్పున సాధన చేయిస్తున్నారు. అథ్లెటిక్స్, జూడో, హాకీ శిక్షకులను నియమించినా.. మైదానాలు లేకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు.

వేధిస్తున్న అసౌకర్యాలు

ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాలతోపాటు క్రీడా పాఠశాలకు అదనంగా సీట్లు కేటాయించారు. అసౌకర్యాలు, ఆలస్య ప్రవేశాలతో విద్యార్థినులు ఆసక్తి చూపడం లేదు. 2023లో ఒక్కో తరగతికి 30 సీట్ల చొప్పున 6-8 తరగతులకు 90 సీట్లు కేటాయించగా.. 30మంది విద్యార్థినులు మాత్రమే చేరారు. 2023-24లో 6-9వ తరగతుల్లో 120 సీట్లకు 51మంది, 2024-25లో ప్రవేశాలు నిర్వహించకపోవడంతో ఉన్న 41మంది విద్యార్థులతోనే కొనసాగించారు. ఈ ఏడాది ఇప్పటివరకు ప్రవేశాల ప్రకటన రాకపోవడంతో ప్రస్తుతం 24మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. క్రీడా పాఠశాల నిర్వహణపై సందేహాలు నెలకొంటున్నాయి.

**నిధుల కేటాయింపులో మొండిచేయి**

ఈ పాఠశాలలో అనువైన మైదానాలు, తరగతి గదులు, వసతిగృహం ఉండాలి. క్రీడలకు ప్రత్యేక తరగతి సమయాలు, విద్యార్థులకు బడ్జెట్ కేటాయించి ప్రత్యేక ఆహారం అందించాలి. వీరి భోజనం కోసం రోజూ రూ.125 మంజూరు చేయాల్సినా.. ఇప్పటి వరకు ఎలాంటి బడ్జెట్ కేటాయించకపోవడంతో విద్యార్థులకు సాధారణ భోజనంతోనే సరిపెడుతున్నారు. మైదానాలను అభివృద్ధి చేయకపోవడంతో పాఠశాలలో ఉన్న ఖాళీ స్థలంలోనే విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్నారు. మైదానాల్లో గడ్డి, పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. చిన్నపాటి వర్షం పడినా బురదమయమై.. ఆడుకోలేని పరిస్థితి నెలకొంటుంది. లాంగ్‌జంప్, హైజంప్, ప్రత్యేక ట్రాక్, హాకీ కోర్టు వంటివి ఏర్పాటు చేయలేదు.

# మార్కెట్‌కు వెళ్లాలంటే వణుకే!



అనంతపురం: పురపాలికల్లో కూరగాయల మార్కెట్లు అత్యంత అధ్వానంగా మారాయి. అపరిశుభ్రతకు చిరునామాగా నిలుస్తున్నాయి. పరిసరాల్లో కుళ్లిపోయిన కూరగాయలు, వ్యర్థాలను పారబోస్తుండటంతో చుట్టూ పశువులు చేరుతున్నాయి. వర్షం పడితే మరింత దారుణంగా ఉంటుంది. నిర్వహణ లేకపోవడంతో మార్కెట్ల లోపల బురద, నీరు చేరి కొనుగోలుదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కళ్యాణదుర్గం, గుంతకల్లుతోపాటు అనంతపురం నగరంలో ఈ పరిస్థితి దాపురించింది. సరైన వసతులు లేకపోవడంతో నేలమీదే విక్రయాలు సాగిస్తున్నారు. అపరిశుభ్రత, దుర్గంధం కారణంగా మార్కెట్‌కు వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు.
నగరంలోని పాతూరు కూరగాయల మార్కెట్‌కు వెళితే బురద అంటించుకోవాల్సిందే. వర్షం పడితే అడుగుపెట్టలేని దుస్థితి. పైగా ఇరుకిరుకుగా ఉండటంతో ఒకరినొకరు తోసుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. పశువులు సైతం మార్కెట్‌లో తిరుగుతూ మరింత ఇబ్బంది పెడుతున్నా పట్టించుకునేనాథుడే లేరు. నిత్యం వందలాది మంది వస్తుంటారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. కొందరు వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడరు. పెద్ద దుకాణాలు 32 వరకు ఉండగా.. మిగిలిన వంద దుకాణాల వారు నేలపైన కూరగాయలు పోసుకొని.. పైన ప్లాస్టిక్ పట్ట ఏర్పాటు చేసుకుని విక్రయిస్తుంటారు. కొత్తూరులో 300 దుకాణాలతో మార్కెట్ సముదాయం ఉన్నా కేవలం మూడు చోట్ల కూరగాయలు విక్రయిస్తున్నారు. మిగిలినవి ఖాళీగా ఉండటం గమనార్హం.

నగరపాలిక: అనంతపురం
జనాభా: 3.46 లక్షలు

**ఉన్నది కూల్చివేతతో..**

పట్టణంలోని టీ కూడలిలో నూతన మార్కెట్ నిర్మాణం చేపట్టాలని వైకాపా హయాంలో నిర్ణయించారు. దీంతో అప్పట్లో అక్కడి పాత భవనాన్ని తొలగింప చేశారు. తరువాత దాన్ని పట్టించుకోకపోవడంతో కూరగాయల విక్రయానికి రహదారి దిక్కయింది. ఆర్‌అండ్‌బీ అతిథిగృహం పక్కనే తాత్కాలిక మార్కెట్కు అధికారులు స్థలం చూపినా ప్రయోజనం లేకపోయింది. కొందరు అద్దె గదుల్లో, ఎక్కడపడితే అక్కడ రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకొంటున్నారు. జగ్జీవన్ రాం విగ్రహ సమీపంలో రహదారిపైన విక్రయాలు సాగిస్తున్నారు.

నగరపాలిక: కళ్యాణదుర్గం
జనాభా: 53,173

రాలేం..పోలేం!

మున్సిపల్ మార్కెట్‌లో సౌకర్యాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. వ్యాపారులు షెడ్లలో అమ్మకాలు చేపట్టడం లేదు. రోడ్లపైనే సరకు పెట్టి విక్రయిస్తున్నారు. వర్షం వస్తే తలదాచుకోవడానికి కొనుగోలు దారులు పరుగులు తీయాల్సి వస్తోంది. ముందే ఇరుకైన మార్కెట్.. రోడ్లను ఆక్రమించుకుని అమ్మకాలు చేస్తుండటంతో రాకపోకలు సాగించడానికి గగనంగా మారుతోంది. వాహనాల్లో వచ్చేవారు మార్కెట్‌లోకి వెళ్లడానికి, తిరిగి వచ్చేందుకు నానా తంటాలు పడుతున్నారు. నీటి వసతి లేదు. పాత మరుగుదొడ్లు వినియోగించే స్థితిలోలేవు. ఆక్రమణలు తొలగించి కొత్త షెడ్లను నిర్మించాలని అధికారులు నిర్ణయించినా కార్యరూపం దాల్చలేదు.

నగరపాలిక: గుంతకల్లు
జనాభా: 1.80 లక్షలు

**కౌన్సిల్ తీర్మానాలు బుట్టదాఖలు**

ప్రధాన పురపాలికల్లో అభివృద్ధి పనులను చేపట్టి ప్రజలకు సౌకర్యాలు కల్పించడానికి కౌన్సిళ్ల సమావేశాల్లో తీర్మానాలు చేయడం.. తర్వాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. ఏళ్లుగా గడుస్తున్నా ఆయా తీర్మానాలకు అతీగతీ లేదు. ప్రజలు కనీస అవసరాలు తీరక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కీలకమైన వాటికే దిక్కులేదు..**

గుంతకల్లు, గుత్తి, మున్సిపాలిటీల్లో రూ.కోట్లు విలువైన పనులకు ప్రతి కౌన్సిల్ సమావేశాల్లో ఆమోదాలు తెలుపుతున్నారు. దస్త్రం దాటి ఆయా పనులు జరగడం లేదు. గుంతకల్లు పురపాలికలో గత ఆరేళ్లలో జరిగిన కౌన్సిల్ సమావేశాల్లో పలు పనులకు ఆమోదం తెలిపారు. వీటిల్లో 114 దుకాణసముదాయాల నిర్మాణం,. పట్టణ హాలును రూ. 9 కోట్లతో పూర్తి చేయాలనుకున్నా అతీగతీ లేదు. పొట్టిశ్రీరాములు కూడలిలో టవర్ క్లాక్ నిర్మాణం కలగా మిగిలిపోయింది. సమగ్ర మురుగు కాలువల నిర్మాణ పనులు సాగలేదు. రూ.4 కోట్లతో పలు కాలనీల్లో రోడ్ల విస్తరణ చేయాలనుకున్నా ఆగిపోయింది.
తాడిపత్రి పురపాలికలో గత వైకాపా ప్రభుత్వం నుంచే అభివృద్ధి పనులను చేపట్టేందుకు కౌన్సిల్‌లో తీర్మానాలు చేసి వదిలేశారు. చేనేత కాలనీ, టైలర్స్ కాలనీ, శ్రీనివాసపురం, సంజీవనగర్ వంటి పలు కాలనీల్లో శివారు వీధుల్లో సీసీరోడ్లు, భూగర్భ మురుగునీటి వ్యవస్థ, తాగునీటి పైపుల ఏర్పాటు చేసేందుకు రెండు దఫాలుగా తీర్మానించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి సుమారు రూ.15కోట్లతో పనులు చేసేందుకు తీర్మానించారు. నిధుల్లేక పనులు చేపట్టలేదు.
గుత్తిలోని చెట్నేపల్లిలో రూ.20 లక్షలతో సిమెంటు రోడ్డును నిర్మించాలని రెండేళ్ల కిందట తీర్మానించారు. తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు రూ. 20 లక్షలు కేటాయిస్తూ మూడేళ్ల కిందట పనులకు ఆమోదం తెలిపారు. రెండే కిందట సెంట్రల్ పార్కు ఏర్పాటుకు రూ. కోటి, రోడ్లు, మురుగు కాలువలు తదితర 33 పనులను చేయడానికి రూ.2.50 కోట్లను కేటాయించినా అవన్నీ బుట్టదాఖలయ్యాయి.

**నిధులు సమకూరగానే పనులు: నయీం అహమ్మద్, మున్సిపల్ కమిషనర్** గుంతకల్లు మున్సిపాలిటీలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి చేసిన తీర్మానాల అమలుకు కృషి చేస్తున్నాం. రూ.65 కోట్లను కేటాయించాలని ప్రభుత్వానికి నివేదించాం. ఈవిషయాన్ని ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. నిధులు మంజూరు చేసిన వెంటనే టెండర్లు నిర్వహించి పనులను ప్రారంభిస్తాం.

# చెక్‌డ్యామ్‌ను చెరబట్టారు



కదిరి : వర్షపునీటిని నిల్వ ఉంచి ప్రత్యక్షంగా మూగజీవాల దాహార్తి తీర్చడం.. పరోక్షంగా భూగర్భజలాలు పెంచే లక్ష్యంతో నిర్మించిన చెక్‌డ్యామ్‌ను కొందరు స్వార్థపరులు చెరబట్టారు. కదిరి మండలం ముత్యాలచెరువు పంచాయతీ పరిధిలోని కరావులకుంట సమీపంలో 15 సంవత్సరాల కిందట పంచాయతీరాజ్‌శాఖ సుమారు రూ.లక్ష అంచనాతో చెక్‌డ్యామ్ నిర్మించింది. భగీరథపల్లి పరిసరాల్లోని కొండల్లో నుంచి వచ్చే నీటిని నిల్వ ఉంచేలా అధికారులు దీన్ని నిర్మించారు. ఏటా వర్షాకాలంలో నీటితో నిండిపోయేది. గొర్రెలు, మేకలు దాహార్తి తీర్చుకునేందుకు వీలుగా ఉండేది. దీంతోపాటు సమీప బోరుబావుల్లోనూ నీటిమట్టం పెరిగేందుకు దోహదపడేది.

**కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం** ప్రధాన రహదారి విస్తరణతో అడవిలోకి వెళ్లేందుకు దారి లేకుండా కొందరు పొలాల యజమానులు చుట్టూ కంచె వేసుకున్నారు. చెక్‌డ్యామ్ ఆవతలి వైపునకు వెళ్లే కొందరు వ్యక్తులు స్వార్థంతో అందులో నుంచి దారి ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. సమీపంలోని బండల పరిశ్రమల్లోని వ్యర్థాలను ఇక్కడికి తరలించి రోడ్డు వేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంపై విమర్శలకు దారి తీస్తోంది.

**బాధ్యులపై చర్యలు తీసుకుంటాం: పోలప్ప, ఎంపీడీఓ, కదిరి**

వ్యక్తిగత స్వార్థంతో చెక్‌డ్యామ్‌కు నీరు చేరకుండా ఆటంకం కలిగించిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకుంటాం. అందులోని వ్యర్థాలను తొలగిస్తాం. మునుపటిలానే వర్షపునీరు చెక్‌డ్యామ్‌కు చేరేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

# సమస్యల వలయంలో బీటీ జలాశయం

గుమ్మఘట్ట: జిల్లాలోనే మధ్యతరహా ప్రాజెక్టులో ఒకటైన భైరవాని తిప్ప ప్రాజెక్టు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఈ ఏడాది ప్రాజెక్టులో 90 శాతం(1653 అడుగుల) నీరు చేరినా.. స్థానికంగా కనీస సౌకర్యాలు కల్పించలేదు. పరిసరాలు అస్తవ్యస్తంగా మారాయి. ప్రాజెక్టు నిర్వహణ సరిగా లేకపోవడంతో పర్యాటకులు, మత్స్యకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కట్టకు లోపల, బయట ఏర్పడిన బొరియలు ప్రమాదకరంగా మారడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రాజెక్టు నిండుగా కంపచెట్లే**

ప్రాజెక్టులో కొన్నేళ్లుగా నీరు చేరకపోవడంతో కంపచెట్లు విపరీతంగా మొలిచాయి. ఈ ఏడాది నీరు పుష్కలంగా చేరినా.. ప్రాజెక్టులో ఎక్కువశాతం కంప వల్ల పరిస్థితులు అస్తవ్యస్తంగా మారాయి. చేరిన నీటిని స్థానిక అధికారులు నిల్వచేసుకోవడానికి కనీస ప్రయత్నాలు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. గతంలో కంపచెట్లు ఉన్న ప్రాంతం నుంచి నీరు లీకవుతున్నా.. పట్టించుకునే కరవయ్యారు. అయినా అధికారులు పాఠాలు నేర్వలేదు. రాయదుర్గం, కర్ణాటక ప్రాంతం నుంచి సెలవు రోజుల్లో పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. ఏపుగా పెరిగిన కంపచెట్లతోపాటు స్థానికంగా సేద తీరేందుకు కనీస సౌకర్యాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు.

**రక్షణ చర్యలేవి?** రిజర్వాయర్ గేట్ల వద్ద ఏర్పాటు చేసిన వాక్‌వే సగానికిపైగా తుప్పు పట్టింది. ఇద్దరి కంటే ఎక్కువ వ్యక్తులు నడిస్తే కూలిపోయే ప్రమాదం ఉంది. ప్రాజెక్టు అస్తవ్యస్త పరిస్థితులు ఇటీవల మంత్రి పర్యటిస్తున్న సమయంలోనే వెలుగులోకి వచ్చినా..
నేటికి పట్టించుకున్న దాఖలాలు కరవయ్యాయి. స్పిల్‌వే వద్ద కనీస రక్షణ చర్యలు లేవు. అక్కడికి ఎవరూ వెళ్లకుండా కనీసం కాపలా, లేదా గేట్‌కు తాళాలైనా వేయాల్సి ఉన్నా.. అధికారులు శ్రద్ధ పెట్టడంలేదు. దీంతో ఆటుగా వెళ్లేవారెవరైనా ప్రాజెక్టులోకి పడిపోయే ప్రమాదం నెలకొంది.

**ప్రతిపాదనలు పంపాం: హరి, ప్రాజెక్టు ఇంజినీర్**

ప్రాజెక్టు వాక్‌వే మరమ్మతులకు ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. కంపచెట్లు ఎప్పటికప్పుడు తొలగించేలా తగు చర్యలు తీసుకుంటాం. ప్రాజెక్టు రక్షణకు త్వరలో సెక్యూరిటీని ఏర్పాటు చేసేలా తగు చర్యలు తీసుకుంటాం.

# ఔషధం.. అగ్గువ

కర్నూలు : జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఔషధాల ధరలపై 12 శాతం ఉన్న పన్నును 5 శాతానికి తగ్గించింది. దీంతో వాటి ధరలు దిగొచ్చాయి. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్యారోగ్యశాఖ, ఔషధ నియంత్రణ శాఖ, సర్వజన వైద్యశాల, కంటి ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలో వారం రోజుల పాటు ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

**దుకాణాల ఎదుట వివరాలు**

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 3 వేల ఔషధ దుకాణాలు ఉన్నాయి. జీఎస్టీ 2.0 సంస్కరణల అనంతరం సెప్టెంబరు 22వ తేదీ నుంచి తగ్గింపు ధరలు అమల్లోకి వచ్చాయి. ఈ విషయం వినియోగదారులకు తెలిసేలా ఔషధ హోల్‌సేల్, రిటైల్ దుకాణాల ఎదుట తగ్గిన ధరల వివరాలు ప్రదర్శించాలి. ఇప్పటికే పలు మందులు షాపుల వద్ద ధరల వివరాలతో కూడిన పత్రాలు ప్రదర్శిస్తున్నారు. దీంతో పాటు కొనుగోలుదారులకు తప్పకుండా రసీదు ఇవ్వాలని.. దానిపై సవరించిన జీఎస్టీ ప్రకారం ఎమ్మార్పీ తగ్గించి మందులు



విక్రయిస్తున్నట్లు స్టాంపు వేయాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇవి అమలయ్యేలా జిల్లా డ్రగ్ కంట్రోల్ అథారిటీ ఏడీ రమాదేవి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు.

**వేటికి ఎంత తగ్గించారు**

గుండె, మూత్రపిండాల జబ్బులు, మధుమేహం, క్యాన్సర్ బాధితులు వినియోగించే మందులతో పాటు వైద్య పరీక్షల కిట్లు, ఆయుర్వేద, హోమియోపతి, యునాని ఔషధాలు, హెర్బల్ ఉత్పత్తులు, పంచకర్మ చికిత్సలపై పన్నును 5 శాతానికి పరిమితం చేశారు.
అవయవ మార్పిడి వంటి చికిత్సల్లో ఉపయోగించే 36 ప్రాణ రక్షక మందులపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేశారు.
వైద్య అవసరాలకు వినియోగించే ఆక్సిజన్‌పై 18 శాతం ఉన్న సుంకం 5 శాతానికి తగ్గింది. వీటితో పాటు థర్మామీటర్లు, మెడికల్ కిట్లు ఇతర వైద్య సంబంధిత వస్తువులపై పన్నుల భారం తగ్గడంతో ఈమేరకు ధరలు కూడా తగ్గాయి.

# తలుపులు ధ్వంసం.. తడులకు కష్టం

ఎమ్మిగనూరు : జిల్లా పశ్చిమ ప్రాంత జీవనాడి తుంగభద్ర దిగువ కాల్వ నీరు చేనుకు చేరడం లేదు. జిల్లాలో ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల పరిధిలో 74 కి.మీ. మేర ప్రధాన కాల్వ ప్రవహిస్తోంది. రెండు సీజన్లకు కలిపి 24 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నారు. 724 క్యూసెక్కుల మేర నీరు ప్రవహించేలా కాల్వ నిర్మించారు. 1,51,134 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాలి. ప్రధాన కాల్వ తలుపుల(షట్టర్ల)కు ఏళ్లుగా నిర్వహణలేక తుప్పుపట్టాయి. ఎక్కడికక్కడ రంధ్రాలు పడటంతో నీరంతా లీకేజీ అవుతోంది. బృందం 17 కి.మీ. మేర పరిశీలన చేయగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. లీకేజీ వల్ల ఏటా 2.5 టీఎంసీల నుంచి 3 టీఎంసీల నీరు వృథా అవుతోంది. దొడ్డిమేకల ఎస్కేపు నీరంతా వంక పాలవుతోంది. రెండు గేట్లు అమర్చారు. అవి తుప్పు పట్టడంతో నీరంతా వంకలో పారుతోంది. తలుపులు మూసినా.. కింద భాగం నుంచి లీకేజీ కావడంతో ఆయకట్టుకు నీరు అందడం లేదు. 45వేల ఎకరాల సాగు ప్రశ్నార్థకమవుతోంది.

**తుప్పు పట్టినా పట్టించుకోరు**

గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. షట్టర్లు, గేజ్ మార్పిడి, రంగులు, గ్రీజు పూయడానికీ నిధులు ఇవ్వలేదు. కొన్నింటికి రంధ్రాలు పడినా పట్టించుకోలేదు.
కౌతాళం, మాధవరం, పెద్దకడబూరు, ఎమ్మిగనూరు డీసీఆర్ (డ్రాప్ కం రెగ్యులేటర్), గుడేకల్లు, మిట్టసోమాపురం, గాజులదిన్నె(జీడీపీ) గేట్లకు గ్రీజు, ఇతర మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. షట్టర్లు సరిగా లేక నీరు వదిలిన సమయంలో కాల్వలు కోతకు గురై.. రివిట్‌మెంట్ దెబ్బతింటోంది. కౌతాళం, మాధవరం, కోసిగి, ఎమ్మిగనూరు, గంగవరం, చిన్నకొత్తిలి, పొనకలదిన్నె, గోనెగండ్ల, సూగూరు డిస్ట్రిబ్యూటరీల పరిధిలో సుమారు 35వేల ఎకరాలు బీడు భూములుగా మారాయి. మరమ్మతుల కోసం కూటమి ప్రభుత్వం రూ.8 కోట్లు కేటాయించినా పనులు ప్రారంభించలేదు. ప్రధాన గేట్లు: కౌతాళం, మాధవరం, సూగూరు, పెద్దకడబూరు, గుడేకల్లు, ఎమ్మిగనూరు (డీజీఆర్), మిట్టసోమాపురం వంకలకు గేట్లు: మాధవరం, చిన్నతుంబళం, గంగవరం, గాజులదిన్నె ఎస్కేప్అధ్వానంగా ఉన్నవి: ప్రధాన కాల్వ 45 కి.మీ. డిస్ట్రిబ్యూటరీ పరిధిలో 105 కిలోమీటర్లు, పిల్ల కాల్వలు.
డిస్ట్రిబ్యూటరీలు: 15 వీటి పరిధిలో కాల్వ పొడవు: 190.5 కి.మీ.
పిల్ల కాల్వల స్లూయిస్: 310 కాల్వలు
వీటిలో దాదాపు 250 కాల్వలకు స్లూయిస్ లేవు.

# కేసీ లాకులు.. నిధులివ్వక లీకులు

నంద్యాల : ఉమ్మడి జిల్లాలో సాగునీటి వ్యవస్థకు ఇబ్బందులు తప్పడం లేదు. నీటిపారుదల శాఖ పరిధిలో కీలకమైన లాకుల నిర్వహణ, గేట్లు, షట్టర్ల మరమ్మతులు వంటి పనులపై అధికారులు దృష్టి సారించడం లేదు. ఫలితంగా సాగునీరంతా వృథాగా పోతోంది. కేసీ కాలువ పరిధిలో కోడుమూరు నియోజకవర్గంలోని సుంకేసుల ఆనకట్ట నుంచి ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి మండలంలోని రాజోలు ఆనకట్ట వరకు 32 చోట్ల ఉన్న లాకులు దాదాపు దెబ్బతిన్నాయి. 1.75 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించడంలో కేసీ కాల్వలో ప్రధాన నీటి నియంత్రణ వ్యవస్థైన సంతజూటూరు పికప్ ఆనకట్ట పాత్ర ఎంతో కీలకం. దీని షట్టర్లు పూర్తిగా దెబ్బతిని తుప్పు పట్టిపోయాయి.
బ్రిటిషు వారి హయాంలో హెడ్ రెగ్యులేటర్ల వద్ద 10 గేట్లు ఏర్పాటు చేశారు. ఇవీ దెబ్బతిన్నాయి. ఐదేళ్ల కిందట వైకాపా ప్రభుత్వ హయాంలో సుమారు రూ.50 లక్షలతో ఫాలింగ్ షట్టర్లు ఏర్పాటు చేశారు.
ఒక్కసారి షట్టర్లు ఏర్పాటుచేస్తే ఐదేళ్ల వరకు మరమ్మతులు అవసరం లేదు. పనులు నాసిరకంగా చేయడంతో వ్యవస్థ అధ్వానంగా మారింది.

గేట్లు దెబ్బతిని..

వెలుగోడు రిజర్వాయర్ వద్ద షట్టర్లు కొన్ని పనిచేయడం లేదు. 1ఆర్ స్లూయిస్ గేటు మరమ్మతులకు గురైంది. 3.9 కి.మీ ప్రాంతంలో మైనర్ బ్లాక్ వద్ద మరమ్మతులు చేయాల్సి ఉంది. బ్లాక్ నంబరు-13 వద్ద గేటు సరిగా పనిచేయడం లేదు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 49వ బ్లాకు పరిధిలో ప్రధాన కాలువపై ఉన్న స్లూయిస్ గేట్లు దెబ్బతిన్నాయి.

**నీటి విడుదలకు ఇబ్బందులు**

నంద్యాల మండల పరిధిలోని పొన్నాపురం గ్రామ సమీపంలో నూనెపల్లె సప్లయ్ ఛానల్ ఉంది. పొన్నాపురం నుంచి గోస్పాడు మండలం తేళ్లపురి గ్రామం వరకు కేసీ కాలువ ద్వారా 20 వేల ఆయకట్టుకు నీరందించే బ్యాంక్ కెనాల్ లాకులు శిథిలావస్థకు చేరుకున్నాయి.
కేసీ ప్రధాన కాలువ నుంచి పంట కాలువలకు నీటి విడుదల ఇక్కడి నుంచే జరుగుతుంది. లాకులు దెబ్బతినడంతో నీటి విడుదల కష్టంగా మారింది.
గోస్పాడు మండలం జిల్లెల గ్రామ సమీపంలో ఉన్న సప్లయ్ ఛానల్ లాకులు అధ్వానంగా మారాయి. గోస్పాడు, కోవెలకుంట్ల, దొర్నిపాడు మండలాల పరిధిలో సుమారు 20 వేల ఎకరాల ఆయకట్టు ఈ ఛానల్ పరిధిలో ఉంది.

**నెమ్మదించిన ఓఅండ్ఎం పనులు**

వివిధ సాగునీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించి షట్టర్లు, గేట్లు, తూముల మరమ్మతులకు ఓఅండ్ఎం కింద నిధులు మంజూరయ్యాయి. పనులు మందకొడిగా సాగుతున్నాయి. కేసీ కాలువ షట్టర్లు, తూముల మరమ్మతులకు సంబంధించి సబ్ డివిజన్లు చేసి కోడుమూరు, కర్నూలు, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం, నంద్యాల, బనగానపల్లి నియోజకవర్గాల పరిధిలో 133 పనులకు రూ.9,35,55,000 విడుదలయ్యాయి. పనులు వివిధ దశల్లో ఉన్నాయి. సాగునీరు విడుదల కావడంతో పలుచోట్ల పనులు ఆగిపోయాయి.

## మాల్దీవ్స్ అందాలు.. కాజల్ సోయగాలు.. పిక్స్ చూశారా?

సీనియర్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ గురించి అందరికీ తెలిసిందే. తన యాక్టింగ్ తో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అమ్మడు.. స్పెషల్ ఫ్యాన్ బేస్ కూడా క్రియేట్ చేసుకున్నారు. లక్ష్మీ కళ్యాణం మూవీతో ఇండస్ట్రీలోకి వచ్చిన బ్యూటీ.. తన అందం, అభినయంతో తెలుగు ఆడియన్స్ మనసులో నిలిచిపోయారు. చందమామ మూవీతో టాలీవుడ్ చందమామగా మారారు. ఆ తర్వాత దాదాపు అందరి స్టార్ హీరోలతో ఆడిపాడిన అమ్మడు.. స్టార్ హీరోయిన్ గా మారిపోయిందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. బాక్సాఫీస్ వద్ద అనేక హిట్స్ కూడా అందుకున్న కాజల్.. కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడు ప్రేమలో పడి ప్రియుడిని పెళ్లి చేసుకున్న విషయం అందరికీ తెలిసిందే. 2020లో గౌతమ్ కిచ్లూను వివాహం చేసుకున్న కాజల్ అగర్వాల్.. 2022లో కుమారుడు నీల్ కిచ్లూకు జన్మనిచ్చారు. అయితే



పెళ్లి అయ్యాక కొన్ని సినిమాల్లో కనిపించిన బ్యూటీ.. బాబు పుట్టాక తర్వాత పూర్తిగా సినిమాలకు దూరమైంది. కాస్త గ్యాప్ ఇచ్చి లేడీ ఓరియెంటెడ్ మూవీ సత్యభామలో నటించారు. కానీ అనుకున్న స్థాయిలో హిట్ అందుకోని కాజల్.. ఆ తర్వాత మంచు విష్ణు భక్త కన్నప్ప మూవీలో పార్వతీ దేవిగా కనిపించారు. ఇప్పుడు బాలీవుడ్ లో ఓ సినిమా చేస్తున్నారు. అయితే ఓ వైపు సినిమాలు.. మరోవైపు ఫ్యామిలీ లైఫ్ ను లీడ్ చేస్తున్న కాజల్.. సోషల్ మీడియాలో తన అభిమానులతో ఎప్పుడూ దగ్గరగా ఉంటారు. ఎప్పటికప్పుడు ఫ్యామిలీతో వెకేషన్స్ కు వెళ్లే టాలీవుడ్ చందమామ రీసెంట్ గా మాల్దీవ్స్ వెళ్లారు. ఇప్పుడు ఆ పిక్స్ ను షేర్ చేయగా.. ప్రస్తుతం అవి ఫుల్ వైరల్ అవుతున్నాయి. "మాల్దీవ్స్.. నేను హ్యాపీగా మంత్లీ మీటింగ్. అంతులేని ఆకర్షణ, శాశ్వతమైన కాంతి, ప్రకృతి అత్యంత ఆకర్షణీయమైన రన్‌వేలా అనిపించే సూర్యాస్తమయాలతో ప్రతిసారీ ఆకర్షించింది" అంటూ రాసుకొచ్చారు అయితే పిక్స్ లో కాజల్ వేరే లెవెల్ లో ఉన్నారు. ఎల్లో, బ్లూ, వైట్ కలర్ స్విమ్ సూట్స్ లో దిగిన ఫోటోస్ పోస్ట్ చేయగా.. ఒక్కొక్కటి ఓ రేంజ్ లో ఉంది. ఆమె పోజులు, లుక్స్ అదిరిపోయాయి. తన సోయగాలకు ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే అన్నట్లు ఉన్నాయి చిత్రాలు. కొడుకుతో నడుస్తున్న పిక్ క్యూట్ గా ఉండగా.. భర్తతో ఐకానిక్ పోజ్ ఇచ్చారు అమ్మడు. మొత్తానికి 40 ఏళ్ల వయసులో కాజల్ హీట్ పుట్టిస్తున్నారని చెప్పాలి. మరి ఆమె పిక్స్ ను చేశారా?

## ఫ్లాపుల్లో లీలమ్మ డబుల్ హ్యాట్రిక్

టాలెంట్, గ్లామర్, మంచి డ్యాన్సులు.. వీటన్నింటితో పాటూ చక్కగా మాతృభాషలో మాట్లాడే తెలుగమ్మాయి శ్రీలీల. పెళ్లి సందడి2 తో టాలీవుడ్ లో కెరీర్ ను స్టార్ట్ చేసిన శ్రీలీల ఆ సినిమాలో తన యాక్టింగ్, డ్యాన్సులతో అందరినీ మెప్పించింది. తర్వాత రవితేజతో ధమాకా సినిమా చేసింది. ఆ సినిమా మంచి హిట్ గా నిలవడంతో శ్రీలీలకు ఆఫర్లు క్యూ కట్టాయి. ఒకనొక టైమ్ లో శ్రీలీల నుంచి నెలకో సినిమా రిలీజైంది. అయితే లీలకు ఆఫర్లైతే వస్తున్నాయి కానీ అవేవీ తన కెరీర్ ను నెక్ట్స్ స్టేజ్ కు తీసుకెళ్లలేకపోతున్నాయి. ప్రస్తుతం శ్రీలీల బ్యాడ్ టైమ్ కంటిన్యూ అవుతుంది. హిట్ కొట్టాలని ఎంతో ఆశగా ఉన్న అమ్మడి కోరిక ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. శ్రీలీల



నుంచి వచ్చిన సినిమాలన్నీ వరుస ఫ్లాపులవడంతో రవితేజతో చేసిన మాస్ జాతరపై అమ్మడు భారీ ఆశలే పెట్టుకుంది.

**శ్రీలీల ఖాతాలో ఎక్కువ ఫ్లాపులే..** రవితేజ, శ్రీలీల కాంబినేషన్ లో గతంలో వచ్చిన ధమాకా బ్లాక్ బస్టర్ అవడంతో మాస్ జాతర కూడా అదే స్థాయి సక్సెస్ ను అందుకుంటుందని భావిస్తే, అంచనాలను తలకిందులు చేస్తూ ఆ సినిమా డిజాస్టర్ గా నిలిచింది. ఫలితంగా శ్రీలీల ఖాతాలో మరో ఫ్లాప్ నమోదైంది. అయితే శ్రీలీల ఫిల్మోగ్రఫీని చూసుకుంటే అమ్మడి ఖాతాలో ఎక్కువగా ఫ్లాపులే ఉన్నాయనేది స్పష్టమవుతుంది. ధమాకా తర్వాత శ్రీలీల సోలో హీరోయిన్ గా వచ్చిన సినిమా ఏదీ సూపర్ హిట్ అయింది లేదు. పెళ్లి సందడి హిట్టవగా, ధమాకా బ్లాక్ బస్టర్ అయింది. తర్వాత రామ్ పోతినేనితో చేసిన స్కంద ఫ్లాపుగా నిలిచింది. నందమూరి బాలకృష్ణతో చేసిన భగవంత్ కేసరి హిట్టైనప్పటికీ ఆ సక్సెస్ బాలయ్య, అనిల్ ఖాతాలోకి వెళ్లింది తప్పించి శ్రీలీలకు దక్కలేదు. ఆదికేశవ, ఎక్స్‌ట్రాఆర్డినరీ మ్యాన్ డిజాస్టర్లుగా నిలవగా మహేష్ తో చేసిన గుంటూరు కారం యావరేజ్ గా నిలిచింది. తర్వాత వచ్చిన రాబిన్‌హుడ్, మాస్ జాతర సినిమాలు కూడా ఫ్లాపులుగా నిలవడంతో శ్రీలీల ఎప్పుడు హిట్ అందుకుంటుందో అని తనతో పాటూ ఆమె ఫ్యాన్స్ కూడా వెయిట్ చేస్తున్నారు. ఇప్పటికే శ్రీలీల ఫ్లాపుల్లో డబుల్ హ్యాట్రిక్ ను అందుకోగా, పవన్ తో చేస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ అయినా తనకు సక్సెస్ ను ఇస్తుందేమో చూడాలి.




## శివ రీరిలీజ్ ట్రైలర్.. గూస్‌బంప్స్ గ్యారెంటీ!




టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున కెరీర్లో కల్ట్ క్లాసిక్ మూవీ శివ. సెన్సేషనల్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా తెలుగు సినీ ఇండస్ట్రీలో ఎన్నో రికార్డులు సృష్టించింది. ఎవర్ గ్రీన్ ఫిల్మ్ గా నిలిచిపోయిన ఈ సినిమా అప్పటివరకు ఓ మూస ధోరణిలో వెళ్తున్న ఇండస్ట్రీకి సరికొత్త బాటలు వేసింది. శివ సినిమా తర్వాత టాలీవుడ్ లో ఎన్నో మార్పులొచ్చాయి

**ట్రెండ్ సెట్టర్ గా నిలిచిన శివ..** దర్శకులు సినిమా తీసే విధానాన్ని, ఆడియన్స్ సినిమా చూసే విధానాన్ని శివ మూవీ పూర్తిగా మార్చేసింది. అందుకే తెలుగు మూవీ గురించి మాట్లాడాల్సి వస్తే ఇప్పటికీ శివకు ముందు, శివకు తర్వాత అని అంటుంటారు. అంతటి ట్రెండ్ సెట్టర్ మూవీ ఇప్పుడు మరోసారి థియేటర్లలో రిలీజ్ కాబోతుంది. 1989లో రిలీజైన ఈ మూవీ ఇప్పుడు 4కె ఫార్మాట్ రిలీజ్ కావడానికి ముస్తాబవుతుంది.

**నవంబర్ 14న శివ రీరిలీజ్...** శివ మూవీని రీరిలీజ్ చేయమని ఫ్యాన్స్ ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నప్పటికీ అది కుదరలేదు. టాలీవుడ్ లో ఏ సినిమా రీరిలీజైనా శివ రీరిలీజ్ ఎప్పుడని ప్రశ్నించేవారు అభిమానులు. వాస్తవానికి అటు నాగ్, ఇటు ఆర్జీవీ కూడా ఎప్పట్నుంచో ఈ మూవీని రీరిలీజ్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు కానీ వీలవలేదు. కొన్ని నెలలుగా శివ మూవీని రీమాస్టరింగ్ చేస్తున్న చిత్ర యూనిట్ నవంబర్ 14న దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. రిలీజ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో మేకర్స్ ఈ రీరిలీజ్ ట్రైలర్ ను రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ ను నార్మల్ ట్రైలర్ లాగా కాకుండా ముందుగా టాలీవుడ్ లోని కొందరు సెలబ్రిటీల వీడియో బైట్స్ తో మొదలుపెట్టారు.

శివ గురించి ఆ సెలబ్రిటీలు చెప్పిన గొప్ప మాటలను ట్రైలర్ కు జోడించి దాన్ని మరింత స్పెషల్ గా మార్చగా, ఈసారి శివ 4కె అట్మాస్ లో రీరిలీజ్ కానున్నట్టు క్లారిటీ ఇచ్చారు మేకర్స్.

## తెలిసి తప్పు చేస్తున్న బన్నీ.. ఫ్యాన్స్ ఫైర్!



అల్లు అర్జున్ ప్రస్తుతం కోలీవుడ్ డైరెక్టర్ అట్లీతో AA22xA6 అనే వర్కింగ్ టైటిల్ తో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ముంబైలో ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుగుతోంది. ప్రస్తుతం ఈ కాంబోలో రాబోయే సినిమాపై ఇండస్ట్రీలో భారీ హైప్ ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే తాజాగా అల్లు అర్జున్ – అట్లీ కాంబోలో రాబోతున్న సినిమా గురించి ఒక షాకింగ్ వార్త వినిపిస్తోంది. ఇది చూసిన చాలామంది అభిమానులు అల్లు అర్జున్ పై ఫైర్ అవుతున్నారు. తెలిసి తప్పు చేస్తుంటే మండిపడుతున్నారు పైగా ఆ మ్యూజిక్ డైరెక్టర్ వద్దే వద్దు అంటూ అల్లు అర్జున్ ని వేడుకుంటున్నారు. మరి ఇంతకీ అట్లీ – బన్నీ కాంబోలో రాబోతున్న సినిమాకి మ్యూజిక్ డైరెక్టర్ గా ఎవరు చేయబోతున్నారు అనేది ఇప్పుడు తెలుసుకుందాం.. అల్లు అర్జున్ – అట్లీ కాంబినేషన్ లో రాబోతున్న సినిమాకి మ్యూజిక్ డైరెక్టర్ గా సాయి అభ్యంకర్ పేరు ఖరారు అయినట్టు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే సాయి అభ్యంకర్ పేరుని అఫీషియల్ చేయకపోయినప్పటికీ కొన్ని నివేదికలు మాత్రం ఈయన పేరు వైరల్ చేస్తున్నాయి. ఇక ఈ విషయం బయట పడడంతోనే చాలామంది అల్లు అర్జున్ అభిమానులు సాయి అభ్యంకర్ వద్దే వద్దు అంటూ పోస్టులు పెడుతున్నారు.

ఎందుకంటే సాయి అభ్యంకర్ అంత ఫేమస్ అయిన మ్యూజిక్ డైరెక్టర్ కాదు..ఒకవేళ అంతగా తమిళ వారిని మ్యూజిక్ డైరెక్టర్ గా పెట్టుకోవాలనిపిస్తే ఆ అవకాశం అనిరుధ్ కి ఇవ్వండి..అంతేగాని ఇలా పేరు ఊరు లేని మ్యూజిక్ డైరెక్టర్లను పెట్టుకొని పెద్ద సినిమా పరువు తీస్తే ఎలా అని మాట్లాడుకుంటున్నారు. సాయి అభ్యంకర్ చిన్న చిన్న హీరోల సినిమాలకి మ్యూజిక్ ఇవ్వడానికి పనికి వస్తారు. కానీ అల్లు అర్జున్ అట్లీ కాంబోలో రాబోతున్న ఈ అతిపెద్ద సినిమాకి ఆయన మ్యూజిక్ సరిపోదని.. పైగా అల్లు అర్జున్ సినిమాపై అభిమానులకి ఎన్నో అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టు ప్రతి ఒక్కటి ఉండాలి. ఇందులో మ్యూజిక్ బాగుండకపోతే సినిమాకి పెద్ద దెబ్బ పడుతుంది అంటూ కామెంట్లు చేస్తున్నారు. అయితే సాయి అభ్యంకర్ ఇప్పటికే పలు సినిమాలు చేసినప్పటికీ అంత పేరైతే రాలేదు. ప్రస్తుతం ప్రదీప్ రంగనాథన్ హీరోగా చేస్తున్న డ్యూడ్ అనే తమిళ మూవీకి మ్యూజిక్ డైరెక్టర్ గా చేస్తున్నారు. ఈ సినిమా నుండి రీసెంట్గా ఊరం బ్లడ్ అనే పాట రిలీజ్ అయింది. అయితే ఈ పాట శ్రోతలను అంతగా ఆకట్టుకోలేదు.అంతేకాదు ఈ పాట ట్రాక్ లో రెగ్యులర్ ట్యూన్ లేకుండా సౌండ్ ట్రాక్ మాత్రమే ఉందని అంటున్నారు. అయితే ఇలాంటి మ్యూజిక్ చిన్న సినిమాలకు చిన్న హీరోలకు చేస్తే పనికి వస్తుంది కానీ అల్లు అర్జున్ లాంటి పాన్ ఇండియా ఇమేజ్ ఉన్న హీరో సినిమాకు చేస్తే పనికి రాదని,సాయి అభ్యంకర్ ఇచ్చే మ్యూజిక్.. అల్లు అర్జున్ మాస్ అభిమానులకు కనెక్ట్ కాకపోవచ్చని కొంతమంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎవరు ఎన్ని చెప్పినా కూడా అట్లీ, అల్లు అర్జున్ ఇద్దరూ సాయి అభ్యంకర్ ని తమ సినిమాకి తీసుకోవాలనే ఆసక్తితోనే ఉన్నట్టు తెలుస్తోంది. అయితే ఇదే చివరి నిర్ణయం కాకపోవడంతో చాలామంది అభిమానులు సోషల్ మీడియా వేదికగా అల్లు అర్జున్ ని రిక్వెస్ట్ చేస్తున్నారు.మీ సినిమాకి పెద్ద మ్యూజిక్ డైరెక్టర్ ని తీసుకోండి అంటూ పోస్టులు పెడుతున్నారు. మరి చూడాలి అల్లు అర్జున్ అట్లీ కాంబోలో రాబోయే సినిమాకి సాయి అభ్యంకర్ నే మ్యూజిక్ డైరెక్టర్ గా ఫిక్స్ చేస్తారా లేక మరెవరినైనా ఎంచుకుంటారా అనేది ముందు ముందు తెలుస్తుంది.

## మీనాక్షి జోరు జీరోకి దగ్గరలో!

టాలీవుడ్ కి ఉవ్వెత్తున దూసుకొచ్చింది మీనాక్షి చౌదరి. తొలి సినిమా %-%ఇచట వాహనములు నిలుపరాదు%-%తో డీసెంట్ హిట్ అందుకుంది. ఆ సినిమా రిలీజ్ కు ముందే అమ్మడిలో ప్రతిభను గుర్తించిన గురూజీ త్రివిక్రమ్ సక్సెస్ అవుతుందని ముందే జోస్యం చెప్పారు. ఆయన అన్నట్లుగానే సక్సెస్ అయింది. వరుస అవకాశాలతో బిజీ నటిగా మారింది.గుంటూరు కారంలో సెకెండ్ లీడ్ ఛాన్స్ ఇచ్చి గురూజీ సైతం ప్రోత్స హించారు. అంతకుముందే హిట్ ది సెకెండ్ కేస్ తో మరోహిట్ ఖాతాలో వేసుకుంది. అదే సమయంలో కోలీవుడ్ లో కోలై చిత్రంతో లాంచ్ అయింది. అక్కడా అనుకున్నట్లుగా అవకాశాలు బాగానే వరించాయి. ఆరంభంలో దళపతి విజయ్ సరసన ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ లో ఛాన్స్ అందు కుంది. మొత్తంగా గత ఏడాది ఆరు సినిమాలతో ప్రేక్షకుల మధ్యలోనే ఉంది. కానీ వాటిలో విజయాలెన్ని అంటే? ఒకటి రెండే కనిపిస్తున్నాయి. మరి ఈ వైఫల్యాలు మీనాక్షి జోరుకు బ్రేక్ లు వేసాయా? ఆజోరు




జీరోకి కూడా పడిపోయే అవకాశం ఉందా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది. ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం తో బ్లాక్ బస్టర్ అందు కుంది. అదీ సెకెండ్ లీడ్ లోనే. సినిమా పెద్ద విజయం సాధించినా? చేతిలో కొత్త సినిమాలైతే ఏవీ కనిపించలేదు. ప్రస్తుతం అనగనగా ఒక రోజు అనే సినిమా చేస్తోంది. ఈ సినిమా ప్రారంభమైన దగ్గర నుంచి మళ్లీ ఎలాంటి అప్ డేట్ లేదు. ఇది మీనాక్షి కెరీర్ లో ఏమాత్రం ఊహించనది. అమ్మడు స్పీడ్ కు స్టార్ లీగ్ లో చేరడం పెద్ద పనిగా కనిపించలేదు. సక్సెస్ తో వచ్చిన గుర్తింపు..పెర్ఫార్మర్ కావడంతో? ఆ ట్యాలెంట్ తో స్టార్ లీగ్ ఈజీ అనుకున్నా? చేతిలో ఛాన్సులు లేకపోవడం అన్నది వెనక్కి లాగుతోంది. మరి అమ్మడు ఈ దశను ఎలా దాటుంతుందో చూడాలి. ప్రస్తుతం నాయికల మధ్య పోటీ ఎలా ఉంది? అన్నది చెప్పాల్సిన పనిలేదు. ట్యాలెంట్ తో పాటు అదృష్టం కూడా ఉంటేనే అవకాశాలు వస్తున్నాయి. పైగా మీనాక్షి చౌదరి కొన్ని పరిమితులతోనే నటిగా కొనసాగుతోంది. గ్లామర్ పాత్రలకు తొలి నుంచి దూరంగానే ఉంది. ఆ కారణంగానూ కొన్ని అవకాశాలు కోల్పోయింది. మరి ఇప్పుడు ఛాన్సులు లేని వేళ సడలింపు ఇస్తుందా? ఇచ్చినా ఇండస్ట్రీ కొత్త చాన్సులు కల్పిస్తుందా? అన్నది వేచి చూడాలి.

## రాజా సాబ్ ఆ టార్గెట్ అందుకుంటాడా..?

రెబల్ స్టార్ ప్రభాస్ మారుతి కాంబినేషన్ లో వస్తున్న రాజా సాబ్ చిన్నగా 2026 సంక్రాంతి రేసుకి కన్ఫర్మ్ అయ్యింది. అసలైతే ఈ ఇయర్ సమ్మర్ అదే ఏప్రిల్ లోనే రావాల్సిన ఈ సినిమా దసరాకి వస్తుందని అనుకున్నారు. ఫైనల్ గా డిసెంబర్ 5కి రిలీజ్ లాక్ చేశారు. ఇప్పుడు ఆ డేట్ ని కూడా పుష్ చేస్తూ జనవరి 9, 2026 రిలీజ్ అంటున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సినిమాల రిలీజ్ విషయంలో ఈ కన్ ఫ్యూజన్ కొనసాగుతూనే ఉంది. ఐతే పెద్ద టార్గెట్ పెట్టుకున్నారు కాబట్టి సరైన టైం రిలీజ్ చేస్తే బెటర్ అనే ప్లాన్ కనిపిస్తుంది.

**థ్రిల్లర్ జోనర్ లో రాజా సాబ్..** రాజా సాబ్ సినిమా థ్రిల్లర్ జోనర్ లో సంథింగ్ స్పెషల్ మూవీగా వస్తుంది. ఐతే ఈ సినిమా టార్గెట్ మాత్రం చాలా పెద్దగానే ఉందని టాక్. ప్రభాస్ సినిమా మరోసారి 1000 కోట్ల టార్గెట్ పెట్టుకుందని తెలుస్తుంది. మారుతి డైరెక్షన్ లో



వస్తున్న ఈ థ్రిల్లర్ సినిమాలో కామెడీ, ఎంటర్టైన్మెంట్ తో పాటు గూస్ బంప్స్ సీన్స్ కూడా ఉంటాయని తెలుస్తుంది. అందుకే ఈ సినిమాను కచ్చితంగా ప్రేఖకుల అంచనాలను అందుకుంటుందని అంటున్నారు. రాజా సాబ్ సినిమాతో మరోసారి ప్రభాస్ బాక్సాఫీస్ స్టామినా ప్రూవ్ చేయాలని అనుకుంటున్నారు. ఈ సినిమాలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తున్నారు. థమన్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమా మ్యూజిక్ పరంగా కూడా నెక్ట్ లెవెల్ అనేలా ఉంటుందట. ఇక మరోపక్క ప్రభాస్ కూడా తన మాస్ స్టామినా ఏంటన్నది చూపించాలని చూస్తున్నాడు.

**ఈగర్ గా నార్త్ సైడ్ రెబల్ ఫ్యాన్స్..** ప్రభాస్ రాజా సాబ్ థ్రిల్లర్ జోనర్ లో వచ్చే ఒక కమర్షియల్ ఎంటర్టైనర్. సినిమా నుంచి వచ్చిన టీజర్ ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. నార్త్ సైడ్ ఉన్న రెబల్ స్టార్ ఫ్యాన్స్ అయితే ప్రభాస్ రాజా సాబ్ కోసం ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాతో ప్రభాస్ కి మరో 1000 కోట్ల కలెక్షన్స్ ఇవ్వాలని చూస్తున్నారు. ప్రభాస్ కూడా ఈ సినిమాపై సూపర్ కాన్ ఫిడెంట్ గా ఉన్నట్టు తెలుస్తుంది. బాహుబలి 2 తో 1000 కోట్లు కలెక్ట్ చేసిన ప్రభాస్ లాస్ట్ ఇయర్ వచ్చిన కల్కి 2898 ఏడితో మళ్లీ 1000 కోట్లు కలెక్షన్స్ కొల్లగొట్టాడు. మరి రాజా సాబ్ తో హ్యాట్రిక్ 1000 కోట్లు కొడతాడా లేదా అన్నది చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536